www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

16

ప్రకాశం

గురువారం 24 ఆగస్టు, 2017



వినోదరాయునిపాలెంలో జరిగిన టంగుటూరి జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి శిద్దా రాఘవరావు (ఇన్‌సెట్లో) విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల తదితరులు



- టంగుటూరి 148వ జయంతి వేడుకల్లో మంత్రి శిద్దా
- వినోదరాయునిపాలెంలో కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న పరకాల , ఎమ్మెల్సీ కరణం , ప్రముఖులు

ఎనలేనివి 'ప్రకాశం' సేవలు

వినోదరాయునిపాలెం (నాగులుప్పలపాడు) : దేశానికి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర అటవీ ,పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. బుధవారం వినోదరాయుని పాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన ప్రకాశం పంతులు 146 వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు టంగుటూరి స్మారకంగా నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా ప్రకాశం జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నామన్నారు. స్వాతంత్ర్య సమరోద్యమంలో తెల్లదొరల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలబడి దేశభక్తిని చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ఆవిష్కరించటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వినోదరాయుని పాలెంను **మిగతా 15వ పేజీలో...**



నంద్యాలపై.. రాజా కాయ్ కాయ్

- రూపాయి నుంచి రూపాయిన్నరకు పెంచిన వైసీపీ అనుకూల బెట్టింగ్ రాయుళ్లు
- ఎంతకైనా సై అంటున్న టీడీపీ అనుకూలురు
- గ్రామాల్లోనూ గ్రూపుల వారీ మూకుమ్మడి బెట్టింగ్‌లు
- ఓ కుగ్రామంలోనే కోటి రూపాయల పందెం
- రాత్రికి మళ్లీ తగ్గిన పందెం రాయుళ్లు
- ఓ సీఐ సమాచారంతో రెచ్చిపోయిన ప్రతిపక్ష పార్టీ అభిమానులు

9 లో

పెద్దాసుపత్రికి సమస్యల రోగం

- నేటికీ గుర్తింపునకు నోచుకోని రిమ్స్
- మూలన పడ్డ పరికరాలు -రోగులకు తిప్పలు
- సిబ్బంది, వైద్యనిపుణుల కొరత

8 లో



ఒంగోలులోని రిమ్స్ వైద్యశాల



- పొగాకు ఉత్పత్తి లక్ష్యం ఖరారు
- గత ఏడాది కన్నా ఆరు మిలియన్ కిలోల పెంపు
- పెంచిన దానిలో ఉత్తరాదికే అధికం
- బోర్డు సమావేశం వద్ద దక్షిణాది రైతుల నిరసన

15 లో

136 మిలియన్ కిలోలు

- వచ్చేనెల 30న నీటిని విడుదల చేయనున్న సీఎం
- అదే రోజు కొరిశపాడు ఎత్తిపోతల ప్రారంభం
- పెండింగ్ పనులపై యంత్రాంగం దృష్టి
- ప్రాజెక్టు అధికారులతో సీఈ భేటీ

'గుండ్లకమ్మ'కు ముహూర్తం ఖరారు

ఒంగోలు, ఆంధ్రజ్యోతి : గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు మరోసారి ముహూర్తం ఖరారు అయింది. వచ్చే నెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. అదే రోజున కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన సమాచారం ఉన్నతాధికారుల నుంచి అందింది. ఆ లోపు పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు రావడంతో తదనుగుణ చర్యలపై జిల్లా యంత్రాంగం **మిగతా 15వ పేజీలో...**



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీఈ వీర్రాజు

సంస్కరణలు తెచ్చిన మహోన్నత వ్యక్తి 'ప్రకాశం'


ప్రకాశం మనవడు గోపాలకృష్ణతోపాటు స్వాతంత్ర్య సమరయోధుడ్ని సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు పరకాల, మంత్రి శిద్దా, ఎమ్మెల్సీ బలరాం, ఎమ్మెల్యే స్వామి, కలెక్టర్ వినయ్‌చంద్

- ప్రకాశం పంతులు సేవలకు గుర్తింపే రాష్ట్ర పండుగ
- ప్రకాశం స్ఫూర్తితో అభివృద్ధి
- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల


ప్రకాశం విగ్రహానికి పూలమాల వేస్తున్న పరకాల

ఒంగోలు కలెక్టరేట్ : ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో నీరు, భూ యాజమాన్యంలో అనేక సంస్కరణలు తెచ్చిన మహోన్నత వ్యక్తి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్ కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లోని ప్రకాశం భవన్‌లో బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు, జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు, ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి, యండవల్లి శ్రీనివాసరెడ్డి, శాసనసభ్యులు డాక్టర్ స్వామి, డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్‌లతో కలిసి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు అశ్వర్థనారాయణ, ప్రకాశం పంతులు మనమడు టంగుటూరి గోపాలకృష్ణలను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పరకాల మాట్లాడుతూ ప్రకాశం పంతులు సేవలను స్మరించుకునే విధంగా ఆయన జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగగా నిర్వహిస్తుందన్నారు. ఆయన స్ఫూర్తిగా ప్రకాశం జిల్లా ఏర్పాటుతో పాటు జిల్లా పరిపాలన భవన్(కలెక్టరేట్)ను ప్రకాశంపేరుతో ఏర్పాటు చేశారని చెప్పారు. మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ప్రకాశం పంతులు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, ఏఎస్పీ ఉదయరాణి, డీఆర్వో డాక్టర్ ఎన్. ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు ఎన్. పోలప్ప, ఎంఎస్ మురళీ, కె.టి. వెంకయ్య, సాయికుమారి, డాక్టర్ యాస్మిన్, లక్ష్మీదుర్గ, మురళీకృష్ణ, డాక్టర్ రవి, సంక్రాంతి వెంకట కృష్ణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.ఎల్. నరసింహారావు, వివిధ రంగాల ప్రముఖులు చండూరి రంగారావు, బి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చాయచిత్ర ప్రదర్శన

సమాచర పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన చాయచిత్ర ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రకాశం పంతులు జీవిత చరిత్రను తెలిసే విధంగా ప్రదర్శన ఏర్పాటు చేయడంతో పలు వర్గాల ప్రజానీకం, వివిధ శాఖల అధికారులు సందర్శించి ప్రకాశం పంతులును స్మరించుకున్నారు.



ప్రకాశం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బ్రాహ్మణ సంఘనేతలు

టంగుటూరి ప్రకాశంకు ఘన నివాళులు

ఒంగోలు కల్చరల్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం అనేక మంది ప్రముఖులు, సంస్థల వారు ఘనంగా నివాళులర్పించారు. లాయర్‌పేట రైతుబజారు వద్దనున్న టంగుటూరి కాంస్య విగ్రహానికి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సి.వి.యల్. సుబ్రహ్మణ్యం, ధేనువకొండ వెంకటసుబ్బారావు, బొల్లాపల్లి సుబ్బారావు పలువురు బ్రాహ్మణ సంఘ నేతలు ప్రకాశానికి నివాళులర్పించారు. గాయత్రి ఆధ్యాత్మిక మండలి ఆధ్వర్యంలో మండలి అధ్యక్ష, కార్యదర్శులు మైనంపాటి సాయికుమార్, పమిడిఘంటం శివరామకృష్ణ ప్రసాదు, న్యాయవాది కృపాసాగర్ తదితరులు మువ్వన్నెల పూలమాలను ప్రకాశం విగ్రహానికి అలంకరించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.కుసుమకుమారి, టీడీపీ నాయకులు ఎస్.ఎ.టి. రాజేష్, కామేశ్వరరావు, చీమలమర్రి వెంకటసుబ్బారావు, స్వయంపాకుల యల్లమంద కోటేశ్వరశర్మలు నివాళులర్పించారు. రైలుపేటలోని వింగ్స్ ఇండియా ఫౌండేషన్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. దాదాపు వందమంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వింగ్స్ ఇండియా నిర్వాహకులు చింతపల్లి రామకృష్ణ, ఉదయజానకి లక్ష్మి ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేశారు.



కుసుమకుమారి ఆధ్వర్యంలో ప్రకాశం విగ్రహానికి నివాళి

ఏకదంతుని ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- అందంగా స్టేజీల అలంకరణ
- వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు
- వివిధ చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు కల్చరల్ : గణనాయకాయ, గణాధ్యక్షాయ, గణేశానాయ ధీమహి అంటూ భక్తులు పరవశించిపోతు నిర్వహించే గణపతి నవరాత్రులు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వీటి నిర్వహణకు జిల్లా అంతటా ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే వినాయక విగ్రహాలు చాలా వరకు ఆయా గ్రామాలకు చేరుకున్నాయి. స్టేజి ఏర్పాటు, అలంకరించటం వంటి పనులతో నిర్వాహకులు బిజీగా ఉన్నారు. నగరంలోనూ అనేక చోట్ల నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఉత్తర బైపాస్ రోడ్డులోని విఘ్నేశ్వరనగర్‌లో ఉన్న వరసిద్ధి వినాయక దేవస్థానం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదీ భారీ ఏర్పాట్లు చేశారు. రాజాపానగల్ రోడ్డులో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అందమైన సెట్టింగులు ఏర్పాటు చేస్తుంటారు. 21 ఏళ్లుగా విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న వీఐపీ రోడ్ వినాయక బాల భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా అంతే ఘనంగా ఉత్సవాల నిర్వహంచటానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కమిటి ప్రతినిధి రావూరి ఆంజనేయులు తెలిపారు. అటు జక్రయ్యనగర్‌లో గణేష్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ రకాల వస్తువులతో వినాయకుని అలంకరించి భక్తులకు కనువిందుచేసే దక్షిణం బజారు వినాయకుడు సైతం తయారవుతున్నారు. గాంధీరోడులో గోల్డ్, సిల్వర్ మర్చంట్ ఆధ్వర్యంలో, పలు వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటవుతున్నాయి.

పండుగ నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోలుతో వ్యాపార కూడళ్లు రద్దీగా మారాయి. పూలదండలకు గిరాకీ పెరుగుతోంది. దీంతో పూలవ్యాపారులు ధరలను భారీగా పెంచారు. మామూలుగా రూ.700 నుంచి రూ.800 వరకు ఉండే గజమాలను ప్రస్తుతం రూ.1500 వరకు అమ్ముతున్నారంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు. వస్త్రాలు కొనుగోలు చేసే వారితో దుకాణాలు సైతం కళకళలాడుతున్నాయి. అనేక వస్త్రవ్యాపార సంస్థలు పోటీపడి ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

ఎన్నో స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయటానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు 8000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు క్లబ్ నిర్వాహకులు తెలియజేశారు. లయన్స్ క్లబ్, ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం మట్టి ప్రతిమల పంపిణీ చేయనున్నారు. సంతపేట సాయి బాబా మందిరంలో భక్తులకు వినాయకుని మట్టి ప్రతిమలతో బాటు తులసి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు అళహరి చెంచలరావు తెలిపారు.

సహజంగా వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు ప్రతి రోజూ ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం పరిపాటి. వీటిలో సినిమా పాటకచ్చేరి, డాన్స్ బేబి డాన్స్ వంటి వాటికి బాగా డిమాండ్ ఉండగా అక్కడక్కడా హరికథలు, మిమిక్రీ, మ్యాజిక్ షో, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలోని గాయనీ గాయకులు, వాయిద్య కళాకారులు, వివిధ రకాల కళాకారులకు సైతం డిమాండ్ ఏర్పడింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అటు లైటింగు, మైకు సెట్టు, స్టేజి అలంకరణ, డ్రామా డ్రెస్ కంపెనీలకు సైతం డిమాండు పెరిగింది. నవరాత్రుల సందర్భంగా అనేక రంగాల వారికి తాత్కాలికంగానైనా ఉపాధి లభిస్తోంది. ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ పరస్పర సంఘీభావంతో భక్తిదాయకంగా నిర్వహించుకోవాలని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.


నగరంలో సిద్ధం చేస్తున్న వినాయక మండపాలు


డ్రైఫ్రూట్స్ వినాయకుడు


విజయ్ డిజిటల్
వినాయకచవితి స్పెషల్ ఆఫర్స్
32 HD LED ₹16,500/-*
40 HD LED ₹25,500/-*
40 4K LED ₹38,990/-*
55 4K LED ₹69,900/-*
65 4K LED ₹99,990/-*
6.0 Kg Front Load ₹21,000/-*
6.5 Kg Front Load ₹26,500/-*
7.0 Kg Front Load ₹32,500/-*
170 Lts Single Door ₹9,990/-*
190 Lts Single Door ₹11,600/-*
210 Lts Single Door ₹14,550/-*
240 Lts Single Door ₹16,500/-*
250Lts Frost Free ₹20,000/-*
1.0 Ton Split AC ₹22,990/-*
1.5 Ton Split AC ₹26,990/-*
1.5 Ton Inverter AC ₹35,990/-*
కేవలం రూ. 1/- చెల్లించి
మీకు నచ్చిన వస్తువు తీసుకెళ్ళండి
సెలెక్టెడ్ మోడల్స్ పై మాత్రమే
KALYANI ADS
iPhone
Available in 32 / 128 / 256 GB
iPhone 7 EMI Per Month
₹5000/-*
Galaxy S8 | S8+
S8 EMI Per Month ₹4825/-*
S8+ EMI Per Month ₹5491/-*
SAMSUNG Galaxy J7 Max
EMI Per Month ₹1790/-*
SAMSUNG Galaxy J7 PRO
EMI Per Month ₹2090/-*
CAPITAL FIRST
HDB FINANCIAL SERVICES
From the trusted family of HDFC Bank
Paytm
BAJAJ FINSERV
0% Finance
ప్రతి కొనుగోలు పై ఒక ఆకర్షణీయమైన బహుమతి పొందండి
ప్రియమైన కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
వినాయకచవితి శుభాకాంక్షలు
LG SAMSUNG SONY Panasonic Haier Godrej GENERAL DAIKIN LLOYD IFB Videocon BOSCH Butterfly ONIDA
Our Stores
ONGOLE : Prasanna Nilayam, Kurnool Road, ✆ 08592-282620, 282621
GUNTUR : Arundelpet, Main Road, ✆ 0863-2217717, 27
GUNTUR : Chandana Brothers Complex, Jinna Tower, ✆ 0863-2226464
GUNTUR : Haier Exclusive Showroom, Revenue Complex ✆ 0863-2345559
GUNTUR : Opp. L.V.R. Club, Koritepadu Main Road, ✆ 0863-2211559
GUNTUR : L.G. Best Shopee, ✆ 0863-2336464
GUNTUR : Mahatma Gandhi Inner Ring Road, ✆ 9246655559
TENALI : Gandhi Chowk, ✆ 08644-238827,47
MANGALAGIRI : RR Towers, Near Old Bus Stand, ✆ 08645-233664
NARASARAOPET : Bank Street, Arundelpet, ✆ 08647-222559, 229559
CHILAKALURIPET : Sai Karthik Citi Centre, G.T. Road, ✆ 9640755559, 9640855559
VIJAYAWADA : Opp. Chennupati Petrol Bunk, Moghalrajpuram, ✆ 0866-2499008, 2499009
VIJAYAWADA : Bhavanipuram, Swathi Theatre Road, Sivalayam Center, ✆ 0866-2414193, 2414194

సబ్సిడీ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

రాచర్ల: సబ్సిడీ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆంధ్రప్రగతి గ్రా మీణ బ్యాంక్ మేనేజర్ బీవీ.శర్మ అన్నారు. ఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో మేనేజర్‌తోపాటు ఎంపీడీవో అరుణాదేవి ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వా రిలో అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఎస్సీలు 19, మైనారిటీలు 69 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సయ్యద్ మస్తాన్‌వలి, మండల ఉపాధ్యక్షుడు నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

గిద్దలూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చి త్ర పటానికి స్థానిక ఎ మ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తన నివాస గృహంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్రం వచ్చేందుకు, వచ్చిన తరువాత ప్రకాశం పంతులు ప్రజలకోసం చేసిన సేవలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గుర్తు చేస్తూ నేటి తరం ప్రజలు, నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవీ.సుబ్బారావు, గిద్దలూరు, అర్థవీడు ఎంపీపీలు కడప వంశీధర్‌రెడ్డి, నన్నెబోయిన రవికుమార్, అర్ధవీడు మాజీ ఎంపీపీ కాశిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బీవీ. క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు రెడ్డి కాశిరెడ్డి, శిరిగిరి లింగయ్య, మార్తాల సుబ్బారెడ్డి, రాజశేఖర్, సూరా స్వామిరంగా రెడ్డి, పోలేపల్లి ఏడుకొండలు, రమేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా తిమ్మాపురంలో ఆం ధ్రకేసరి చి త్రపటానికి సర్పంచ్ కోటా రమేష్‌బాబు, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ కోటా నరసింహులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

కంభం: స్థానిక ఆల్ఫా ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. రితీష్‌నాయర్ టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.


ప్రకాశం పంతులు చి త్రపటానికి పూల మాలవేసి నివాళు అర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవీ.సుబ్బారావు తదితరులు

రేపు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కంభం: కంభం ఎకోవారియర్స్ ఆ ధ్వర్యంలో ఈనెల 25న మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీచేయను న్నట్లు ఎకోవారియర్స్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణను అరికట్టేందుకు తాము గత 7సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహలను త యారుచేసి ఉచితంగా పంపిణీచేస్తున్న ట్లు వారు తెలిపారు. గురువారం ఉదయం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో మట్టి విగ్రహలను పంపిణీచేస్తు న్నట్లు తెలిపారు.

ఎస్‌ఐకి సన్మానం

కంభం: ఈనెల 15న ఎస్సీ సత్యప్రసుబాబు చేతులమీదుగా ఉత్తమ ఎస్‌ఐగా ప్రశంసా పత్రం అందుకున్న రామానాయక్‌ను బీఎస్పీ జిల్లా కన్వీనర్ పా సుగంటి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండే ఎస్‌ఐ ఇలాంటి ప్రసంశా పత్రాలు, సేవా పతకాలు మరిన్ని అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బూదాల ఆనంద్, నియోజకవర్గ అధ్యక్షుడు వేముల రాజు, ప్రధానకార్యదర్శి ఇమ్మడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, సీమంతం

కంభం: స్థానిక బోర్డు స్కూల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు చిన్నారులకు అన్నప్రాసన, శీలం రాధా అను మహిళకు సీమంత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 65, 66, 67 కేంద్రాలలోని చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోర్డు స్కూలు ప్రధానోపాధ్యాయులు వి. వెంకటేశర్లు, ఉపాధ్యాయులు గఫూర్, ఖాశిం, సూపర్‌వైజర్ ఆర్ కృష్ణకుమారి, అంగన్‌వాడి టీచర్లు వి. రమాదేవి, ఎ.శారద, పీవీ.లక్ష్మీ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కౌలు రైతులు బ్యాంక్‌లలో రుణాలు పొందాలి

కొమరోలు: కౌలు రైతులు తమ దగ్గర ఉన్న కౌలు గుర్తింపు కార్డుల ద్వారా వ్యవసాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకుని తమ పరిధిలోని బ్యాంక్‌లలో వ్యవసాయ రుణాలను పొందాలని మండల వ్యవసాయ అధికారిణి జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని అక్కపల్లె, పొట్టిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వంద శాతం రాయితీపై జింక్, జిప్సం, బోరాన్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రపర్యటనలో భాగంగా కంది, టమోటా పంటలను పరిశీలించారు.

మండపాలకు తరలుతున్న గణనాథులు

కంభం: వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకొని కంభం, కందులాపురం సెంటర్లలో ఏర్పాటుచేసిన మండపాలకు విఘ్నేశ్వరుని ప్రతిమలను మేళతాళాలు, భజ భజంత్రీలతో తరలిస్తున్నారు. శుక్రవారం జరిగే వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణం లోని ముఖ్యమైన కూడళ్లలోని 50కి పైగా మండపాల్లో భారీ గణనాథుల విగ్రహలను ప్రతిష్ఠిస్తున్నారు. శుక్రవారం నుంచి భక్తుల పూజలు అందుకునే వినాయకులు శనివారం నిమజ్జనంతో వేడుక ముగుస్తుంది.

మట్టిప్రతిమలు పర్యావరణానికి మేలు

కొమరోలు: మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీని నిర్వహించారు. ఈపోటీల్లో దాదాపు 200 మంది విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారుచేసి పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలతో వాతావరణం కాలుష్యం కాదని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, రేవతి, నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంభంలో మండపాలకు తరలుతున్న గణనాథులు

పొలాలు పరిశీలన

గిద్దలూరు: పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్‌రెడ్డి వెల్లుపల్లి, జయరాంపురం గ్రామాల పరిధిలో సాగై ఉన్న ప్రత్తి పొలాలను పరిశీలించారు. రసం పీల్చే పురుగు, దోమ ఉధృతి నివారణకు కాన్ఫిడార్ లేదా ఫ్రైడ్ లాంటి పురుగుమందులను పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

నేటి నుంచి యోగా శిక్షణ

గిద్దలూరు: పట్టణంలోని కాశినాయన ఆశ్రమం ఆవరణలో గురువారం ఉదయం 5:30 నుంచి 7:30 గంటల వరకు 6 రోజుల పాటు యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ బీఎస్.నారాయణరెడ్డి తెలిపారు. 18 సంవత్సరాల వయసు పైబడిన వారు శిక్షణకు హాజరు కావచ్చునని తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలి

బేస్తవారపేట: మండలంలోని శింగరపల్లె గ్రామ జంక్షన్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఈ మార్గంలో వెళ్లేవారు శింగరపల్లె జంక్షన్ నుండి ఎటు వెళ్ళాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, శింగరపల్లె గ్రామస్థులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఐవీ రెడ్డి

నవరత్నాలు పేదలకు ఆణిముత్యాలు

గిద్దలూరు టౌన్: వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలు పేద ప్రజలకు ఆణిముత్యాల్లాంటివని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఐవీ.రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న నియోజకవర్గ స్థాయిలో నవరత్నాల కార్యక్రమాలపై కరపత్రాల ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. పేదలను ఆదుకునేందుకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పథకాలు ప్రవేశపెట్టి వారి కళ్లల్లో ఆనందం నింపనున్నారని తెలిపారు. నవరత్నాల సభను నియోజకవర్గంలోని మండల పార్టీల అధ్యక్షులు, పార్టీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, అభిమానులు విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీహెచ్.రంగారెడ్డి, బొగ్గు రామచంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి చెన్ను విజయ, జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, బేస్తవారపేట, కంభం మండల పార్టీ అధ్యక్షుడు వి.బాలిరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, గలిజేరుగుళ్ళ సొసైటీ అధ్యక్షుడు ఇండేల నాగిరెడ్డితో వైసీపీ నాయకులు బైరెడ్డి రమణ, మల్లెల శేఖర్‌రెడ్డి, సగినాల సాయిలు, బిక్కా నరసింహారెడ్డి, శీలం బాలఅంకిరెడ్డి, పల్లె పాల్ ప్రతాప్, యనవగుండ్ల పీరయ్య, ఆవుల చిన్న కోటారెడ్డి, జబ్రుల్లాఖాన్, గోపాలక్రిష్ణ, చల్లా అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కోర్టు ఫీజు స్టాంపుల కొరత తీర్చాలి

గిద్దలూరు: కోర్టు ఫీజు స్టాంపుల కొరత లేకుండా సిద్ధంగా ఉంచాలని కోరుతూ పలువురు న్యాయవాదులు బుధవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 1,2,5 రూపాయల విలువైన కోర్టు ఫీజు స్టాంపులు చాలా కాలంగా అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ విలువ గల స్టాంపులు వాడి నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని, లేదా బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ రేటుకు కొనాల్సి వస్తున్నదని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి గిద్దలూరులోనే కోర్టులు ఉన్నాయన్నారు. కోర్టు ఫీజు స్టాంపుల కొరతతో తమతో పాటు కక్షిదారులు, ప్రజలు ఇక్కట్ల కు గురవుతున్నారని, అందుబాటులో ఉంచాలని న్యాయవాదులు మల్లికార్జున రావు, రవి ప్రకాశ్‌బాబు, రంగారెడ్డి, ప్రకాశ్, సిద్దయ్య, తిరుమల ప్రసాద్, బాలరాజు తదితర న్యాయవాదులు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.


కోర్టు ఫీజు స్టాంపుల కొరత గురించి సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

బీజేపీ పట్టణ అధ్యక్షుడు కమలపాటి వెంకటచంద్రమోహన్

గిద్దలూరు టౌన్: ఇంటి ఆవరణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దూరమవుతాయని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు కమలపాటి వెంకట చంద్రమోహన్ అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పట్టణంలోని ఎస్సీపాలెంలో నిర్వహించారు. భారతీయ జనతాపార్టీ కార్యకర్తలు వీధులను శుభ్రం చేశారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 200 కుటుంబాలకు 8 వేల రూపాయల విలువ చేసే ఫినాయిల్ బాటిల్స్‌ను కమలపాటి వెంకటచంద్రమోహన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.కాసులు, కర్ర జ్యోత్స్న, మహేష్ పాల్గొన్నారు.


ఏబీఎం పాలెంలో ఫినాయిల్ పంపిణీ చేస్తున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కమలపాటి వెంకటచంద్రమోహన్

సినిమాలు

గిద్దలూరు

కృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	- ఫిదా
వెంకటేశ్వర	- లై
నటరాజ్	- జయ జానకి నాయక

భర్తకు చాడీలు చెప్పి పచ్చని కాపురంలో చిచ్చుపెట్టిన ఖాకీ

● ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

ఒంగోలు క్రైం : పచ్చనికాపురంలో కానిస్టేబుల్ వికృత చేష్టలతో చిచ్చు పెట్టాడు. దురాలోచనకు పదునుపెట్టి భార్యాభర్తల మధ్య వివాదాలు తెలెత్తేవిధంగా మహిళపైలేని పోనిమాటలు భర్తకు ఫోన్‌ద్వారా చాడీలు చెప్పాడు. దీంతో కోపోద్రికుడైన భర్త భార్యను ఇష్టానుసారంగా కొట్టాడు. భార్యభర్తల మధ్యవివాదానికి కారణం కానిస్టేబుల్‌గా భావించిన గ్రామస్తులు బార్యభర్తలకు సర్దిచెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అనంతరం పచ్చనికాపురంలో చిచ్చుపెట్టేందుకు యత్నించిన కానిస్టేబుల్‌పై ఎస్పీ సత్యఏసుబాబుకు బాధితుడు పిర్యాదు చేశాడు. తనకాపురాన్ని ముక్కచెక్కలు చేయాలని కానిస్టేబుల్ యత్నించాడని వాపోయాడు. దీంతో స్పందించిన ఎస్పీ సత్యఏసుబాబు ప్రత్యేక విచారణకు ఆదేశించారు. ఒంగోలు వన్‌టౌన్ ఎస్సై బాధితులతో పాటుగా, కానిస్టేబుల్‌ను విచారించారు. దీనిపై నేడోరేపో ఎస్పీకి నివేదిక ఇచ్చేందుకు సిద్ధం చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న మినీ లారీ - ఇద్దరి దుర్మరణం

● ఒంగోలులోని జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై ప్రమాదం

● మృతులు చిత్తూరు జిల్లా వాసులు



డివైడర్‌ను ఢీకొన్న మినీ లారీ



మినీలారీలో ఇరుక్కున్న మృతదేహాలు

ఒంగోలు క్రైం : అతివేగం, నిర్లక్ష్యం మూలంగా ఇద్దరు చిత్తూరు జిల్లా వాసులు దుర్మరణం చెందారు. డ్రైవింగ్ చేస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం మండలం చందం గ్రామానికి చెందిన డ్రైవర్ సి.జి. కృష్ణమూర్తి(33), కుప్పానికి చెందిన వాహన యజమాని గోవిందరాజులు కృష్ణ(45) అక్కడికక్కడే మృతి చెందారు. ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువపై ఉన్న జాతీయరహదారి ఫ్లైఓవర్‌పై బుధవారం ఈ సంఘటన జరిగింది. గుంటూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్ళే మినీ లారీ ఫ్లైఓవర్‌పై ఉన్న డివైడర్‌ను ఢీకొంది. 30 మీటర్ల వరకు రాసుకుంటూ వెళ్ళి ఎదురుగా ఉన్న ప్రమాద హెచ్చరిక బోర్డు పెట్టిన ఇనుపరాడ్‌ను ఢీకొట్టడంతో అది విరిగిపోయి పక్కనే ఉన్నగోడను ఢీ కొంది. దాంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో ఇరుక్కున్న మృతదేహాలను అతికష్టం మీద వారు బయటికి తీశారు. తాలూకా ఇన్‌స్పెక్టర్ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై బసవరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు!



బాలమ్మ(24) మృతదేహం

జరుగుమల్లి: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. మద్యం తాగి వెళ్లి భార్య కంఠంపై కాలుపెట్టి నులిమి చంపేశాడు. ఈ సంఘటన జరుగుమల్లి మండలం ఎన్ఎన్‌కండ్రికలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కలికివాయి కుమార్‌కు మర్రిపూడి మండలం వల్లాయిపాలెంకు చెందిన వెలగపూడి వెంకటస్వామి, సుబ్బులు కుమార్తె బాలమ్మ(24)తో 2014లో వివాహం జరిగింది. కుమార్‌కు 2010లో కనిగిరి పరిసర ప్రాంతాలకు చెందిన అమ్మాయితో మెదటి వివాహం జరిగింది. కుమార్ చెడు అలవాట్లు చూసి ఆమె వదిలి వెళ్లిపోయింది. దీంతో బాలమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఎడాదిన్నర బాబు బ్రహ్మతేజ ఉన్నా డు. ఇద్దరూ కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమార్ వ్యసనాలకు బానిసగా మారాడు. మంగళవారం కామేపల్లిలోని ఫంక్షన్‌కు హాజరైన కుమార్ మద్యం తాగి రాత్రికి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. చుట్టుపక్కల వారు వచ్చి సర్దిచెప్పారు. అయినా మరింత రెచ్చిపోయి భార్యను ఇం ట్లోకి తీసుకెళ్లి చంపేశాడు. చనిపోయిందని నిర్ధారించుకుని అనంతరం తలు పుతీసి బయటికి వచ్చాడు. స్థానికులు వెళ్లిచూసి ఆర్ఎంపీ వైద్యులను పిలిపించి చూపించారు. అప్పటికే బాలమ్మ మృతి చెందిందని చెప్పారు. బాలమ్మ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలు డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ మురళీక్రిష్ణ, జరుగుమల్లి ఎస్ఐ సోమశేఖర్‌లు, జరుగుమల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిషోర్‌లు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

37 తులాల బంగారు, 750 గ్రాముల వెండి, రూ. 1,81,000 చోరీ

కంభం: కంభం మండలంలోని పోరుమామిళ్ళపల్లిలో సోమవారం రాత్రి జరిగిన మూడు ఇళ్ళల్లో చోరీ సంఘటనలో మిగిలిన రెండు గృహాల్లో 37 తులాల బంగారం, 750 గ్రాముల వెండి, రూ.1,81,000 చోరీకి గురైనట్లు బాధితులు రాములమ్మ, లక్ష్మయ్య భార్య నాగేశ్వరిలు తెలిపారు. 3 గృహలలో చోరీ జరిగిన విషయం విదితమే మంగళవారం ఒక గృహనికి చెందిన రామాంజనేయులు రావడంతో అతని గృహంలో 11 తులాల బంగారు, రూ 40 వేలు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. కాగా మిగిలిన రెండు గృహలలోని వారు బుధవారం తెల్లవారుజామున ఇంటికి రావడంతో వారు ఏయే వస్తువులు పోయింది పరిశీలించారు. జె.రాములమ్మకు సంబంధించిన 4తులాల చైన్, కమ్మలు, వైద్య ఖర్చుల కోసం దాచిన లక్ష రూపాయల నగదు అలాగే రాములమ్మ కోడలు లక్ష్మిదేవి బీరువాలో దాచిన రెండు తులాల నక్లెస్, రెండు ఉంగరాలు, కాళ్ళ పట్టీలు, రూ.50వేలు చోరీకి గురైనట్లు అత్తా కోడళ్ళు రాములమ్మ, లక్ష్మిదేవిల తెలిపారు. పక్కంట్లో నివశిస్తున్న లక్ష్మయ్య అతని భార్య నాగేశ్వరిలు మాట్లాడుతూ బంగారు 184 గ్రాములు, వెండి 750 గ్రాములు, నగదు రూ 31,500 పోయినట్లు తెలిపారు. ఈ 184 గ్రాముల బంగారులో 50 గ్రాముల బంగారు నాణేలు, 30 గ్రాముల చైన్, 26 గ్రాముల బంగారు గాజులు, 24 గ్రాముల 3సెట్ల చెవికమ్మలు, 10 గ్రాముల చెవి రింగులు, 24 గ్రాముల బరువు ఉండే 3 ఉంగరాలు, 20 గ్రాముల డాలర్‌చైన్ పోయినట్లు తెలిపారు. యస్ఐ రామానాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వలేదని ఇనుపరాడ్డుతో దాడి

● ఇద్దరికి తీవ్రగాయాలు



వైద్యశాలలో రంగయ్య

బేస్తవారపేట: కంభం మండలం పొరుమామిళ్ళ పల్లె గ్రామానికి చెందిన వనిజా వెంకట రంగయ్యను కంభం పట్టణంనకు చెందిన చాబోలు పిచ్చయ్య దాడి చేసి గాయపరచినట్లు తెలిపారు. బాధితుడి కధనం మేరకు తాను బేస్తవారపేట మండలం చింతలపాలెం సమీపంలోని సత్యమాంబదేవి ఆలయం వద్ద కంభం తిప్పవీధికి చెందిన చాబోలు పిచ్చయ్య మంగళవారం సాయంత్రం వచ్చి ఇనుపరాడ్డుతో తలపై బాధి గాయపరచాడని ఆసమయంలో అక్కడ వున్న చాబోలు వెంకటయ్య అడ్డుకోగా ఆయనపై కూడా దాడి చేసి తన వద్ద వున్న రూ.లక్ష రూపాయలు,మోటార్‌సైకిల్,పర్సు తీసుకొని పరారైనాడని బాధితుడు ఆరోపించాంచాడు. క్షత్రగాత్రులు కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బేస్తవారపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్‌సీఎస్ వేధింపులపై సొసైటీ అధ్యక్షుల నిరసన

- భవిష్యత్ కార్యాచరణకు మద్దతు
- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్‌బాబు

ఒంగోలు విద్య: జిల్లాలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ (ఆర్‌సీఎస్) మురళి వేధింపులను సొసైటీ అధ్యక్షులందరూ ముక్త కంఠంతో నిరసించారు. జిల్లా సహకార వ్యవస్థపై ఆర్‌సీఎస్ వేధింపులపై సహకార సంఘాల అధ్యక్షుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకు బుధవారం స్థానిక వేమూరి కల్యాణ మండపంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సొసైటీ అధ్యక్షులందరూ ఆర్‌సీఎస్ చర్యలను తీవ్రంగా ఖండించారు. వేధింపులకు నిరసనగా బ్యాంకు అధ్యక్షుడు చేపట్టే భవిష్యత్ కార్యాచరణకు సొసైటీ అధ్యక్షులందరూ నైతిక మద్దతు తెలిపారు. ఎటువంటి చర్యలకైనా సిద్ధమేనని వారు సంఘీభావాన్ని తెలియజేశారు. ఆర్‌సీఎస్ వేధింపులపై ముఖ్యమంత్రిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి ఫిర్యాదు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సహకార సంఘాల అధ్యక్షులందరూ సంఘటితంగా ఆర్‌సీఎస్ చర్యలపై పోరాడాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న వేధింపుల పర్వం

ఆర్‌సీఎస్ మురళి తమపై కక్షకట్టి వేధింపులకు గురిచేస్తున్నారని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్‌బాబు ఆరోపించారు. సహకార శాఖలో ఇద్దరు ఉద్యోగుల సహకారంతో కులసంఘాల పేరుతో తప్పుడు పిటీషన్లు పెట్టించి విచారణపేరుతో ఉద్యోగులను, పాలకవర్గాన్ని వేధింపులకు గురిచేస్తున్న ఆర్‌సీఎస్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీసీఎంఎస్ అధ్యక్షుడు బీరం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సినిమా వ్యాపారం ద్వారా వచ్చిన రూ.31.94లక్షల నష్టాన్ని తానే భరించి సంస్థకు జమ చేశారనని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈదర మోహన్‌బాబు

ఈ విషయంలో సహకారశాఖ మంత్రి కలువగా నష్టం మొత్తాని తిరిగి సంస్థకు జమ చేస్తే తదుపరి చర్య లు నిలిపివేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో బ్యాంకుడైరెక్టర్ ఎస్.రామరాఘవరెడ్డి, లక్ష్మారావు, సుబ్బరాజు, యలమందరావు, అచ్చయ్య, గండికోట చినవీరయ్య, దేవరకొండ రాములు, మొత్తం 108 సొసైటీ ఆద్యక్షులు, 11మంది చేనేత సొసైటీ ఆద్యక్షులు సమావేశంలో పాల్గొన్నారు.

బోధనా విధానంలో విప్లవాత్మక మార్పులు రావాలి

ఒంగోలు విద్య: ఉపాధ్యాయుల బోధనా విధానంలో విప్లవాత్మక మార్పులు రావలసిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌సీఈఆర్‌టీ డై రెక్టర్ ఎంవీ. రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం అభ్యసన ఫలితాలు అనే అంశంపై ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఆమె మాట్లాడారు. నవంబరు 13న నిర్వహించనున్న జాతీయ స్థాయి అసెస్‌మెంట్ టెస్టు కు సంబంధించి వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలను మదింపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతీయ స్థా యిలో నిర్వహించిన వివిధ సర్వేల్లో తెలుగు విద్యార్థులు భాగా వెనకబడి ఉన్నారన్నారు. అ భ్యసన ఫలితాల్లో విద్యార్థుల వెనుకబాటు త నానికి కారణాలు అన్వేషించి వారిలో అభ్యసనాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించాల్సిన బాధ్యత ఉ పాధ్యాయులపై ఉందన్నారు. విద్యాబోధనలో పాఠ్య పుస్తకాల్లోని అంశాలకే పరిమితం కా కుండా శాస్త్రీయ పద్ధతిలో బోధించి విద్యార్థు లలో ఆలోచన, అవగాహన స్థాయిలను పెం చాలన్నారు. జాతీయ స్థాయి సర్వేల్లో ప్రశ్నల అడుగుతున్న తీరును గమనించి సమాధానాలు రాసే తార్కిత శక్తిని పెంపొందించాలన్నారు. పాఠశాలల్లో నిరంత సమగ్ర మూ ల్యాంకనాన్ని మరింత పటిష్ఠంగా అమలు ప రిచి విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలను పెం పొందించాలని రాజ్యలక్ష్మి కోరారు. అనంతరం తెలుగు, గణితం, సైన్సు, సాంఘికశాస్త్రాలలో అభ్యసన ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ యండపల్లి

ఒంగోలు నగరం: ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి బుధవారం స్థానిక సంతపేటలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థినులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. తమకు మూడు నెలల నుంచి కాస్మోటిక్ చార్జీలు ఇవ్వటం లేదన్నారు. వర్షం వస్తే గదుల్లోకి నీరు వస్తుందన్నారు. ఆర్వో ప్లాంటు పనిచేయటం లేదన్నారు.దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఆయనకు తెలిపారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమశాఖ డీడీ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో తీవ్రనిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ వెంట ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ వినోద్, సీహెచ్ సుధాకర్, కె.చిన్నప్పరెడ్డి, మోహన్, డైఫీ నాయకులుకె ఎఫ్ బాబు తదితరులు ఉన్నారు.

రిమ్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఒంగోలు నగరం: రిమ్స్ వైద్యశాలలో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రిమ్స్ వైద్యశాలను పరిశీలించారు. అన్ని వార్డులు తిరిగి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌కు తగినంత మంది సిబ్బంది లేక రోగులకు సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. ఆసుపత్రిలోని సిటి స్కాన్, గ్యాస్ట్రో స్కోపీ తదితర పరికరాలు పనిచేయటటం లేదన్నారు. రిమ్స్‌లో నీటి కొరత అధికంగా ఉందన్నారు. రిమ్స్‌కు నేటికి ఎంసీఐ అనుమతి రాక పోవటం శోచనీయమన్నారు. అనంతరం ఆయన రిమ్స్ అధికారులను కలిసి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పరిహారం కోసం మిర్చి రైతుల పాట్లు

మార్కాపురం టౌన్: గత ఏడాది మిర్చి పంట సాగుచేసి నష్టపోయిన మిర్చి రైతులకు పరిహారం అందిస్తారనే ఆశతో డివిజన్‌లోని అన్ని మండలాల రైతులు ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడిలో పూర్తిగా నష్టపోయిన రైతులు ఇప్పటికి కూడా పరిహారం పొందలేదు. ఉద్యానవన శాఖాధికారులు గతంలోనే పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించారు. నష్టపరిహారం అందకపోవటంతో గత నాలుగు రోజుల క్రితం రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతుల దరఖాస్తులను ఇచ్చినట్లయితే పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

దీనిని ఆసరాగా తీసుకొని డివిజన్‌లోని అన్ని మండలాల రైతులు కుప్పలుతెప్పలుగా దరఖాస్తులను ఆర్డీవో కార్యాలయంలో అందజేస్తున్నారు. ఇప్పటికే పరిహారం జాబితాలో పేర్లు ఉన్నవారు, ఇతర పంటల్లో పరిహారం పొందిన వారు కూడా దరఖాస్తులు ఇస్తూ గత ఏడాది పలానా సర్వే నెంబరులో ఇన్ని ఎకరాలు మిర్చి సాగు చేశామని, ఖాతా నెంబరు, ఆధార్ నెంబరుతో దరఖాస్తులు ఇస్తున్నారు. ప్రతిరోజు కార్యాలయం వద్ద రైతులు కోలాహలం ఎక్కువ కావటంతో ప్రత్యేకంగా ఒక సెల్ ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వాటిని మండలాల వారీగా కట్టలు కట్టి భద్రపరుస్తున్నారు. వాటిని మరలా ఆయా మండలాలకు పంపి అధికారుల ద్వారా విచారణ జరిపిన తరువాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండలాల నుంచి దరఖాస్తులు ఎప్పటికి ఆగిపోతాయో తెలియదు. ఈ తంతును అధికారులు ఎప్పటికి ముగుస్తారో తెలియదు. మొత్తానికి రైతులకు మాత్రం మళ్లీ ఆశలు రేకెత్తించారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మీ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్: బహిరంగ ప్రదేశాల్లో దూమపానం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మీ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో పొగాకు ఉత్పత్తులపై పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బహిరంగ ప్రదేశాల్లో దూమపానం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులు కూడా అమ్మకాలు జరగకుండా నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో ఏఎస్పీ ఉదయరాణితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం

రైతుల వ్యవసాయ భూముల నుంచి వేయనున్న హైటెన్షన్ లైన్లథక్ష భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం లేకుండా పరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ అదేశించారు. బుధవారం రాత్రి జేసీ ఛాంబర్‌లో డీఆర్వో ప్రభాకర్ రెడ్డితో కలిసి ఎస్‌పీడీసీఎల్, రెవెన్యూ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

నెల్లూరు నుంచి గుంటూరు జిల్లా పరిధిలోని మండలాల్లో లైన్ల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న అంశాలపై చర్చించారు. ఇతర జిల్లాల్లో పరిహారం ఎంత ఇచ్చారు తదితర అంశాలను అడిగి తెలుసుకున్న జేసీ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ప్రైవేటు పాఠశాలల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలి

- **ఐక్యవేదిక డిమాండ్**
- **నేడు జిల్లాలో పాఠశాలలు బంద్**



మాట్లాడుతున్న ఏపీటీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు మాంటిస్సోరి ప్రకాష్

ఒంగోలు కార్పొరేషన్ : ప్రైవేటు ఆసుపత్రులకు కల్పించిన విధంగా ప్రైవేటు విద్యా సంస్థలపై దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం అమలు చేయాలని జిల్లా ప్రవేటు విద్యా సంస్థ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక ఎంసీఏ భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏపీటీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు మాంటిస్సోరి ప్రకాష్ మాట్లాడుతూ ఇటీవల ప్రైవేటు సంస్థలపై దాడులు అధికమయ్యాయన్నారు. గతంలో ప్రైవేటు వైద్యశాలలపై దాడులు జరగ్గా, ప్రభుత్వం స్పందించి ప్రత్యేక చట్టం అమలు చేసిందన్నారు. కాగా ప్రస్తుతం ప్రవేటు విద్యా సంస్థలపైనా దాడులు, బెదిరింపులు జరగడం బాధకరమన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం విద్యా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కర్నూలులోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో జరిగిన ఘటనలో విద్యార్థి పక్షాన విచ్చేసిన కొందరు విద్యార్థి సంఘాల వ్యక్తులు విద్యాసంస్థల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులులైన శ్రీనివాసుల రెడ్డి, పుల్లయ్యలపై దాడి చేయడాన్ని వారు ఖండించారు. బాధిత విద్యార్థికి న్యాయం కోరుకునేవారైతే చట్టాలు, పోలీసులు ఉన్నారన్నారు. ఆ దిశగా సంప్రదింపులు జరపాలన్నారు. కానీ దాడులు చేయడం దారుణమన్నారు.

ప్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి వీఎన్‌జీ మాధవరావు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు భౌతిక దాడులకు దిగితే ఉపేక్షించబోమన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ఐక్యవేదిక దాడులను ఎదు ర్కొంటుందన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రవేటు విద్యా సంస్థలకు ప్రత్యేక చట్టం అమలు చే యాలని కోరారు. న్యాయ పోరాటంలో తప్పు లేదని, కానీ రౌడీల్లా దాడులు చేస్తే సహిం చబోమన్నారు. ఇందుకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రస్మా జిల్లా అధ్యక్షుడు బి.హనుమంతరావు మాట్లాడుతూ కర్నూలులో జరిగిన ఘటన పునరా వృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక సంతపేటలోని డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహణతోపాటు, కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు పా ఠశాలలు గురువారం పాఠశాలలు బంద్ పాటించి, కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేఖరుల సమావేశంలో ప్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ. సుబ్బారావు, నగర అధ్యక్షుడు శ్రీనివాస్ చౌదరి, ఏపీటీసీఏ నాయకులు వి.వి.రమణ, బి.శ్రీనివాసరావు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఆసాది వీరమ్మ(45), సామ్రాజ్యం(22) మృతదేహాలు

పురుగుల మందు తాగి తల్లీకూతుళ్ల బలవన్మరణం

చీరాలటౌన్ : ఆర్థిక ఒత్తిళ్ళు, మానసికంగా కుంగుబాటు ఒక కుటుంబంలో విషాదం నింపింది. తమను ఆదరించే వారు ఎవరూ లేరన్న దిగులుతో క్షణికావేశంలో తల్లీకూతుళ్లు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చీరాల మండలం తోటవారిపాలెంలో బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు తోటవారిపాలెం మాలపల్లికి వెళ్ళే రహదారిలో ఆసాది వీరమ్మ(45), ఆమె కుమార్తె సామ్రాజ్యం(22) నివసిస్తున్నారు. సామ్రాజ్యంకు ఇంకా వివాహం కాలేదు. వీరమ్మకు 25ఏళ్ళ క్రితం వివాహం అయ్యింది. కూతురు పుట్టిన అనంతరం భర్తతో విడిపోయి అమ్మగారి ఇంట్లోనే జీవనం సాగిస్తుంది. తన కూతురు సామ్రాజ్యాన్ని పెంచి పెద్ద చేసింది. భర్తతో సంబంధాలు లేకపోయినా కూలీ చేసి కూతురిని పెంచుతోంది. కొంతకాలంగా తల్లీకూతుళ్ళు అక్కడి నుంచి వెళ్ళిపోయి మరో చోట నివసించేందుకు యత్నించారు. కూతురికి పెళ్ళి చేసి బాధ్యత నెరవెర్చాలని తల్లి వీరమ్మ పెళ్ళి సంబంధాలు కూడా చూస్తోంది. అయితే తమను ఆదరించే వారు ఎవరూ లేరన్న దిగులు వారిని వెంటాడేది. ఈ నేపధ్యంలో బుధవారం సాయంత్రం వీరువురూ పురుగు మందు తాగారు. తల్లి వీరమ్మ ఇంట్లోనే మృతి చెందగా, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యాన్ని బంధువులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తీసుకెళుతుండగా మృతి చెందింది. చీరాల రూరల్ ఎస్ఐ దాసరి ప్రసాదు సంఘటనపై కేసు నమోదు చేశారు.

నిద్రిస్తున్నడ్రైవర్‌పై ఎక్కిన కంటైనర్

చీరాలటౌన్ : లారీ కంటైనర్ కింద నిద్రిస్తున్న డ్రయివర్‌పై కంటైనర్ ఎక్కడంతో అతడు తీవ్రంగా గాయపడిన సంఘటన చీరాల మండలం కావూరివారిపాలెంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. చీరాలరూరల్ పోలీసుల వివరాల మేరకు కావూరివారిపాలెం గ్రామ పంచాయితీలోని రొయ్యల ఫ్యాక్టరీ వద్ద తమిళనాడుకు చెందిన కంటైనర్‌ను పార్క్ చేసి డ్రయివర్ శంకర్‌రాజేష్ వాహనం కింద నిద్రకు ఉపక్రమించాడు. ఇది తెలియని మరో డ్రైవర్ వాహనాన్ని స్టార్ట్ చేయటంతో శంకర్‌రాజేష్ తొడ మీద చక్రం ఎక్కింది. తీవ్రంగా గాయపడిన శంకర్‌రాజేష్‌ను వెంటనే బాపట్లలోని వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ రిఫర్ చేశారు. విజయవాడ అవుట్‌పోస్ట్ పోలీసులు పంపిన వివరాల మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసుకున్నారు.

సైకిల్ పై నుంచి పడి ఒకరి మృతి



వెంకటసుబ్బయ్య(52) మృతదేహం

కొమరోలు : పని ముగించుకుని ఇంటి దారి పట్టిన ఓ వ్యక్తి సైకిల్‌పై నుంచి కిందపడడంతో మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామబాటలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే కుమార్ల వెంకటసుబ్బయ్య (52) మంగళవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పైన తన స్వగ్రామమైన సర్విరెడ్డిపల్లె గ్రామానికి వెలుతున్నాడు. రహదారి రాళ్ళతో గుంతలమయంగా ఉండడంతో సర్విరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద వెంకటసుబ్బయ్య సైకిల్ అదుపుతప్పడంతో కిందపడి మృతిచెందాడు. బుధవారం ఉదయం అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు వెంకటసుబ్బయ్య దారిలో పడి ఉండడాన్ని గమనించి వెంకటసుబ్బయ్యను చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. వెంకటసుబ్బయ్య కుమారుడు గురుప్రసాద్ సంవత్సరం క్రితం ఇదే దారిలో ద్విచక్ర వాహనంపై వెలుతూ కిందపడి మృతిచెందాడు. సంవత్సరం వ్యవధిలోనే కుమారుడు, భర్త మృతిచెందడంతో వెంకటసుబ్బయ్య భార్య రామలింగమ్మ బోరున విలపిస్తున్నది.

డెంగ్యూతో చిన్నారి మృతి



మృతి చెందిన చిన్నారి రోవిన్

అద్దంకి రూరల్: డెంగ్యూ జ్వరం సోకి చిన్నారి మృతి చెందిన సంఘటన అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక కళామందిర్ దియేటర్ ఎదురుగా అద్దంకి టౌన్ బాప్టిస్ట్ చర్చి నిర్వాహకులు బుల్లార్డ్ జీవన్, లావణ్యలకు రెండవ కుమారుడైన రోవిన్(4) డెంగ్యూ జ్వరంతో ఒంగోలులో ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిసిన వివరాల ప్రకారం తన కుమారునికి సోమవారం మధ్యాహ్నం నుంచి జ్వరం రావడంతో పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించగా వారు బాబు పరిస్థితి బాగోలేదని మెరుగైన చికిత్సకోసం ఒంగోలు తీసుకు వెళ్ళవలెనని సూచించారు. దీంతో హుటాహుటీన మంగళవారం బాబుని తీసుకొని ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలకు తీసుకు వెళ్ళి చికిత్స చేస్తుండగా బుధవారం సాయంత్రం మరణించాడని తల్లిదం డ్రులు బోరున విలపిస్తున్నారు.

ముగ్గురి అరెస్టు - కోర్టుకు హాజరు

గుడ్లూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగసముద్రం మండలం చినపవని గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి కందుకూరు పిడిఎం కోర్టులో హాజరుపరిచినట్లు స్థానిక ఎస్ఐ ఉన్నం వేమన బుధవారం తెలిపారు. చినపవనిలో ఇటీవల ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణకు కారణమైన సుబ్బిశెట్టి సుబ్బారావు, సుబ్బిశెట్టి రామ్మోహన్, గూడూరి మణిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా కందుకూరు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వేమన తెలిపారు.

15 మద్యం బాటిళ్ళు స్వాధీనం



వ్యక్తిని అదుపులోకి తీసుకున్నదృశ్యం

పెద్ద దోర్నాల: ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృత దాడులు నిర్వహించి వ్యక్తిని అదుపులోకి తీసుకొని 15 సారా బాటిళ్ళను స్వాధీనపరుచుకున్న సంఘటన స్థానిక బియంసి కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. అక్రమంగా నాటుసారాను వ్యాపారం చేస్తున్న భూమని వీరన్నను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్‌సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12మందికి జైలు శిక్ష

పెద్ద దోర్నాల: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా మండలానికి చెందిన 12 మందికి జైలు శిక్ష విధిం చినట్లు యస్. ఐ రామకోటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి ఉత్సవాల నేపథ్యంలో శాంతి విఘాత చర్యలు జరగకుండా ఉండేందుకు బొ మ్మలను ప్రతిష్ఠిం చే వారు ప్రభుత్వ అనుమతి పొందాలని, ఎటువంటి అ సాంఘీక చర్యలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సమస్యల్లో సర్కారు ఆసుపత్రులు

- నేటికీ గుర్తింపునకు నోచుకోని రిమ్స్
- సేవల్లో కొనసాగుతున్న నిర్లక్ష్యం
- రోగుల పట్ల జాగ్రత్తలు శూన్యం
- మూలనపడ్డ పరికరాలు
- సిబ్బంది, వైద్యనిపుణుల కొరత

ఒంగోలు నగరం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు లేక రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందటం లేదు. జిల్లాలో ప్రధాన వైద్యశాల అయిన రిమ్స్‌లో సమస్యలు తిష్టవేశాయి. పెద్దాసుపత్రిగా పిలిచే రిమ్స్‌లో రోగులకు అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. వైద్యం కోసం వస్తే జేబులు ఖాళీ చేసుకోవాల్సిన దుస్థితి రిమ్స్‌లో కనిపిస్తోంది. రిమ్స్‌లో నెలల తరబడి పరికరాలు పనిచేయక



రిమ్స్ వైద్యశాల

పోయినా పట్టించుకునే నాథుడే కనిపించటం లేదు. బయట పరీక్షలు చేయించుకునేందుకు రోగులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. రిమ్స్ వైద్యశాలలో ప్రధానంగా పరికరాలు, ప్లేట్‌లెట్స్ కొరత పీడిస్తోంది. ఈ ఆసుపత్రిలోని సిటి స్కాన్, గ్యాస్ట్రో స్కోపీ ఆరు నెలలుగా పనిచేయక పోయినా పట్టించుకోవటం లేదు. ఫలితంగా రోగులకు బయట పరీక్షా కేంద్రాలకు పంపిస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్న సిబ్బంది

వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఇక్కడ ఉంటే మీ ప్రాణాలు ఇంతే సరి అంటూ సిబ్బంది ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. సిటి స్కాన్ తీయించాలంటూ బయట పరీక్షా కేంద్రాల్లో రూ.2 వేల నుంచి రూ.,6 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. గ్యాస్ట్రో స్కోపీ కూడా పరీక్షలు కూడా రిమ్స్ వైద్యశాలలో నిలిచిపోయినా ఇంతవరకు పట్టించుకోలేదు. ఇక జిల్లాలో ఎక్కడా ప్లేట్‌లెట్స్ అందుబాటులో లేవు. ఎంతోకాలంగా, ఎన్నోసార్లు మంత్రులు ఇచ్చిన హామీలు నెరవేరనే లేదు. రిమ్స్ ప్రధాన విభాగాలు ఏర్పాటు కానే లేదు. ఇది పేరుకే పెద్దాసుపత్రి కానీ, ఇక్కడ కార్డియాలజి, నెఫ్రాలజీ, న్యూరాలజి వంటి విభాగాలు ఇంతవరకు ఏర్పాటు కానేలేదు. సిబ్బంది కొరత కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో సేవలు సన్నగిల్లుతున్నాయి. ఇక రిమ్స్ వైద్యశాలలో నీటి కొరత కూడా అధికంగా ఉంది. రిమ్స్ వైద్యశాలకు ఇంతవరకు భారత వైద్యమండలి నుంచి గుర్తింపు రాలేదు. ఇటీవల వైద్యమండలి బృందం రిమ్స్‌ను పరిశీలించి పోయింది. ఈ బృందం సంతృప్తి వ్యక్తం చేసినా గుర్తింపు ఇస్తారా లేక ఇవ్వరా అనే అంశంపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది.

సేవల్లో నిర్లక్ష్యం


రిమ్స్‌లో రోగులకు సేవలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి. జ్వరంతో వస్తే ఒక రోజులో పరీక్షలు పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ఒక రోజు డాక్టర్‌ని సంప్రదించి పరీక్షలు రాయించుకుంటే రెండో రోజే ఫలితాలు ఇస్తున్నారు. దీంతో రెండో రోజూ కూడా వచ్చి పరీక్షల ఫలితాలను తీసుకుని వైద్యుని వద్ద నుంచి మందులు రాయించుకోవాల్సి వస్తోంది. అది చిన్నపాటి రక్త పరీక్ష అయినా ఒక్క రోజులో అవుట్ పేషెంట్‌ను చూసి పంపే విధానమే రిమ్స్‌లో లేకుండా పోయింది. సిబ్బంది అంతా మధ్యాహ్నం 12 గంటలనే విధుల నుంచి వెళ్లిపోతున్నారు. ఇకరిమ్స్‌లో ప్లేట్‌లెట్స్‌ను అందుబాటులోకి తెస్తామని నేతలు ఎంతో కాలంగా ప్రకటన చేస్తూనే ఉన్నారు. గత ఏడేళ్ళగా అదిగో ఇదిగో అంటున్నారే గాని ఇంతవరకు రిమ్స్‌లో ప్లేట్‌లెట్స్ అందుబాటులోకి రానేలేదు. ఫలితంగా డెంగ్యూ వంటి రోగాల్లో రోగులకు ప్లేట్‌లెట్స్ పడిపోయి ఇతర జిల్లాకు వెళ్ళాల్సి వస్తోంది.

మాతాశిశు వైద్యశాలలో అంతంత మాత్రమే

ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో నెలకు 150 నుంచి 200 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ కేవలం నలుగురు నర్సులే పనిచేస్తున్నారు. వీరిపై పని భారం అధికంగా ఉంటోంది. మొత్తం ఈ వైద్యశాలకు 15 మంది నర్సులు అవసరం ఉండగా పది మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇక ఏడాదిన్నర కాలంగా ఆక్సిజన్ సరఫరాదారులకు బిల్లులు చెల్లించలేదు. ప్రభుత్వం నుంచి అభివృద్ధి నిధులు కూడా నిలిచిపోయాయి. దీంతో బిల్లులు చెల్లించేందుకు తగినన్ని నిధులు అందుబాటులో లేవు. జిల్లాలో ఏరియా వైద్యశాలల్లో వైద్య నిపుణుల కొరత అధికంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ కొరత అధికంగా కనిపిస్తోంది. 97 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జిల్లాలో ఉండగా ఇందులో 47 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేయగా కేవలం ఏడుగురు మాత్రమే గైనకాలజిస్టులు, మత్తు వైద్యులు, చిన్న పిల్లల వైద్యులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరు కూడా విధుల్లో చేరేది అనుమానమే అంటున్నారు వైద్యవిధాన పరిషత్ అధికారులు. ఇలా జిల్లాలో మత్తు వైద్యులు లేకపోవటం కారణంగానే అనేక మంది రోగులను ప్రభుత్వ వైద్యశాలల నుంచి చికిత్స నిరాకరిస్తూ ప్రైవేట్ వైద్యశాలలకు పంపిస్తున్నారు. ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగు నీటి సౌకర్యం పూర్తిగా అందుబాటులో ఉండటం లేదు. రోగులకు తాగునీరు కూడా అందుబాటులో లేని ఆసుపత్రులే జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఏటా పీహెచ్‌సీలకు ఆసుపత్రి అభివృద్ధి నిధులు వస్తున్నా వాటిని సక్రమంగా ఉపయోగించి రోగులకు సౌకర్యాలు కల్పించటంలో వైద్యాధికారులు విఫలం అవుతూనే ఉన్నారు.

మార్కాపురంలో వేధిస్తున్న మందుల కొరత

మార్కాపురం: మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో నిపుణులైన వైద్యులతో పాటు అన్ని సౌకర్యాలు మెరుగ్గా ఉన్నప్పటికీ మందుల కొరత వేధిస్తుంది. సుదీర్ఘకాలం తరువాత ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో దాదాపు అన్ని విభాగాలకు నిపుణులైన వైద్యులను నియమించారు. దీంతో అనూహ్యంగా రోగుల సంఖ్యల రోజురోజుకు పెరుగుతూ నేఉంది. గత ఏడాదికి ముందు రోజుకు 70 నుంచి 100 లోపు మాత్రమే ఔట్ పేషం ట్లు వస్తుండేవారు. ప్రస్తుతం రోగుల సంఖ్యలో సోమవారం 500 నుంచి 600 వరకు ఉంటే మిగతా రోజుల్లో 400కు తగ్గకుండా పరీక్షలు చేయించుకుంటున్నారు. దీంతో రోగులకు సరిపడినవన్ని మందులు ప్రభు త్వం సరఫరా చేయకపోవటంతో ఉన్న మందులతో సర్దుతూ బయట మందుల షాపులకు రాస్తున్నారు. స్త్రీల వైద్యనిపుణులు, జనరల్ సర్జన్‌లు అందుబాటులో ఉండటంతో నిత్యం ఆపరేషన్లు జరుగుతుండటంతో వార్డుల్లో రోగులు ఇన్‌పేషంట్లుగా ఉంటున్నారు. ఇన్ పేషంట్లకు మందులు అవసరమైనన్ని అందించలేకపోవటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని మందులు బయట షాపుల్లో కొనుక్కోవాల్సి రావటంతో పేద ప్రజలకు వైద్యం భారంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవసరమైన మందులను సరఫరా చేయాలని రోగులు కోరుతున్నారు.



మార్కాపురం ఏరియా వైద్యశాలలో ఉన్న అరకొర మందులు

సిలిండర్లు ఇచ్చారు...ఆక్సిజన్ మరిచారు

గిద్దలూరు : గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆక్సిజన్ సిలండర్లు మాత్రమే సరఫరా చేశారు. ఆక్సిజన్ మాత్రం సరఫరా చేయడం లేదు. ఆపరేషన్ల సమయంలో, అత్యవసర పరిస్థితుల్లో అవసరాల కోసం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దయాదాక్షిణ్యాలపై కమిటీ నిధుల ద్వారా ప్రైవేట్ వ్యాపారుల నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేయక తప్పని పరిస్దితి నెలకొంది. నిధులు అయిపోతే ఆక్సిజన్ కొనుగోలు ఆపాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం నంద్యాలలోని ప్రైవేట్ వ్యాపారుల నుంచి ఆక్సిజన్‌ను డాక్టర్లు తెప్పించుకుంటున్నారు. అన్ని రకాల మందులు దాదాపు అందుబాటులోనే ఉండగా నీటి కొరత వేధిస్తున్నది. బోరుకు నీరు అందకపోవడంతో మున్సిపల్ ట్యాంకర్ నీరే దిక్కయింది. డెంటిస్ట్, పిల్లల డాక్టర్, స్టాఫ్ నర్స్, ముగ్గురు నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలోని రక్త నిల్వ కేంద్రం లేని ఫ్రిజ్ నాలుగు నెలలుగా మరమ్మతులకు గురై ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాలంటే దాతలను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అటవీ అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలి

- బాధ్యతను విస్మరిస్తే వేటే
- అక్రమ రవాణా నిరోధానికి చర్యలు
- ఫారెస్టు అధికారులకు వెపన్లు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం
- అటవీశాఖ మంత్రి శిద్దా వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్ : రాష్ట్రంలోనే ఆటవీశాఖ కు ప్రత్యేక గుర్తింపు తేవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపైనే ఉందని, బాధ్యతను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదని రాష్ట్ర ఆటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సీపీవో సమావేశపు హాలులో బుధవారం సాయంత్రం ఆటవీ శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పనిచేస్తున్న ఫారెస్టు అధికారుల పనితీరు సమాచారం మొత్తం తన వద్ద ఉందని, ఎక్కడ ఏమి జరుగుతుందో కూడా నాకు తెలుసునన్నారు. మొదటి సమావేశం అయినందున బాధ్యతను గుర్తు చేస్తున్నా.. వచ్చే నెలలో మరోసారి సమావేశం నిర్వహిస్తా...ఆ నాటికి పనితీరులో మెరుగుపడకపోతే వేటు వేయకతప్పదని ఘాటుగా హెచ్చరించారు. ఫారెస్టు అధికారులకు వెపన్లు కూడా ఇవ్వడం జరుగుతుందని, అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. కనిగిరిలోని ఎర్రచందనాన్ని తిరుపతి గోడౌన్‌కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. ఫారెస్టు అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు త్వరలో రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏదైనా నిధులు పెండింగ్‌లో ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అందువల్ల ఫారెస్టు శాఖ అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేసి ఆటవీ సంపద ను కాపాడటంతో పాటు సేవాతత్పరతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మనం-వనం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దానిని లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం కళాశాలల స్థాయిలో విద్యార్థులకు సెమినార్‌లు నిర్వహించి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ప్రజల్లో కూడా అవగాహన పెరిగి మొక్కను నాటడంతో పాటు దానిని పరిక్షిస్తారన్నారు. నర్సరీలు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నీటి వనరులు ఎక్కడ ఉంటాయో ఆ ప్రాంతంలో నర్సరీలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అవసరమైతే ఉద్యోగులను డిప్యూటేషన్ మీద నియమించుకోవాలని మంత్రి ఆదేశించారు. నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా అటవీ ప్రాంతంలో చెక్‌డ్యామ్‌లు, కుంటలు ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శిద్దా రాఘవరావు

ద్వారా నీటి నిల్వలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపితే వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉపాధి పథకం ద్వారా అందుకోసం ఎన్ని కోట్లు అయినా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రూ కోటి వ్యయంతో దర్శి, చీరాలలో నిర్మించనున్న పార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్తీకవన భోజనం నాటికి దర్శిలో పార్కును పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అటవీ ప్రాంతం నుంచి అటవీ ఉత్పత్తులు తరలిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అడవిలో ఉన్న పులులతో పాటు వివిధ రకాల వన్యప్రాణులను రక్షించాల్సినఅ వసరం ఉందన్నారు. అందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి అదేశించారు. దిగువమెట్టలో అతిథి గృహం(గెస్ట్‌హౌస్) నిర్మాణంపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఫారెస్టు శాఖలో అవినీతి అనేది లేకుండా ఉండాలన్నారు. అవినీతి జరిగినట్లు తన దృష్టికి వస్తే వెంటనే సస్పెండ్ చేయాల్సి వస్తోందని మంత్రి హెచ్చరించారు. జిల్లాలో ఆటవీభూములు అక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఎక్కడ కూడా అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని మంత్రి శిద్దా తెలిపారు. అనంతరం పలు అంశాలపై మంత్రి శిద్దా ఫారెస్టు అదికారులకు దిశానిర్దేశం చేశారు. గుంటూరు సిసిఎఫ్ అధికారి సూర్యనారాయణ జిల్లాలో ఫారెస్టు ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. గిద్దలూరు, మార్కాపురం డిఎఫ్ఓలు ఖాదర్‌బాష, జయచంద్రారెడ్డిలు ఆ ప్రాంతంలోని సమస్యలతో పాటు ఫారెస్టు శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. లాంగింగ్ డివిజన్ జి. నాగేశ్వరరావు బిల్లుల పెండింగ్ అంశాలను మంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో సిసిఎఫ్ అధికారి సెల్వన్‌తో పాటు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

తారస్థాయికి బెట్టింగ్

- రూపాయి నుంచి రూపాయిన్నరకు పెంచిన వైసీపీ అనుకూల పందెం రాయుళ్లు
- ఎంతకైనా సై అంటున్న టీడీపీ అనుకూలురు
- గ్రామాల్లోనూ గ్రూపుల వారీగా మూకుమ్మడి బెట్టింగ్‌లు
- ఓ కుగ్రామంలోనే కోటి రూపాయల పందెం
- రాత్రికి మళ్లీ తగ్గిన వైసీపీ
- ఓ సీఐ సమాచారంతో రెచ్చిపోయిన ఆ పార్టీ అభిమానులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు)

నంద్యాలలో అభ్యర్థుల గెలుపోటములు ఎలా ఉన్నా జిల్లాలో కొన్నివందల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను విచ్ఛిన్నం చేసే పరిస్థితి కనిపిస్తుంది. అందుకు బెట్టింగ్‌ల్లో జోరు తారస్థాయికి వెళ్లడమే కారణం.నిన్న మొన్నటి వరకూ నంద్యాలలో విజయంపై అంతంతమాత్రంగా సాగిన బెట్టింగ్‌లు బుధవారం మధ్యాహ్నం నుంచి జోరందుకున్నాయి. రాత్రి 7 గంటల తర్వాత వివిధ సర్వేల సమాచారంతో బెట్టింగ్ జోరుకు కొంత బ్రేక్ పడిందని చెప్పవచ్చు. అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం వరకు గెలుపోటములపైనే బెట్టింగ్ జరిగింది. అత్యధికంగా చూస్తే పోలింగ్ ముందు వరకు వైసీపీ గెలుపుపై రూపాయి పెడితే టీడీపీ గెలుపుపై రెండు రూపాయల బెట్టింగ్ జరిగింది. జిల్లాలో అనూహ్యంగా పోలింగ్ రోజైన బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వైసీపీ గెలుపుపై బెట్టింగ్ పెట్టే వారి జోరు కనిపించింది. రూపాయి బెట్టింగ్‌ను రూపాయిన్నర వరకు పెంచారు. అయితే రాత్రికి బెట్టింగ్‌ల పరిస్థితి నిలకడగా ఉండడం విశేషం. అందుకు వివిధ మీడియా సంస్థల్లో వచ్చిన రకరకాలైన సర్వేల విశ్లేషణ కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. దీంతో పరిస్థితి అనుగుణంగా గెలుపుపైనా, అధిక్యంపైనా గురువారం నుంచి లెక్కింపుపైనా బెట్టింగ్‌లు పెట్టుకోవచ్చన్న ఆలోచనతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అదే విషయాన్ని పలువురు ఆంధ్రజ్యోతితో ధ్రువీకరించారు. నంద్యాల ఉప ఎన్నికకు బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. 11 గంటలకు బెట్టింగ్ ప్రారంభమవ్వగా 3 గంటల నుంచి జోరు తీవ్రమైంది. పోలింగ్‌కు ముందు వైసీపీ గెలుపునకు అనుకూలంగా లక్ష రూపాయల పందెం, టీడీపీ గెలుపునకు లక్షకు రెండు లక్షలన్న బెట్టింగ్ జరిగింది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి కనిపించింది. కాగా, పోలింగ్ ప్రారంభమై మూడు గంటలు గడిచినప్పటికీ రెండు రూపాయలకు రూపాయిన్నరకు బెట్టింగ్‌ను వైసీపీ అనుకూలురు పెంచడం విశేషం. ఇది టీడీపీ అనుకూల బెట్టింగ్ రాయుళ్లలో కొంత అనుమానాన్ని పెంచడంతో కొద్దిసేపు బెట్టింగ్ జోరు తగ్గింది. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు బెట్టింగ్ జరిగింది. విజయవాడకు చెందిన కొంతమంది వైసీపీకి అనుకూలంగా వందకు రెండు రూపాయలకు రూపాయిన్నరకు సిద్ధం అంటూ ముందుకు రావడం విశేషం. దీంతో బెట్టింగ్‌కు కొంత ఊపు వచ్చింది. ఆ తర్వాత దర్శి ప్రాంతం నుంచి కొందరు ఒంగోలు వచ్చి వైసీపీకి అనుకూలంగా గెలుపుపై నిన్నమొన్నటి వరకు సాగిన ఒక వంతు పందాన్ని ఒకటిన్నర వంతుకు పెంచడం విశేషం. దీంతో కొద్దిసేపు టీడీపీ బెట్టింగ్ రాయుళ్లలో అయోమయం కనిపించింది. తదనంతరం టీడీపీ గెలుపునకు రూ.2 లక్షలు పందెం పెడితే, వైసీపీకి అనుకూలంగా లక్షన్నర పందెం కాస్తంతా జోరుగా సాగింది. దర్శి ప్రాంతం వారు ఒంగోలు వచ్చి ఈ స్థాయిలో పందాన్ని పెంచడంతో ఓ పోలీస్



అధికారి సమాచారం కీలకమని భావిస్తున్నారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో వైసీపీకి ఆధిక్యత ఉందనేది జగమెరిగిన సత్యం. దానికి బ్రేక్ వేసేందుకు టీడీపీ నేతలు సర్వశక్తులూ ఒడ్డారు. అయితే ఆ ప్రాంతంలో బందోబస్తు విధులు నిర్వహించిన ఓ సీఐ తదనుగుణమైన సమాచారం ఇవ్వడంతో దాన్నే ప్రాతిపదికగా తీసుకుని దర్శి నియోజకవర్గ వైసీపీ అభిమానులు ఒంగోలు వచ్చి పందెం జోరును పెంచారని పరిశీలకుల అంచనా. దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు మండలంలోని ఓ కుగ్రామంలో టీడీపీ, వైసీపీ అనుకూల గ్రూపులంతా చర్చించుకుని గెలుపుపై 50 లక్షలను పందెంగా పెట్టుకోవడం బెట్టింగ్‌ల పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో తేటతెల్లం చేస్తోంది. కాగా బుధవారం సాయంత్రం వివిధ చానళ్లు ఇతరత్రా సమాచారం మేరకు కాస్తంతా గందరగోళానికి గురైన బెట్టింగ్ రాయుళ్లు పూర్తి వివరాలతో గురువారం నుంచి తిరిగి పందానికి సిద్ధమయ్యే ఆలోచనలో ఉన్నారు. అంతేగాక ఓట్ల లెక్కింపు 28వ తేదీ వరకు సమయం ఉండడంతో సమాచార సేకరణకు అనుగుణంగా గెలుపుపైనా, అలాగే ఆధిక్యంపైనా బెట్టింగ్‌కు అవసరమయ్యే ప్రయత్నాల్లో ఉన్నారు.

ఘనంగా సెల్ పాయింట్ ప్రారంభోత్సవం

- ప్రారంభించిన సినీ నటి సురభి
- ఆఫర్లు ప్రకటించిన యాజమాన్యం

ఒంగోలు కల్చరల్: సెల్‌ఫోన్ రంగంలో 17 సంవత్సరాలుగా పేరు ప్రఖ్యాతులు పొందిన 'సెల్ పాయింట్' షోరూం ప్రారంభోత్సవం బుధవారం ఒంగోలులో అత్యంత ఘనంగా జరిగింది. ఒంగోలు కర్నూలు రోడ్డులో ఏర్పాటు చేసిన రెండు షోరూంలను సినీ నటి, జెంటిల్‌మెన్ ఫేమ్ సురభి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్ పాయింట్ వంటి ప్రఖ్యాత వ్యాపార సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం చాలా గర్వంగా ఉందన్నారు. సినీనటి సురభిని చూడటానికి ప్రజలు భారీసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. సెల్ పాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ తమ దగ్గర సామాన్య ప్రజానీకానికి సైతం అందుబాటు ధరలో ఉండే విధంగా మొబైల్ ఫోన్లు



లభిస్తాయన్నారు. వినియోగదారులకు అందిస్తున్న సేవల వల్లే తమ సెల్ పాయింట్ మొబైల్ రంగంలో తారాస్థాయికి చేర్చాయన్నారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారులకు అందిస్తున్న అనేక ఆఫర్ల గురించి వివరించారు. తమ సెల్ పాయింట్‌లో మొబైల్ ఫోన్లు కొన్న వారి కోసం అనేక బహుమతులు, క్రెడిట్ కార్డు రుణసౌకర్యం వంటి పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం ఒంగోలులో ప్రారంభించినవి తమ 70, 71వ షోరూములని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వీవో మొబైల్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ విన్సెంట్, జనరల్ మేనేజరు జాయ్, సిటీ మేనేజరు అలెక్స్, ట్రైనర్ జాస్మిన్ పాల్గొన్నారు.

రాజమౌళి దర్శకత్వంలో నటించాలని ఉంది

సినీనటి సురభి

ఎప్పటికైనా తెలుగులో ప్రముఖ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో నటించాలని ఉందని సినీ నటి, జెంటిల్‌మెన్ ఫేమ్ సురభి అన్నారు. ఒంగోలులో ఒక సెల్ షాపు ప్రారంభానికి వచ్చిన సినీ నటి, జెంటిల్‌మెన్ ఫేమ్ సురభి ఆంధ్రజ్యోతితో పిచ్చాపాటిగా ముచ్చటించారు. సినీ పరిశ్రమతో తన కుటుంబానికి అనుబంధం ఉందన్న ఆమె ఎప్పటికైనా రాజమౌళి దర్శకత్వంలో నటించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది.

మీ మాతృభాష హిందీ కదా తెలుగులో బాగా మాట్లాడుతున్నారే?

తెలుగుభాషంటే నాకు చాలా ఇష్టం. తెలుగు సినిమాలలో నటించే అవకాశం రాగానే తెలుగు నేర్చుకోవాలని నిర్ణయించుకున్నా.

సినిమాలలోకి రావటానికి కుటుంబ ప్రోత్సాహం ఉందా?

నూటికి నూరుశాతం ఉంది. ఎందుకంటే మా కుటుంబం కూడా సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్న కుటుంబమే.

ప్రస్తుతం ఏయే భాషల్లో నటిస్తున్నారు?

తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్నాను. త్వరలో బాలీవుడ్‌లో అవకాశం కోసం ప్రయత్నం చేస్తున్నాను.

తెలుగులో ఎవరితో కొత్త సినిమాలు చేస్తున్నారు?

ప్రస్తుతం రెండు సినిమాలు తెలుగులో చేస్తున్నాను. అల్లు శిరీష్, మంచు విష్ణు సినిమాలలో నటిస్తున్నా.

తెలుగులో ఫలానా వారి దర్శకత్వంలో నటించాలి అనే కోరిక ఏమైనా ఉందా?

ఉంది. ఎప్పటికైనా రాజమౌళి దర్శకత్వంలో నటించాలనేది నా కోరిక. ఆయన చిత్ర సీమలో ఒక పాఠశాల లాంటి వారు. ఆయన దగ్గర నటిస్తే ఎన్నో గొప్ప విషయాలు నటన పరంగా నేర్చుకునే అవకాశం ఉంది.

మీకు ఇష్టమైన హీరో, హీరోయిన్ ఎవరు?

ఇప్పుడున్న అందరు ఇష్టమే. ఎవరికి వారే మంచి నటులు. అయితే నాకు శ్రీదేవి అంటే ఎనలేని గౌరవం, ఇష్టం.

(ఒంగోలు కల్చరల్)



‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’విజేత?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 2017కి గాను ‘మాలతి చందూర్’ సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ఠ సేవలందించి నందుకు ‘మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017’కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్జిమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన ‘అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ’ నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. ‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’ పురుషుల సింగల్స్ విజేత?
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వొనిమిర్ డుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై ‘మూడ్ ఆఫ్ ద నేషన్’ పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్ధిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే ‘వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017’కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. ‘ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017’కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని ‘సద్భావన దివస్’గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన ‘నావికా సాగర్ పరిక్రమ’ ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్ఎస్‌వి తరిణి
బి) ఐఎన్ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్ఎస్‌వి తలాష్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం ‘సాంస్కృతిక రథాన్ని’ ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. ‘నికోలాయ్ కుడ్‌షెవ్’ ఇటీవల ఏ దేశం తరఫున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహలోధి
సి) సొహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మివిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను ‘స్పానిష్ సూపర్ కప్’ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లిష్ ప్రీమియర్ క్లబ్ డి) రివర్స్ ప్లెటో క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని ‘పోలియో రహిత దేశం’గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. ‘అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018’కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేధోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన ‘ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్’ పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృతా వర్గీస్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ‘నమో యువ రోజ్‌గార్ కేంద్ర’ ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరాని ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ ‘ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్’ ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) చత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. ‘ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సెల్’ 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగమర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నిహ్

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం ‘మేఘశాల’ అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యాన

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ధక్కర్
సి) మేరికోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను ‘ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరికోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపిచంద్

38. 2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న’కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝూరియ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను ‘ఖేల్‌రత్న’ పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. 2017కిగాను ‘ధ్యాన్‌చంద్’ అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?
ఎ) సత్తిగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. 2017కిగాను ‘ద్రోణాచార్య’ అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. 2017కిగాను ‘అర్జున’ అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజరా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

1) సి	7) డి	13) సి	19) ఎ	27) ఎ	35) సి
2) ఎ	8) డి	14) ఎ	20) సి	28) బి	36) బి
3) డి	9) బి	15) బి	21) డి	29) బి	37) డి
4) ఎ	10) ఎ	16) బి	22) ఎ	30) ఎ	38) సి
5) సి	11) ఎ	17) ఎ	23) సి	31) బి	39) బి
6) బి	12) ఎ	18) బి	24) బి	32) సి	40) ఎ
			25) డి	33) డి	41) డి
			26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్‌ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్‌ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బి/ ఎల్ఎల్ఎం / బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: www.bcplonline.co.in

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్‌ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: www.nbccindia.com

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర

1. 'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?
ఎ) భగత్‌సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్

2. 1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?
ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్

3. సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?
ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
సి) జననీ భవన్ డి) జాగృతి భవన్

4. ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?
ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922

5. సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూసిన జాతీయోద్యమ నేత?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ

6. గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?
ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్

7. సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?
ఎ) చంపారన్ సత్యాగ్రహం
బి) ఖిలాఫత్ ఉద్యమం
సి) సహాయనిరాకరణ ఉద్యమం
డి) ఉప్పు సత్యాగ్రహం

8. గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
డి) క్విట్ ఇండియా ఉద్యమం

9. సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?
ఎ) గాంధీజీ బి) నెహ్రూ
సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్

10. ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?
ఎ) కలకత్తా బి) లక్నో
సి) బొంబాయి డి) హరిపురి



ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

11. ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?
ఎ) గాంధీజీ
బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
సి) సుభాష్ చంద్రబోస్
డి) నెహ్రూ

12. గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?
ఎ) త్రిపురి బి) హరిపురి
సి) కలకత్తా డి) లక్నో

13. సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?
ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942

15. కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?
ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా

16. సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?
ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్

17. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?
ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు

18. టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?
ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి
సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి

19. 1943 నుంచి సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలో తన సైనిక కార్యక్రమాలు ప్రారంభించారు?
ఎ) జర్మనీ బి) జపాన్
సి) సింగపూర్ డి) ఇండోనేషియా

20. 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు పునాది వేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్
బి) రాజ్‌బిహారీ బోస్
సి) ఖుదీరాంబోస్ డి) ఎవరూ కాదు

21. 1942లో టోక్యోలో ప్రవాస భారతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్ బి) లాల్ హరిదయాళ్
సి) సుభాష్ చంద్రబోస్ డి) రాజ్‌బిహారీ బోస్

22. సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఎక్కడ వ్యవస్థీకరించారు?
ఎ) టోక్యో బి) బెర్లిన్ సి) సింగపూర్ డి) మాస్కో

జనరల్ స్టడీస్ - ఇండియన్ హిస్టరీ

23. అజాద్ హింద్ ఫౌజ్‌లోని మహిళ రెజిమెంట్‌కి గల పేరు?
ఎ) ఝాన్సీరాణి రెజిమెంట్
బి) దుర్గావతి రెజిమెంట్
సి) రాణి అబ్బక్క రెజిమెంట్
డి) మహిళశక్తి రెజిమెంట్

24. భారత జాతికి సుభాష్ చంద్రబోస్ అందించిన నినాదాలు?
ఎ) జైహింద్ బి) చల్లో ఢిల్లీ సి) డూ ఆర్ డై డి) ఎ, బి

25. మొట్టమొదటి భారత ప్రభుత్వాన్ని నేతాజీ ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) టోక్యో బి) రంగూన్
సి) సింగపూర్ డి) మలేషియా

26. నేతాజీ ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశం?
ఎ) రష్యా బి) జర్మనీ సి) జపాన్ డి) ఏదీకాదు

27. 1943లో టోక్యోలో జరిగిన తూర్పు ఆసియా దేశాల సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ఏ హోదాలో హాజరయ్యారు?
ఎ) భారత సైన్యాధినేత బి) విదేశాంగ ప్రతినిధి
సి) భారత ప్రభుత్వాధినేత డి) ఏదీకాదు

28. అజాద్ హింద్ ఫౌజ్ పాలన కిందకి వచ్చిన తొలి భారత భూభాగం?
ఎ) అండమాన్ నికోబార్ దీవులు బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) సిక్కిం

29. అండమాన్ నికోబార్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పెట్టిన పేరు?
ఎ) స్వరాజ్ దీవులు బి) షాహీద్ దీవులు
సి) అజాదీ దీవులు డి) ఎ, బి

30. సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో జాతీయ సేనకు, బ్రిటీష్‌వారికి మధ్య ప్రత్యక్ష యుద్ధం జరిగిన సంవత్సరం?
ఎ) 1943 బి) 1944 సి) 1945 డి) 1946

31. బ్రిటీష్‌వారిని ఓడించి ఆజాంద్ హింద్‌ఫౌజ్ జాతీయ పతాకాన్ని ఎక్కడ ఎగురవేసింది?
ఎ) మౌఢక్ బి) మయన్మార్
సి) అండమాన్ దీవులు డి) ఏదీకాదు

32. ఆంగ్లేయుల నుంచి జాతీయ సైనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు?
ఎ) మౌఢక్ బి) కోహిమా సి) ఇంఫాల్ డి) పైవన్నీ

33. భారత జాతీయ సైన్యం సాగించిన సమరం ఆగిపోవడానికి కారణం?
ఎ) జపాన్‌పై అమెరికా అణుదాడి
బి) బ్రిటీషర్లు రంగూన్‌ను ఆక్రమించడం
సి) జపాన్ సైనికుల తిరోగమనం
డి) పైవన్నీ

34. తైవాన్ దీవుల్లో సుభాష్ చంద్రబోస్ ప్రయాణించే విమానం ప్రమాదానికి గురైన సంవత్సరం?
ఎ) 1945 ఆగస్టు 15 బి) 1946 ఆగస్టు 16
సి) 1946 ఆగస్టు 17 డి) 1946 ఆగస్టు 18

35. బ్రిటీషర్లకు బంధీలుగా చిక్కి ఎర్రకోటలో న్యాయ విచారణ ఎదుర్కొన్న జాతీయ సైన్యం ప్రతినిధులు?
ఎ) షానవాజ్‌ఖాన్ బి) కల్నల్ టి.కె.షెనగల్
సి) బి.ఎస్.ధిల్లాన్ డి) పైవారందరూ

36. భారత సైనికాధికారుల తరపున వాదించి, వారి విడుదలకు తోడ్పడినవారు?
ఎ) బల్లూభాయ్ దేశాయ్ బి) అసఫ్ అలీ
సి) తేజ్ బహదూర్ సప్రూ డి) పైవారందరూ

సమాధానాలు

1) సి	6) డి	11) సి
2) డి	7) సి	12) ఎ
3) బి	8) బి	13) సి
4) ఎ	9) ఎ	14) సి
5) బి	10) డి	15) ఎ

16) సి	23) ఎ	30) బి
17) బి	24) డి	31) ఎ
18) బి	25) సి	32) డి
19) సి	26) సి	33) డి
20) ఎ	27) సి	34) డి
21) డి	28) ఎ	35) సి
22) సి	29) డి	36) డి

JOBS ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ - **గ్రౌండ్ డ్యూటీ** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 28 **కాంట్రాక్ట్ వ్యవధి:** అయిదేళ్లు
పోస్టులు - ఖాళీలు: మేనేజర్(ఫ్లయిట్ డిస్పాచ్) 14, మేనేజర్(ఆపరేషన్ ఎక్స్‌ప్యాట్ సెల్) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ డిస్పాచ్) 6, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ టెక్నికల్ (లైబ్రరి) 1, డిప్యూటీ మేనేజర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సింథటిక్ ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్) 2, అసిస్టెంట్ ట్రైనింగ్ 1
వయసు: 21 ఏళ్లు
అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్(ఎంపిసి) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనపు అర్హతల వివరాలకోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపాలి
దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: ఆగస్టు 31
చిరునామా: The Chief of HR, Air India Express Limited, Airlines House, Durbar Hall Road, Near Gandhi Square, Kochi 682016
వెబ్‌సైట్: www.airindiaexpress.in

సిఇఐఎల్

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఇఐఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 23
పోస్టులు - ఖాళీలు: ఇంజనీర్స్(క్యూసీ/ క్యూఏ) 4, సీనియర్ ఇంజనీర్స్ (క్యూసీ/ క్యూఏ) 5, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ/ క్యూఏ) 5, ఇంజనీర్ స్పెషలిస్ట్ 6, సీనియర్ ఇంజనీర్ స్పెషలిస్ట్ 2, ఆఫీసర్ 1
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(మెకానికల్/ ప్రొడక్షన్/ మెటలర్జికల్)/ఎంబిఏ(హెచ్ఆర్)/ పీజీ(పర్సనల్ మేనేజ్‌మెంట్ & లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి
వెబ్‌సైట్: www.ceil.co.in

ఎన్ఐసిఇడి

కోల్‌కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా & ఎంటరిక్ డిసీజెస్(ఎన్ఐసిఇడి)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 19

మెడికల్ ఎపిడెమియోలజిస్ట్(సైంటిస్ట్ సి)
ఖాళీలు: 1
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ విభాగంలో ఆరేళ్ల అనుభవం ఉండాలి.
సీనియర్ రీసెర్చ్ ఫెలో(మెడికల్) **ఖాళీలు:** 12
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి
సీనియర్ రీసెర్చ్ ఫెలో(నాన్ మెడికల్) **ఖాళీలు:** 1
అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఫీల్డ్ కన్సల్టెంట్ / మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
డేటా మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: (డిగ్రీ/ పీజీ)(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
అసిస్టెంట్ డేటా మేనేజర్/ డేటా సెక్రటరీ
ఖాళీలు: 1
అర్హత: డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత + కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.
అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ / అకౌంటెంట్ **ఖాళీలు:** 2
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత విభాగంలో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 5
వేదిక: National Institute of Cholera & Enteric Diseases, (NICED II Building within ID & BG Hospital Campus), 57, Beliaghata Main Road, Kolkata - 700010
వెబ్‌సైట్: www.niced.org.in/

ఎన్‌సిఇఆర్‌టి - డిఇఇ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఇ)- తాత్కాలిక ప్రాతిపదికన **జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో**ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు:** 6
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్/ మేథమెటిక్స్/ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 40 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెట్ అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000 కాగా నెట్ స్కోరు లేని అభ్యర్థులకు రూ.14000
ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29
వేదిక: Department of Elementary Education(DEE), 4th Floor, Room No. 415, G.B Pant Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi- 110016
వెబ్‌సైట్: www.ncert.nic.in

రుణాల కోసం 148 మంది హాజరు

పుల్లలచెరువు: ప్రభుత్వం మంజూరు చేయనున్న కార్పొరేషన్ రుణాలకు 148 మంది హాజరైనట్లు ఎంపీడీవో మాణిక్యరావు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు బ్యాంకులతో కలిసి ఇంటర్యూలు నిర్వహించారు. 14 ఎస్టీ యూనిట్లు, 4 ముస్లిం మైనార్టీ, 1 క్రైస్తవ మైనార్టీ యూనిట్లకు 427 మంది దరఖాస్తు చే యగా 148 మంది హాజరయ్యారు. ఎంపికైన వారి జాబితాను బ్యాంకులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుందర్‌రావు, ఈవోఆర్‌డీ వెంకటరెడ్డి, ఎంపీడీవో సూపరింటెండెంట్ గంగాధర్‌రావు పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో టంగుటూరికి నివాళి


పుల్లలచెరువులో టంగుటూరి జయంతి వేడుకలు

ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

త్రిపురాంతకం: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కేటీ మల్లికార్జున్ నాయక్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ధీరోదాత్తుడని, బ్రిటీష్ తుపాకీ గుళ్లకు ఎదురొడ్డిన ధీశాలి అని, ఆంధ్రకేసరి అని కొనియాడారు. ప్రకాశం పంతులు మన జిల్లా వారు కావటం గర్వించదగ్గ విషయమని అందుకే మన జిల్లాకు ప్రకాశం జిల్లా అని పేరు పెట్టారని అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు విలువలతో కూడిన రాజకీయ జీవితం నేటి నేతలకు ఆదర్శ పాయమని పేర్కొన్నారు. జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పేదరికం నుంచి ఉన్నత స్థితికి విద్య ద్వారా చేరవచ్చని ప్రకాశం పంతులు నిరూపించారని అన్నారు. గురువుల ఆశీస్సులతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని, విద్యార్థులందరికీ స్ఫూర్తి ప్రదాత అని ఆయన పేరుమీదే ప్రకాశం బ్యారేజీ వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో నాయకులు ఎస్.విశ్వనాథం, ఎస్.పెద్దన్నయ్య, పిచ్చయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: ప్రకాశం పంతులు మహోన్నత వ్యక్తి అని ఎంఈవో రాంసింగ్‌నాయక్ అన్నారు. మంగళవారం పాఠశాలల్లో ప్రకాశం పంతులు జయంతి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన బాటలో విద్యార్థులు నడవాలన్నారు. చాపలమడుగు గ్రామంలో దాతలు పాఠశాలకు 10 కుర్చీలను బహూకరించారు. శతకోడులో పాఠశాలలో మహిళ సమత ఆధ్వర్యంలో ప్రకాశం జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామదాసు, దేవసింగ్‌రాజు, పూర్ణయ్య, ఆంజనేయులు, మహిళ సమత యోగిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల: గ్రంథాలయంలో ఆంధ్ర కేసరి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి, పలువురు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రకాశం పంతులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈవో జయరాం నాయక్, గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: ప్రకాశం పంతులు జీవితం ఆదర్శం, ఆచరణీయమని ఎంఈవో సీహెచ్‌పీ వెంకటరెడ్డి అన్నారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సంద్భంగా దేశానకి ఆయన అందించిన సేవవలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంగిరాలపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం అచ్యుత సుబ్బారావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ మౌలాలి, అజయ్‌బాబు, జి. నరసింహారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

త్రిపురాంతకం: ఇటీవల మృతి చెందిన మండలంలోని ముడివేముల మాజీ సర్పంచ్ గాలెమ్మ, అన్నసముద్రం ఎంపీటీసీ సామేల్ కుటుంబ సభ్యులను ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు బుధవారం పరామర్శించారు. ముడివేములలో గాలెమ్మ కుమారుడు టీడీపీ జిల్లా రైతు కార్యదర్శి దేవినేని చలమయ్యను పరామర్శించారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

అనంతరం అన్నసముద్రంలో సామేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు మార్కురాజు, జయప్రకాష్, సురేష్, వేగినాటి శ్రీను, వి.రఘురాములు, పుల్లలచెరువు ఎంపీపీ మాకం సుందరరావు, బీసీ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, ఎంపీడీవో కె.మాణిక్యరావు తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు

పెద్ద దోర్నాల: సుందరయ్య కాలనీలో ఎన్టీఆర్ వైద్య సేవలో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రభాకర్ ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన సం ఘమిత్ర, వెంకటరమణ వైద్యశాలలకు చెందిన భానుప్రకాష్, ఆంజనేయరెడ్డి, ఉషారాణి, నాగరాజు వైద్యాధికారులతో పాటు దోర్నాల వైద్యాధికారి చెంచయ్య రోగులను పరీక్షించి మందుల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా టీమ్ లీడర్ హుస్సేన్ వలి, వైద్య మిత్రలు బి.రాంబాబు, చంద్రశేఖర్, భరత్ భూషణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

చిన్నారులకు ఫిజియోథెరపీ

పెద్ద దోర్నాల: ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఎంఈవో బి.మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్ట్ కోటేశ్వరరావు చిన్నారులను పరీక్షలు నిర్వహించి, తల్లిదండ్రులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్ టి.శ్రీనివాసులు, కోటేశ్వరరావ పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

త్రిపురాంతకం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం స్థానిక జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.రాజశేఖరరెడ్డి, కె.రఘురామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్రంలోనే బలమైన ఉపాధ్యాయ సంఘమని, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వాన్ని నమోదు చేసేందుకు బయలుదేరే బృందానికి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షులు బీవీ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కె.నాగభూషణం, గౌరవాధ్యక్షుడు లక్ష్మణమూర్తి, పద్మనాభరెడ్డి, రాజు, సుందరరెడ్డి, బద్రి శ్రీను, వీరారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గులాబీ పురుగు నివారణకు సూచనలు

పెద్ద దోర్నాల: యడవల్లి, గంటవానిపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాదికారి వసంతరావు పంటలను పరిశీలించారు. పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతంగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఈవో పార్వతీబాయి, రైతులు పాల్గొన్నారు.


బస్సు ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రత్యేక బస్సు కోసం విద్యార్థుల ధర్నా

పెద్దారవీడు: ప్రత్యేక బస్సు నియమించాలని మండలంలోని సుంకేసుల గ్రామంలో బుధవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. రోజు ప్రయాణికుల రద్దీలో విద్యార్థులు బస్సులో వెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సారి 70 మంది విద్యార్థులు బస్సులో నిలబడి వెళ్లాల్సి వస్తోందన్నారు. సుంకేసుల, కలనూతల, గుండంచర్ల, పుచ్చకాయలపల్లి గ్రామాలకు ప్రత్యేక బస్సును నియమించాలని కోరారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

పెద్దారవీడు: ఓబులక్కపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో మహిళా సమత సొసైటీ తరుపున మహిళలు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమరావు మాట్లాడుతూ వాతావరణం కాలుష్యం కాకుండా ఉండాలంటే వినాయక చవితి రోజున మట్టి విగ్రహాలను తయారు చేసి వాడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పురుషోత్తమరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మంత్రునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అవసరం

పెద్ద దోర్నాల: బ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ఎం. వేణుగోపాల్ మాట్లాడుతూ రోజు రోజుకు సాంకేతిక విజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బట్టు రమణారెడ్డి, ప్రిన్సిపాల్ బెంజిమెన్, మహబూబ్ బాష, ఇ యస్‌సి కో ఆ ర్డినేటర్ శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మీరావలి పాల్గొన్నారు.

జీపీడబ్ల్యూఎస్‌సీ సభ్యులకు శిక్షణ

పెద్దారవీడు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జీపీడబ్ల్యూఎస్‌సీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో జీపీడబ్ల్యూఎస్‌సీ నూతన కమిటీలను ఏర్పాటు చేసి తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధి విధానాల గురించి ఆయన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. రక్షిత మంచినీటి సరఫరా, నీటి శుద్ధి కార్యక్రమాల బాధ్యత కమిటీ సభ్యులు తరచూ పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఎస్‌కె చిన్నసిలాన్, ఏఈ బ్రమరాంబికాదేవి, లక్ష్మయ్య, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఆధ్వర్యంలో ఫారంపాండ్

త్రిపురాంతకం: ఇరగేషన్ శాఖ ఆధ్వర్యంలో 5 ఎకరాలు, అంత కంటే ఎ క్కువ పొలం ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి ఫారంపాండ్ తవ్వుతున్నట్లు డీఈ ఆదిరెడ్డి తెలిపారు. ఎండూరివారిపాలెం గ్రామంలో బుధవారం ఫారం పాండ్ తవ్వకాన్ని ఏఈ కాశయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. 30 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో ఫారంపాండ్స్ రైతులకు తవ్వి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వెంకట నారాయణ, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసాద్

బస్సు యాత్రను జయప్రదం చేయండి

త్రిపురాంతకం: అగ్రిగోల్ బాధితుల సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబరు 2న త్రిపురాంతకంలో నిర్వహించనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేసేందుకు ఇచ్ఛాపురం నుంచి నిర్వహిస్తున్న బస్సుయాత్ర సెప్టెంబరు 2న తిప్రురాంతకం వస్తుందని దానిని జయప్రదం చేసేందుకు ఏజెంట్లు, బాదితులు సమాయత్తం కావాలని అన్నారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, అగ్రిగోల్డ్ ఏజెంట్లు ఏ.శ్రీను, జి.సునీల్, పిచ్చయ్య, సుబ్బరాయుడు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు విద్యా సంస్థల బంద్

మార్కాపురంవన్‌టౌన్: ప్రైవేట్ విద్యా సంస్థలు గురువారం బంద్ పాటిస్తున్నట్లు ఏపీటీసీ పట్టణ అధ్యక్షులు జి.మల్లికార్జున్ రెడ్డి, కందెపు రంగయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని ఒక పాఠశాలలో జరిగిన దుస్సంఘటనపై పరామర్శించటానికి వెళ్ళిన ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడిపై ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంద్‌కు సహక రించాలని కోరారు.

సీపీఎస్ ఉద్యోగుల మిలియన్ మార్చ్

మార్కాపురంవన్‌టౌన్: విజయవాడలో సెప్టెంబరు 1న జరిగే మిలియన్ మార్చ్ విజయవంతం చేయాలని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పాఠశాలలో బుధవారం సీపీఎస్ ఉద్యోగుల మిలియన్ మార్చ్ టు విజయవాడ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ జిల్లా సహాధ్యక్షుడు ఆకుల శివకృష్ణ, బాలకృష్ణారెడ్డి, శివాంజనేయులు, దామోదర రెడ్డి పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వాడాలి

మార్కాపురంవన్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించేందుకు మట్టి వినాయక విగ్రహాలను వాడాలని ఎస్ఐ బి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక అరవింద పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సకాలంలో వర్షాలు కురవటానికి వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకోకుండా ఉండానికి మొక్కలు నాటాలన్నారు. ఎఫ్ఆర్‌వో రోహిణి కుమారి మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలని అన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. అనంతరం పట్టణ వీధుల్లో ప్రదర్శన నిర్వహించి రీడింగ్ రూం సెంటరులో మానవహారం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలలో మట్టి విగ్రహాలు, మొక్కలను పంపిణీ చేశారు.

మార్కాపురం: మట్టి విగ్రహాలతో పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని ఏపీ మహిళా సమత సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని కోలభీమునిపాడులో బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం గ్రేస్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో

వినాయక చవితి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి, చైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం వినాయకుని మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తర్లుపాడు మండల టీడీపీ ఇన్‌చార్జి కందుల వేణుగోపాల్ రెడ్డి, పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పి. వెంకటరమణబాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆంధ్రకేసరికి నివాళి

ప్రకాశం స్ఫూర్తిని కొనసాగించాలి : ఎమ్మెల్యే జంకె

మార్కాపురంవన్‌టౌన్: ప్రతి ఒక్కరికీ టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శం, ఆచరణీయమని మార్కాపురం ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జవహర్ నగర్‌లోని ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి స్వగృహంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన నాయకుడు, స్వాతంత్ర్య సంగ్రామంలో తన యావదాస్తిని పణంగా పెట్టిన నిస్వార్థపరుడు ప్రకాశం పంతులు అన్నారు. మన జిల్లాకు ప్రకాశం పంతులు పేరు పెట్టినా అభివృద్ధిలో వెనుక్కు పోయామన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి మున్సిపల్ కౌన్సిలర్, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జునరావు, కమిషనర్ షేక్ ఫజులుల్లాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈ వై.నాయుడు, ఏఈ సాయిరాం, మేనేజర్ శ్రీనివాసులు, ఆర్వో డానియల్ జోసెఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాయబ్ రసూల్, ఎస్.వలీ సాహెబ్, టౌన్ ప్లానింగ్ అధికారి షేక్ షబ్బీర్ బాషా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ కె. రంగయ్య ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏ-1 గ్లోబల్ కళాశాలలో చైర్మన్ ఎం.షంషీర్ అలిబేగ్ ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ ఎం.ఉస్మాన్ బేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ షేక్ జానీబాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీహెచ్ఆర్ విద్యా సంస్థల్లో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు చైర్మన్ వెన్నా హనుమారెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాస్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ యక్కలి రామకోటేశ్వరరావు, ఫణిభూషణ్, పురుషోత్తం, బి.సురేష్ బాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూబజారులోని షిరిడీ సాయి మందిర ప్రాంగణంలో ప్రకాశం పంతులు జయంతిని జగద్గురు ఆది శంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రెంట చింతల మధుసూదనశర్మ, గోపాలుని హరిహరరావు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

పర్యాటక విశిష్టతపై అవగాహన అవసరం

మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

మార్కాపురంవన్‌టౌన్: యువతకు విద్యతో పాటు దేశీయ, విదేశీయ పర్యాటక విశిష్టతలపై అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు. శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో రాష్ట్ర టూరిజం శాఖ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 2017 గోడ పత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పక్షాన పర్యాటక రంగం ప్రధానాంశంగా కళాశాల విద్యార్థులకు పశ్చిమ ప్రకాశంలోని శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో వివిధ పోటీలు జరుగుతాయని యువతరం పర్యావరణం, పచ్చదనం, పరిశుభ్రత, నీటి వనరుల పరిరక్షణలతోపాటు పర్యాటక రంగాన్ని కూడా అధ్యయనం చేసి పరిసర ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వాహక కమిటీ ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ కె.శివాజీ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ స్థానిక సాధన డిగ్రీ కళాశాలలో పెయింటింగ్, క్విజ్, పత్ర సమర్పణ, చాయా చిత్ర సమర్పణ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మధుసూదన్, డైరెక్టర్ వీఆర్‌కే ప్రసాదు, పర్యాటక దినోత్సవ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ బి. కృష్ణ, అధ్యాపకులు శేషుకుమార్, రాజగోపాల్ రెడ్డి, పవన్ కుమార్, శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

యువత చేతిలోనే దేశ ప్రగతి

మార్కాపురంవన్‌టౌన్ : చదువుతో పాటు విలువలు నేర్చుకోవటం ద్వారా యువతరం దేశ ప్రగతికి పునఃనిర్మాణానికి కీలకం కాగలరని రాష్ట్రీయ స్వయం సేవక్ కళాశాలల విద్యార్థి ప్రముఖ్ జనార్ధన్ అన్నారు. శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో బుధవారం రాత్రి భారతదేశ, ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయటం దేశ సమగ్ర ప్రగతి అనే అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూధన్, ఆర్ఎస్ఎస్ నాయకులు కె. రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పొదిలి : పంచాయతీలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ గంగవరపు దీపా చెప్పారు. బుధవారం కాటూరివారిపాలెం లోని వడ్డెర కాలనీలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణపు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దీపా మాట్లాడుతూ పట్టణంతోపాటు శివారు కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి శ్రావణి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన కార్యదర్శి తానికొండ వెంకటరావు, పొదిలి మాజీ సర్పంచ్‌లు కాటూరి చిన్నబాబు, నారాయణరావు, వార్డు సభ్యులు కంచెర్ల రవణమ్మ, జన్మభూమి కమిటీ సభ్యులు మల్లి, గౌస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీటి పథకాల నిర్వహణకు ప్రజా భాగస్వామ్యం : ఈదర

పొదిలి : రక్షిత నీటి పథకాలను ప్రజాభాగస్వామ్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తామని జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు చెప్పారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో హోంలో జరిగిన నియోజకవర్గస్థాయి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ మల్లికార్జునరావు, డీఈ శ్రీనివాసులు, ఏఈ నారాయణస్వామి, పొదిలి మండల టీడీపీ అధ్యక్షుడు కాటూరి పెద్దబాబు, పొదిలి, కొనకనమిట్ల, మార్కాపురం జడ్పీటీసీలు సాయిరాజేశ్వరరావు, మెట్టు వెంకటరెడ్డి, రంగారెడ్డి, పొదిలి, తర్లుపాడు ఎంపీపీలు కె.నర్సింహరావు, ఏసుదాసు, పలు పంచాయతీల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఈదర

మహిళల నీటి పోరు

పొదిలి : శివారు కాలనీలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. బోర్లు మోరాయిస్తుండటంతో ట్యాంకర్లనీరే దిక్కయింది.7వ వార్డులోని విరాట్‌నగర్, నిర్మలా కాన్వెంట్ వెనుక, పిచ్చిరెడ్డి కాలనీ గత నెలరోజులుగా ట్యాంకర్లనీరు రాకపోవటంతో ఆప్రాంతాలకు చెందిన మహిళలు అధికారులకు సమస్యను తెలియజేశారు. వారు పట్టించుకోకపోవటంతో 7వ వార్డుసభ్యులు ముల్లా బాషా ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారిపై మహిళలు బిందెలతో ఆందోళనకు దిగారు. ఎస్ఐ ఎస్.సుబ్బారావు అక్కడకు చేరుకొని మహిళలతో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నారాయణస్వామి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ

మార్కాపురంవన్‌టౌన్: నెహ్రూబజారులోని షిరిడీ సాయి మందిరంలో పట్టణ విశ్వేశ్వర సేవాసంఘం వారు ఉచిత వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గోపాలుని హరిహరరావు, కృష్ణారావు, రాములు, సుబ్రమణ్యం, మోహన్, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు అందించాలి

మార్కాపురంవన్‌టౌన్: అర్హులు రుణాలు అందించి ఆదుకోవాలని జానో జాగో కేంద్ర కమిటీ సభ్యులు షేక్ గౌస్ బాషా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన రాయితీ రుణాల కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, జానో జాగో డివిజన్ నాయకులు షేక్ బాజీ, మాలిక్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ప్రకాశం జిల్లా, చీరాల మున్సిపల్, పేరాల VNR వీధి కాపురస్తుడనైన యడం బాలాజీ అను నా యొక్క ఒరిజనల్ దస్తావేజులు (కూచిపూడి గ్రామం, మద్దిపాడు (మం), పొదిలి సబ్‌డివిజన్, మార్కాపురం డివిజన్) కు సంబంధించిన 3954/2009 యడం సుజాత, 2866/2010, 2867/2010 యడం బాలాజీ, 3952/2009 యడం చినరోశయ్య గార్ల పేరు మీద గల దస్తావేజ్ కవర్ పొదిలి బస్టాండ్ నందు (చీరాలకు వచ్చు సమయం) 5-6-17న పోయినవి. ఎంత వెదికినా దొరకలేదు. కావున దొరికిన వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయగలరు.

సినిమాలు

మార్కాపురం	
జగదీశ్వరీ	- జయజానకి నాయక
విజయా	- రారండోయ్
శ్రీనివాస	- నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ	- ఆనందోబ్రహ్మ
సాయిబాలాజీ	- ఫిదా
విశ్వేశ్వర	- లై
పొదిలి	
వెంకటేశ్వర	- లై
హరికృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
రామవేంద్ర	- జయ జానకి నాయక

సూక్తి

సేవను మించిన
ఆనందం లేదు
సంతోషాన్ని
మించిన సంపద
లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and
   Roger the worrier were
   reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep
   cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually
   giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?

బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!

టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..

ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.



ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి



మీకు తెలుసా?




58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ▸ ....
2. HAET ▸ ....
3. THBA ▸ ....
4. RSHU ▸ ....

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను
జాలులో ఉన్నా కానీ జూన్‌లో లేను
గుడిలో ఉన్నా కానీ బడిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు
జంబ్లింగ్ వర్డ్స్ :
1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH

గుండ్లకమ్మకు ముహూర్తం ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిసారించింది. ప్రాజెక్టు అధికారులతో సీఈ వీర్రాజు బుధవారం సమావేశమై ఈ అంశాలపై చర్చించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును 2008 నవంబరు 24వ అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటికి పనులు పూర్తి కాలేదు. అయినప్పటికి 2009 ఎన్నికల నేపధ్యంలో ముందుగా ప్రారంభించారు. అయితే ఆతరువాత అయిదేళ్ల కూడా పెండింగ్ పనులు ఒక కొలిక్కి రాక ప్రాజెక్టు నుంచి నీటిని ఆయకట్టుకు విడుదల చేయలేకపోయారు. తిరిగి 2014లో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రాజెక్టు సందర్శించి పెండింగ్ పనులు పూర్తి చేసి లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. అలా చాలా వరకు పెండింగ్ పనులు పూర్తి అయినా రెండేళ్ల నుంచి వర్షాలు లేక, ఎగువ నుంచి నీరు రాక ప్రాజెక్టు నుంచి దిగువ అయకట్టుకు నీటిని విడుదల చేయలేదు. నాలుగైదు సార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చేందుకు తేదీలు ఖరారు చేసినా నీరులేక కార్యక్రమం అగిపోయింది. కాగా ఈ లోపు పలు పెండింగ్ పనులను అధికారులు పూర్తి చేస్తు కుంటూ వచ్చారు. ఈ నేపధ్యంలో రాష్ట్రంలో ప్రాధాన్య జాబితాలో ప్రకటించి ఎట్టి పరిస్థితులలో ఈ ఏడాది ప్రారంభించే వాటిలో జిల్లాలోని గుండ్లకమ్మ, కొరిశపాడు ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ ఏడాది ఆరెండింటిని ప్రారంభించేదుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి సూచించింది. ఈ విషయమై రెండ రోజుల క్రితం ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించిన సందర్భంగా చర్చ జరిగింది. వచ్చేనెల 30న తాను జిల్లాకు వస్తానని, ఆ రోజున గుండ్లకమ్మ నుంచి నీటి విడుదల , కొరిశపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. అప్పటికే కలెక్టర్ వినయ్‌చంద్‌కు ప్రభుత్వం నుంచి సంకేతాలు ఉండటంతో ఆప్రాజెక్టులు సందర్శించడంతో పాటు పెండింగ్ పనులపై దృష్టి పెట్టారు. తాజాగా ముఖ్యమంత్రి ఏకంగా ముహూర్తం కూడా స్పష్టంగా చెప్పడంతో ప్రాజెక్టు అధికారులు మరింతగా కదిలారు. ఒకరోజు గుండ్లకమ్మ, కొరిశపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం ఉండనుండగా ఆ రెండింటి పెండింగ్ పనులపై ప్రాజెక్టుల సీఈ వీర్రాజు దృష్టి సారించారు. ఆప్రాజెక్టు ఎస్ఈ ఆర్. రెడ్డయ్య, ఈఈ భూషణ బాబు , జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరమణ, ఈఈ రత్తయ్య పలువురు ఇతర ఇంజనీరింగ్ అధికారులు , ఏజెన్సీల ప్రతినిధులతో బుధవారం ఇక్కడి తన కార్యాలయంలో భేటీ అయ్యారు. పెండింగ్ పనులపై చర్చించారు. ముఖ్యమంత్రి రాకకు మరో నెలరోజుల సమయం ఉండడంతో పెండింగ్ పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేయాలని సూచించారు. గుండ్లకమ్మకు సంబంధించి దుద్దుకూరు వద్ద 37 ఎకరాల భూసేకరణ సమస్యవల్ల 10వేల ఎకరాలకు నీటి సరఫరా అటంకం ఉండగా మిగతా ప్రధాన కాలువలు , పంట కాలువలు చిన్న, చిన్న నిర్మాణాలు కూడా పూర్తయినట్లు సమాచారం. 37 ఎకరాల పెండింగ్ భూసేకరణలో దాదాపు 22 ఎకరాల అంశం ఒక కొలిక్కి రాగా మిగిలిన దాని విషయం లో తక్షణ చర్యలపై కలెక్టర్ వినయ్ చంద్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కాగా గత ఏడాది గుండ్లకమ్మ కాలువలలో పూడిక తీతతోపాటు చిల్లచెట్లు తొలగింపు చేయగా తిరిగి ప్రస్తుతం ప్రధాన కాలువలు జమ్ము, ఇతర చెట్లతో నిండిపోయాయి. నీటిని వదిలినా ముందుకు పోలేని పరిస్థితి కనిపిస్తున్నది. దీంతో కుడి, ఎడమ కాలువలలో సమారు రూ. 55లక్షల తో పూడిక తీత, జమ్ము ఇతర చెట్లతొలగింపు పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఇక కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి గుండ్లకమ్మ వద్ద పంపుహౌస్ నిర్మాణం , మోటార్లు , రిజర్వాయర్ వరకు పైపులైన్ల ఏర్పాటు పూర్తయ్యాయి.. పునరావాస సమస్యతో కొరిశపాడు వద్ద రిజర్వాయర్ కట్ట 200 మీటర్ల దూరం ఎత్తు పెంపు అలాగే 96 ఎకరాలభూసేకణ సమస్యతో ఆ రిజర్వాయర్ నుంచి బొల్లవరప్పాడు వరకు సమారు 8కి.మీ దూరం ఫీడర్‌కాలువలు తవ్వకం పనులుపెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల భూసేకరణ , పునరావాస చర్యలపై జిల్లా యంత్రాంగం కదిలి తీసుకున్న చర్యలతో పెండింగ్ పనులు చేసేందుకు మార్గం సుగమం అయింది. ఈ అంశాలపై బుధవారం నిర్వహించిన భేటీలో సీఈ వీర్రాజు సంబంధిత అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి పర్యటన నాటికి అన్ని పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్‌లో కూడా వర్షాలు కురియక గుండ్లకమ్మలో నీరు రాక రిజర్వాయర్ ఖాళీగా ఉంటే తప్ప ఏమాత్రం నీరు వచ్చినా గుండ్లకమ్మను అలాగే కొరిశపాడు ఎత్తిపోతల పథకాలను సెప్టెంబరు 30న ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని స్పష్టంగా తెలుస్తున్నది. ఇదిలా ఉండగా జిల్లాలో నీరు- ప్రగతి పనుల పురోగతి , ఎన్ఎస్‌పీ ఆధునీకరణ పనులపై సీఈ వీర్రాజు సంబంధిత అధికారులతో ఆ సమావేశంలో చర్చించారు. ఎస్ఈ వెంకటరమణ,ఈఈ రత్తయ్య, తదితరులు ఆయా పనుల పురోగతిని ఆయనకు వివరించారు.

136 మిలియన్ కిలోలు

రాష్ట్రంలో పొగాకు పంట ఉత్పత్తికి అనుమతి

ఒంగోలు, ఆంధ్రజ్యోతి : రానున్న సీజన్‌లో రాష్ట్రంలో 136 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. ఆమేరకు బుధవారం హైదరాబాదులో జరిగిన పొగాకు బోర్డు పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. గత ఏడాది కన్నా రానున్న సీజన్‌కు ఆరు మిలియన్ల అధిక పంట ఉత్పత్తికి అనుమతించిన పొగాకు బోర్డు పెంచిన ఆరు మిలియన్లలో దాదాపు 70 శాతం మేర (4 మిలియన్లు) ఉత్తరాది తేలిక నేలలకు కేటాయించింది. అదే సమయంలో దక్షిణాదిలోని తేలిక నేలలకు ఒక మిలియన్, నల్లనేలల ప్రాంతానికి మరో మిలియన్ పెంపు చేశారు. దీనిపై జిల్లా నుంచి వెళ్లిన దక్షిణాది వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు బోర్డు సమావేశపు హాలు వద్ద తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

గత ఏడాది రాష్ట్రంలో 130 మిలియన్ల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అందులో దక్షిణాది తేలిక నేలలు (ఎస్ఎల్ఎస్) ప్రాంతానికి 45 మిలియన్లు, నల్లనేలలు (ఎస్‌బీఎస్) ప్రాంతానికి 39 మిలియన్లు , ఉత్తరాది తేలిక నేలలు (ఎన్ఎల్ఎస్) ప్రాంతానికి 42 మిలియన్లు, ఉత్తరాది నల్లనేలలు (ఎన్‌బీఎస్) ప్రాంతానికి 4 మిలియన్లు ఇచ్చారు. అయితే ప్రకృతి ప్రతికూల పరిస్థితులతో పంట ఉత్పత్తి బాగా తగ్గింది. అనుమతి ఇచ్చింది 130 మిలియన్ల కుగాను పండింది 110 మిలియన్లు లోపుగానే ఉంది. ఆ విషయం అలా ఉంచితే రానున్న సీజన్‌కు సంబంధించి ఉత్పత్తి అనుమతి ఖరారుకు సంబంధించి బుధవారం హైదరాబాదులో పొగాకు బోర్డు సమావేశం జరిగింది. బోర్డు చైర్మన్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోర్డు సభ్యులయిన ఎంపీలు గల్లా జయదేవ్, గోకరాజు గంగరాజు ఇతర సభ్యులు పాల్గొనగా జిల్లాకు చెందిన పొగాకు బోర్డు సభ్యుడు బాలినేని సీతయ్య పాల్గొన్నారు.

రానున్న సీజన్‌లో సుమారు 133 మిలియన్ల పంట మార్కెటింగ్‌కు అవకాశం ఉందని వ్యాపార ప్రతినిధులు పొగాకు బోర్డుకు తమ ప్రతిపాదనలు నెల క్రితమే ఇచ్చారు. అయితే ప్రాంతలవారీగా గత ఏడాది కన్నా ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో పది మిలియన్లు , ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో పదిమిలియన్లు, ఎస్‌బీఎస్‌లో ఒక మిలియన్, ఎన్ఎల్ఎస్‌లో 8 మిలియన్లు , ఎస్‌బీఎస్‌లో ఒక మిలియన్ తగ్గించింది. ఎన్.బి.ఎస్‌లో 6 మిలియన్ల పెంపునకు ప్రతిపాదించారు. అదే సమయంలో గతంలో వలే ఈ ఏడాది కూడా ఇవ్వాలని అవకాశం ఉంటే బ్యారన్‌కు 40 క్వింటాళ్ల మేర పెంచాలని దక్షిణ ప్రాంత రైతులు గట్టిగా కోరారు. ఇదే విషయాన్ని మరోసారి బుధవారం బోర్డు సమావేశం సందర్భంగా జిల్లా నుంచి రైతు ప్రతినిధులు వెళ్లి సమావేశానికి ముందు పలువురు సభ్యులను కలిసి వివరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివిశివరాం నేతృత్వంలో ఎస్ఎల్ఎస్ రైతులు, మాజీ ఎమ్మెల్సీ పోతుల నరసింహారావు నేతృత్వంలో ఎస్.బి.ఎస్ రైతులు హైదరాబాదు వెళ్లారు. బోర్డుసమావేశం ప్రారంభానికి ముందు బోర్డు సభ్యులు అయిన ఎంపీలు గల్లా జయదేవ్ , గోకరాజు గంగరాజు, ఇతర సభ్యులను , అధికారులను కలిశారు. ప్రాంతాల వారీ వివక్ష చూపి పంట అనుమతులు తగ్గించరాదని కోరారు. అనంతరం జరిగిన సమావేశంలో ఈ అంశాలు అన్నింటిని పరిగణనలోకి తీసుకున్న సభ్యులు రాష్ట్రంలో రానున్న సీజన్‌లో 136 మిలియన్ల పంట ఉత్పత్తికి అనుమతి ఇస్తూ తీర్మానించారు. అందులో ఎస్ఎల్ఎస్ ప్రాంతానికి 146 మిలియన్లు ,ఎస్‌బీఎస్‌లో 40మిలియన్లు, ఎన్ఎల్ఎస్‌ప్రాంతానికి 46 మిలియన్లు, ఎన్‌బీఎస్‌కు 4మిలియన్లు కేటాయింపు చేశారు. మొత్తంగా గత సీజన్ కన్నా ఆరు మిలియన్లు పెంచుతూ నిర్ణయించగా ఎస్ఎల్ఎస్ ప్రాంతానికి 4మిలియన్లు కేటాయింపు చేశారు. అలాగే ఎస్ఎల్ఎస్ ప్రాంతానికి ఒకటి, ఎస్‌బీఎస్ ప్రాంతానికి మరో మిలియన్ పెంచారు. కాగా పెంచిన ఆరు మిలియన్లలో ఏకంగా ఉత్తరాది ప్రాంతానికి ఆరు మిలియన్లు పెంచి 14 వేలం కేంద్రాలు ఉన్న దక్షిణాదికి కేవలం రెండు మిలియన్లు మాత్రమే పెంచడంపై ఇక్కడి నుంచి వెళ్లిన రైతు ప్రతినిధులు తీవ్ర నిరసన తెలిపారు. బోర్డు సమావేశం అనంతరం వారు చైర్మన్ వెంకటేశ్ , ఇతర సభ్యుల వద్ద తమ నిరసనను తెలిపినట్లు సమాచారం.

చీమకుర్తి వాసులకు అత్యాధునిక సేవలు

సీఈఈ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జరీ విభాగం

చీమకుర్తి: చీమకుర్తివాసులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా వీరవెంకట సుధీర్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ప్రముఖవైద్యులు డాక్టర్ జవహర్ నిర్వహిస్తున్న సీఈ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జరీ, జనరల్‌సర్జరీ విభాగాలను శిద్దా సుధీర్, నగరపంచాయతీ చైర్మన్ కొత్తపు రాఘవరావులు బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ వాసులకు మరింత ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. డాక్టర్ జవహర్ వాసురుదుగా తనయుడు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బి.రాహుల్, కోడలు జనరల్ సర్జన్ బి.రామాలక్ష్మిలు కార్పొరేట్ వైద్యశాలకు వెళ్లకుండా చీమకుర్తిలోఉండి పేదలకు తక్కువ స్థాయి వైద్యసేవలు అందించడం అభినందనీయయని తెలిపసారు. ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు, చలువాది బదరీనారాయణ, వైస్‌చైర్మన్‌కందిమళ్ల గంగాధరరావు, తన్నీరు వెంకటేశ్వర్లు, మంచా శ్రీనివాసరావు, మారం వెంకారెడ్డి, చలువాదిరమేష్, సూరం పల్లి హనుమంతరావు,గొల్లపూడి హనుమంతరావు,పలువురు పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఎనలేనివి 'ప్రకాశం' సేవలు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఏపీజెన్‌కో ద్వారా ఈ ప్రాంత భూముల రిజిస్ట్రేషన్లు నిలిచి పోయిన సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ శౌర్యం,త్యాగానికి ప్రతీక టంగుటూరి ప్రకాశం అని తెలిపారు. అటువంటి గడ్డయిన ఈ గ్రామంను దత్తత తీసుకోవడం, ఆమహనీయుడి కాంస్యవిగ్రహం ప్రతిష్ఠించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ప్రకాశం, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒకే సారుప్యత ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పనిచేశారని, అదేవిధంగా కొత్త నవ్యాంధ్రప్రదేశ్‌లో అమరావతి రాజధానిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేయటం చూస్తుంటే వారిద్దరి ఆలోచనలు ఒకటే అనటానికి నిదర్శనాలన్నారు. ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టుదల , కృషి ఉంటే దేన్నయినా సాధించవచ్చని ప్రకాశం చాటి చెప్పారన్నారు. తాను ఎంపీగా పనిచేసిన కాలంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసానని గుర్తుచేశారు. జడ్పీచైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగ్గనేత ప్రకాశం పంతులు అని, అదేబాటలో ఎన్.టి. రామారావు కొనసాగారన్నారు. ప్రకాశం పుట్టిన మండలంలో జన్మించటం అదృష్టం గా భావిస్తున్నామన్నారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న పరకాల ప్రభాకర్‌ను సభాముఖంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ మాట్లాడుతూ దేశభక్తి కల్గిన గొప్పవ్యక్తిప్రకాశం అని కొనియాడారు. పేద కుటుంబంలో పుట్టి అత్యున్నత శిఖరాలకు ఎదిగిన ప్రకాశం స్ఫూర్తితో మీ పిల్లలందరిని చదివించాలని గ్రామస్తులను కోరారు. వినోదరాయునిపాలెం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానన్నారు. పండుగలా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దిన ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, ఆర్డీవో శ్రీనివాసరావు, గ్రామస్తులను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ప్రకాశం లాంటి వ్యక్తిత్వాన్ని నేటి పాలకులందరూ అలవర్చుకోవాలన్నారు. జమిందారీ వ్యవస్థను రూపుమాపిన ఘనత ఆయనదే అన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి బి.ఎన్.విజయకుమార్ మాట్లాడుతూ తెలుగుజాతికి అత్యంత గౌరవం తెచ్చింది ప్రకాశం అని కొనియాడారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పనిచేసిన ధీశాలి అన్నారు. ఒంగోలు డీఎస్పీ గుంటుపల్లిశ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకాశం జీవితం అందరికి ఆదర్శం అన్నారు. ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి మాట్లాడుతూ ప్రకాశం జన్మస్థలమైన వినోదరాయుని పాలెన్ని రాష్ట్రంలోనే ఆదర్శగ్రామంగా చేసేందుకు కృషి చేస్తున్న పరకాల ప్రభాకర్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి శిద్దా, పరకాల ప్రభాకర్, కలెక్టర్ వినయ్‌చంద్‌లను ఎంపీపీ, గ్రామస్థులు వేద మంత్రాల నడుమ పౌరసన్మానం చేశారు. విగ్రహ ప్రతిష్ఠకులు రాజ్ కుమార్, ఉదయకుమార్‌ను సన్మానించారు. తొలుత గ్రామంలో కోటి నిధులతో అభివృద్ధి జరిగే శిలాఫలకాన్ని , రూ. 10లక్షలతో జరిగే పాఠశాల ప్రహరీగోడ నిర్మాణ శిలాఫలకాలను మంత్రి శిద్దా రాఘవరావు , పరకాల ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఒంగోలు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం హైస్కూలులో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ప్రకాశం ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుల సురేష్ , ప్రకాశం ముని మనుమడు గోపాల కృష్ణ గాంధీ , జడ్పీటీసీ సభ్యురాలు షేక్ ఇమాంబీ , మండల ప్రత్యేకాధికారి లక్ష్మీదుర్గ, డీపీవో ప్రసాదు, భైరవనేని సూర్యనారాయణ, ఎంపీడీవో ఎస్.ఎం. శిలార్, కందుకూరు జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్, తహసీల్దార్ జె.సుజాత , హౌసింగ్ డీఈ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఉన్నం సింహాద్రితో పాటు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అద్దంకిలో కుండపోత వర్షం


ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు


జలమయమైన నామ్ ఎక్స్‌ప్రెస్ హైవేపై

అద్దంకి: అద్దంకి ప్రాంతంలో బుధవారం సాయంత్రం కుండ పోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రతి రోజు వర్షపు జల్లులు పడుతుండటంతో పొలాల్లోని నీరు వాగులకు చేరుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన వర్షం 5.30 గంటల వరకు కురిసింది. దీంతో నామ్ రోడ్డుపై సైడ్ డ్రైన్‌లు సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు మొత్తం రోడ్లపైనే ప్రవహించింది. పలు చోట్ల పనులు అసంపూర్తిగా ఉండటంతో గోతులు కనిపించక వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. కార్యాలయాలు, పాఠశాలలు ముగిసే సమయం కావడంతో ప్రజలు, విద్యార్థులు వర్షంతో ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్టీఆర్‌నగర్, సంజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. ఎంపీడీవో కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు జరుగుతుండటంతో వర్షంతో ఇబ్బంది ఏర్పడింది. వర్షంతో నువ్వు కోసిన రైతులు ఆందోళనకు గురి కాగా మాగాణిలో వరినాట్లు వేస్తున్న రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరులో...

పంగులూరు పరిసర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరు ములతో కూడిన వర్షం కురిసింది. కొద్దిపాటి గాలులు, వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం పంట సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

బెల్టుషాపులను పూర్తిస్థాయిలో తొలగించాలి

● **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశం**


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ నాగలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాల్లో బెల్టుషాపులను పూర్తిస్థాయిలో తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో గుర్తించిన ఇసుక రీచ్‌లలో అక్రమ తవ్వకాలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా జరగకుండా నిరోధించేందుకు కలెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద లోడింగ్, అన్‌లోడింగ్‌లపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను నిరోధించాలని ఆయన చెప్పారు. సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు ఇసుక అధిక ధరలకు అమ్మకాలు జరిగితే ప్రజలు 1100 నంబరుకు ఫిర్యాదు చేసే విధంగా అవగాహన కల్పించాల ని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నా యని, అందువల్ల ప్రజలు వ్యాధుల బారినపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో వైపు ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. 2016-17కు సంబంధించి సెప్టెంబరు 15వతేదీనాటికి నూరుశాతం గ్రౌండింగ్ చేయాలని, 2017-18కు సంబంధించి వచ్చేనెల 15 నాటికి నూరుశాతం మంజూరు ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. 2018-19 నిర్మాణాలను మంజూరు చేయాలన్నారు. అలాగే సిమెంట్ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలని చెప్పారు. అనంతరం జేసీ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో రూరల్, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అందువల్ల సాగర్ నీటిని విడుదల చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీవో కేటీ వెంకయ్య, డ్వామా పీడీ పోలప్ప, జడ్పీ సీఈవో సాయికుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖరయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ సుబ్బరాజు, పబ్లిక్ హెల్త్ ఈఈ రామ్మోహన్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ యాస్మిన్, మైన్స్ ఏడీ రామచంద్రరావు, పరిశ్రమల మేనేజర్ ఆనంద్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సంజీవరెడ్డి, ఎన్ఐసీ అధికారి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం తొలి ఇన్నింగ్స్‌లో 196 ఆలౌట్

ఒంగోలు కార్పొరేషన్: ఒంగోలు శర్మాకళాశాల క్రీడామైదానంలో అంతర్ జిల్లాల అండర్-16 గ్రూప్‌లో భాగంగా బుధవారం నుంచి విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన విజయనగరం తొలిఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టి 83.4 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులోని ఎం.రవికృష్ణ 65 పరుగులతో అర్ధ సెంచరీ పూర్తిచేయగా, ఎస్.హరీష్ 42, ఎం.జయచంద్ర వర్మ 33 పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని బౌలర్ టి.విజయ్ 43 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. యు.తరుణ్‌కుమార్ మరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం 3.1 ఓవర్లు ఆడి 6 పరుగులకు ఒక వికెట్ నష్టపోయింది. అయితే వర్షం కురవడంతో అంపైర్లు తొలిరోజు మ్యాచ్‌ను నిలిపివేశారు.


టి.విజయ్ (5 వికెట్లు)

జిల్లా పరిషత్ సీఈవోగా కైలాష్‌గిరీశ్వర్

ఒంగోలు, ఆంధ్రజ్యోతి: *జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా టి.కైలాస్‌గిరీశ్వర్ నియమితులు అయ్యారు. ప్రస్తుతం సామర్లకోటలోని శిక్షణా కేంద్రంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనకు ఇక్కడ సీఈవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో రెవెన్యూ ఇతర శాఖల నుంచి డిప్యూటీ కలెక్టర్లు లేదా ఆస్థాయి ఇతర శాఖల అధికారులు సీఈవోగా ఎక్కువ కాలం పనిచేశారు. చాలకాలం తరువాత పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారి సీఈవోగా ఇక్కడకు వస్తున్నట్లు సమాచారం. కాగా గతంలో జిల్లాలో రెండు సార్లు జిల్లా పంచాయతీ అధికారిగా పని చేసి, ప్రస్తుతం బాపట్లలోని శిక్షణా కేంద్రం అధికారిగా పనిచేస్తున్న కె.శ్రీదేవిని కృష్ణా జిల్లా పరిషత్ సీఈవోగా ప్రభుత్వం నియమించింది. అలాగే కడప, నెల్లూరు, అనంతపురం, విజయనగరం తదితర జిల్లాలకు కూడా సీఈవోలను నియమిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.*

పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలి

● తల్లిదండ్రుల్లో అపోహలను తొలగించాలి

● డబ్ల్యూహెచ్‌వో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్

● అద్దంకిలో ఆకస్మిక పరిశీలన




వ్యాక్సినేషన్ గురించి అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ శ్రీధర్

అద్దంకి: రాష్ట్రం నుంచి తట్టు, పొంగు వ్యాధులను పారదోలేందుకు పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సినేషన్ వేసేలా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని వరల్డ్ హెల్త్ ఆరగ్నైజేషన్(డబ్ల్యూహెచ్‌వో) జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ కోరారు. తట్టు, పొంగు వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ఈ నెల ఒకటో తేదీ నుంచి చేపట్టిన ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం అద్దంకి పట్టణంలో డాక్టర్ శ్రీధర్ ఆకస్మికంగా పరిశీలించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ ఇవ్వాలని ఆయన చెప్పారు. ఎంఆర్ వ్యాక్సిన్ వికటించే అవకాశమే లేదని, వేరే కారణాలతో మాత్రమే చిన్నారులు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నాటికి 92,92,329 మందికి, ప్రకాశం జిల్లాలో 6,65,947 మందికి వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 30 శాతం మందికి మాత్రమే వ్యాక్సినేషన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కాగా జిల్లాలో మొదటి రెండు రోజులు వ్యాక్సినేషన్ శాతం ఎక్కువగా ఉండగా, అనంతరం రాష్ట్రంలో దిగువ స్థాయికు పడిపోయిందని శ్రీధర్ పేర్కొన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి మిగిలిపోయిన చిన్నారులందరికీ సెప్టెంబర్ 8వ తేదీ లోపు వ్యాక్సినేషన్ వేయాలని, ఈనెలాఖరులోపు నూరు శాతం లక్ష్యం సాధించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎంఆర్ వ్యాక్సినేషన్ పై తల్లిదండ్రులు ఎటువంటి అపోహలు పడాల్సిన పని లేదన్నారు. సీహెచ్‌సీల నుంచి చిన్నారుల వైద్యంపై వారాంతపు నివేదిక క్రమం తప్పకుండా పంపించాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ నాగభూషణంకు సూచించారు. అనంతరం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఎంఆర్ వ్యాక్సినేషన్ వేసిన ప్రీస్కూల్ కేంద్రాన్ని, ఆ ప్రాంతంలోని పలు ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంతమంది చిన్నారులకు వ్యాక్సినేషన్ వేయలేదని గుర్తించి సమీపంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. అద్దంకి పట్టణంలో వ్యాక్సినేషన్ పర్సంటేజ్ గురించి మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జయచంద్రతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖలో ఉద్యోగోన్నతులపై బదిలీలు

ఒంగోలు వ్యవసాయం : మార్కాపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పుష్పకుమారి ఉద్యోగోన్నతిపై జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయం సూపరింటెండెంట్‌గా బుధవారం బదిలీ అయ్యారు. ఒంగోలు ఏడిఏ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న కాజేశ్వరి ఏడీఏగా ఉద్యోగోన్నతిపై విజయవాడకు బదిలీ అయ్యారు. పర్చూరు ఏడిఏగా పనిచేస్తున్న మురళీని ఉద్యోగోన్నతిపై ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా కడపకు బదిలీ చేశారు.

పీఎంపీ, ఆర్‌ఎంపీలపై ఐఎంఏ అభ్యంతరం సరికాదు

ఒంగోలు కార్పొరేషన్ : ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వం పారా మెడిక్స్‌గా శిక్షణ ఇచ్చి, చట్టబద్దత కల్పించి, ప్రాథమిక వైద్యులుగా గుర్తించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అభ్యంతరం తెలపడం సరికాదని జిల్లా గ్రామీణ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ అసోసియేషన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారమిక్కడ నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల ప్రసాదరావు, బట్టు బాలాజీ మాట్లాడుతూ ఎంబీబీఎస్ డాక్టర్ల వద్ద సుమారు 10-20 సంవత్సరాలు కాంపౌండర్‌లుగా పనిచేసి, వారి నేర్పిన వైద్యంతోనే నేడు జీవనం సాగిస్తున్నామన్నారు. వారు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు ద్వారానే పారా మెడిక్స్ శిక్షణ పొంది, పేద, మధ్య తరగతి వారికి వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వం గుర్తించినా, పెద్ద డాక్టర్లు ఎందుకు కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు, సింగయ్య, భాస్కర్‌రావు, సిద్ధయ్య, రామ రాఘవులు, కాజావలి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారం కోసం అధికారుల నియామకం

ఒంగోలు కార్పొరేషన్ : ఒంగోలులో నీటి కరువు నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇంజనీరింగ్ విభాగంలోని సిబ్బందికి సెలవులు రద్దు చేస్తూ, డివిజన్‌ల వారీగా అధికారులను నియమించింది. ఆయా డివిజన్‌లలో తాగునీటి సమస్యలపై సంబంధిత అధికారులను సంప్రదించాలని కమిషనరు ఎస్. వెంకటకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు

డివిజన్	అధికారి	ఫోన్
1-9	ఆర్. రాములునాయక్, ఏఈ	9849110120
10-16	కే. శ్రీనివాసులు, ఏఈ	9849908064
17-21	యు. శ్రీనివాసరావు, ఏఈ	9849906590
22-27, 30.31	పి.రవిబాబు,ఏఈ	9849907844
28,29,32-36	టి. రమేష్‌బాబు, ఏఈ	9100914177
37-42	బి. వెంగళదాసు, ఏఈ	9849803790
43-50	కే. రాము, ఏఈ	9849907314
4-9, 22-27, 27, 30, 31 37-42	భాస్కర్, డీఈ	9908523211
1-3, 17-21, 28,29 32-36	మాల్యాద్రి, డీఈ	9849906601
10-16, 45-50	పీవీ. అనీల్‌కుమార్	9849907313



మైనార్టీ కార్పొరేషన్ వ్యక్తిగత రుణాలకు ఇంటర్వ్యూలు

ఒంగోలు కార్పొరేషన్ : మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వ్యక్తి గత రుణాలకు విశేష స్పందన లభించింది. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలను కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ ప్రారంభించారు. నగరపరిధిలోని వివిధ బ్యాంకుల ద్వారా 103 మందికి రుణాలు మంజూరు లక్ష్యం కాగా, సుమారు 700కు పైగా ఔత్సాహిక నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ 24వ తేది బీసీలకు, 28న కాపులు, 29వ తేదీన షెడ్యూలు కులాల వారికి కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. బీసీలకు 401, కాపులకు 400, ఎస్సీలు 464, మైనార్టీ 103, క్రిస్టియన్ మైనార్టీలకు 7 యూనిట్‌లకు రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు

- ఎమ్మెల్యేకు విన్నవించిన మహిళలు - కర్నూలు రోడ్డుపై రాస్తారోకో

సంతనూతలపాడు : జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ మహిళలు రాస్తారోకో చేశారు. బుధవారం ఒంగోలు నగరం విరాట్‌నగర్‌కు చెందిన మహిళలు రోడ్డుపై బైఠాయించారు. మాజీ కౌన్సిలర్ పగిడి రాములు నాయకత్వంలో మహిళలు సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎక్సైజ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటేనే తొలగించాలని కోరారు. అదేవిధంగా రాస్తారోకో చేస్తున్న మహిళలతో తాలూకా ఎస్సై సురేష్ చర్చించి ఆందోళనను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో రమణ యాదవ్, రమణారెడ్డి, కొండలు పాల్గొన్నారు.

'వినాయక' విద్యుత్ కోసం డీడీలు చెల్లించాలి

ఒంగోలు వ్యవసాయం : వినాయక విగ్రహాల మండపాల కోసం కొంత మంది విద్యుత్ స్థంభాల నుంచి లైన్‌లు నేరుగా తీసుకుంటున్నారని, అది చట్టరీత్యా నేరమని, తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం నగదు చెల్లించాలని ఆ శాఖ నగర ఏడీఈ వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కర్నూల్ రోడ్డులోని విద్యుత్ వినియోగదారుల సర్వీస్ సెంటర్‌కు స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది ఇచ్చిన సర్టిఫికెట్‌తో వెళ్లి నగదు చెల్లించాలని తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలో ఇండియన్ బ్యాంకు

ఒంగోలు వ్యవసాయం : ఖాతాదారులకు మెరుగైన సేవలను ఇండియన్ బ్యాంకు అందిస్తోందని జోనల్ మేనేజర్ పి.సుందరయ్య చెప్పారు. ఇండియన్ బ్యాంకు సంతపేటలోని బ్రాంచిలో బుధవారం జరిగిన ఖాతాదారుల సమావేశంలో విజయవాడ జోనల్ కార్యాలయ చీఫ్‌మేనేజర్ సూర్యనారాయణ, బ్రాంచి మేనేజర్ రాఘవరెడ్డి, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ఏ.హరిబాబు పాల్గొన్నారు.

610 మందికి ఉచితంగా వైద్య సేవలు

ఒంగోలు కార్పొరేషన్ : మారెళ్ల వెంకటేశ్వర్లు 14వ వర్థంతి సందర్భంగా బుధవారం స్థానిక సెయింట్ థెరిస్సా హైస్కూలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి అధ్యక్షత వహించగా, స్థానిక కిమ్స్ వైద్యశాల సిబ్బంది వైద్యసేవలు అందించారు. 610 మందికి రోగ నిర్ధారణ వైద్య పరీక్షలు అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోమోరియల్ ట్రస్ట్ కన్వీనర్, మారెళ్ల వివేకానంద, మారెళ్ల సుబ్బారావు, టీడీపీ నాయకులు రామకృష్ణ పరమహంస, పి. బ్రహ్మానందం, యక్కల తులసీరావు, టి. అరుణ, మారెళ్ల నరసింహారావు, బంగారయ్య, రామకృష్ణ, వెంకట్రావు, సీపీఎం నాయకులు జి.రమేష్ డాక్టర్ కె. బాలచంద్రం, బొంత ఆనందరావు, రత్నరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు సెల్‌ఫోన్‌తో అనుసంధానం

చీమకుర్తి: వ్యవసాయానికి వినియోగిస్తున్న విద్యుత్ మోటార్లను వినియోగదారుల సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఇంటి వద్ద నుంచే ఆపరేటింగ్ చేసే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నదని విద్యుత్‌శాఖ డీఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కలిగిన రైతులకు అవగాహన సదస్సును బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమకుర్తి, మ్రిచెట్లపాలెంసబ్‌స్టేషన్ పరిధిలో 180 విద్యుత్‌మోటార్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ మోటార్లలో సిమ్ అమర్చి దానిని రైతు వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో అనుసంధానం చేస్తారు... దీనివలన ఆ రైతు ఇంటి నుంచే బోర్‌ను ఆపరేట్ చేయవచ్చున్నారు. విద్యుత్ సరఫరా వేళలు, అంతరాయాలు తదితర విషయాలు మెసేజ్ రూపంలో సెల్‌ఫోన్‌కు అందుతాయి. ఈ అవకాశాన్ని రైతాంగం వినియోగించుకోవాలని కోరారు. ఈఎస్‌ఎల్ ప్రతినిధులు రమేష్, నాగరాజు నూతనవిధానంపై రైతులకు అవగాహన కల్గించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న నాసిరకం మోటార్లను తమకు అందజేస్తే వాటికి బదులుగా ఉచితంగా 5 స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్‌మోటార్లు అందజేస్తామన్నారు. అంతేగాక వాటి బాగోగుల బాధ్యతను తాము స్థానిక విద్యుత్ సిబ్బందితోకలిసి ఐదేళ్ల పాటు చేపడతామని తెలిపారు.

టంగుటూరికి ఘననివాళి

చీమకుర్తి : ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి బిరుదాంకితుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని పట్టణ వాసులు ఘన నివాళి అర్పించారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఛైర్మన్ కొత్రపు రాఘవరావు , వైస్‌ఛైర్మన్ కందిమళ్ళ గంగాధరరావులు ప్రకాశం చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ.ఆదినారాయణ.,మోమిన్ తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ,అభయకళారాధ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మాద్దాళి మాధవరావు అధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్సై జివిచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రకాశం పంతులువిగ్రహానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాలలు, పాఠశాలు,స్వచ్ఛంద సంస్థలు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రాథమిక పాఠశాలలో ప్రకాశం పంతులు జయంతి

సంతనూతలపాడు : ప్రకాశం పంతులు నిరాడంబరుడని ప్రధానోపాధ్యాయుడు పి.పి. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చంద్రపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బస్టాండ్‌సెంటర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో ప్రకాశం పంతులు జయంతివేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నివాళులర్పించారు.



చీమకుర్తిలో ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నేతలు

చిరస్మరణీయుడు ప్రకాశం

కనపర్తి (నాగులుప్పలపాడు): టంగుటూరి ప్రకాశం పంతులు ఈ జగత్ ఉన్నంత కాలం ప్రజల మనస్సుల్లో చిర్మసరణీయుడిగా నిలిచిపోతారని సామాజిక కార్యకర్త కోమట్ల త్రినాథ్‌రెడ్డి అన్నారు. కనపర్తి గ్రామంలో టంగుటూరి ప్రకాశం మ్యూజియంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుడి స్మారక కార్థం గ్రామంలో మ్యూజియంకు ఆయన పేరుపెట్టామన్నారు. నేటి విద్యార్థులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని నడవాలని ఏడీ సుబ్బారెడ్డి కోరారు. గ్రామసర్పంచ్ నారాయణ , ఊర రంగనాథ్, హైస్కూలు ప్రదానోపాధ్యాయురాలు పద్మావతి తదితరులు మాట్లాడుతూ ప్రకాశం త్యాగాలను కొనియాడారు. నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు, బి.నిడమానూరు, తిమ్మసముద్రం, ఈదుమూడి, మద్దిరాలపాడు, చేకూరపాడు, అమ్మనబ్రోలు ,మాచవరం హైస్కూళ్లలో ప్రకాశం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

షాపులు కోల్పోయిన వారికి పరిహారం అందించాలి

నాగులుప్పలపాడు : కత్తిపూడి - ఒంగోలు జాతీయ రహదారి 216 రోడ్డు విస్తరణలో భాగంగా నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో షాపులు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని షాపుల యజమానులు బుధవారం వినోదరాయునిపాలెంలో రాష్ట్ర మంత్రి శిద్దారాఘవరావుకు వినతి పత్రం అందించారు. స్పందించిన మంత్రి ప్రక్కన ఉన్న కలెక్టర్ వినయ్‌చంద్‌తో వారి సమస్యకు పరిష్కారం చూపండని కోరారు. ఈ కార్యక్రమంలో మట్టుపల్లి రాంబాబు, అనిల్ కుమార్, హనుమంతరావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

ఎర్రగుడిపాడుగ్రామసభలో ఉద్రిక్తత

- ఇరువర్గాలపై కేసులు నమోదు

చీమకుర్తి : రాజకీయ కుమ్ములాటల్లో అంటకాగుతున్నఎర్రగుడిపాడుగ్రామంలో మరోసారి విద్వేషాలు పెట్రేగాయి. ఎన్టీఆర్‌జలసిరి పథకంలో భాగా లబ్ధిదారులను ఎంపిక చేయడానికి బుధవారం సర్పంచ్ జి.వెంకట్రావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్రావు, టీడీపీ వర్గీయుల మధ్యవివాదం చెలరేగి బాహాబాహీకి తలపడ్డారు. దీంతో సభను కార్యదర్శి మారుతీబాబు సభను అర్ధాంతరంగా ముగించారు. ఈసందర్భంగాఇరువర్గాలు పోలసుస్టేషన్‌లో పిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసులునమోదు చేసినట్లు ఎసై జి.వి. చౌదరి తెలిపారు.

శాస్త్రీయ విధానాలు పాటించాలి

మద్దిపాడు: ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధికదిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి జి.స్వర్ణలత అన్నారు. బుధవారం ఇనమనమెళ్లూరు ,బసవన్నపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక ఎరువులు అతిగా వినియోగించటం ద్వారా దోమసోకే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు, అబ్బూరి శేషగిరిరావు, విస్తరణాధికారి పాటిబండ్ల శేషరావు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ అధ్యక్షుడిగా శిద్దా సురేష్

- నేడు చీమకుర్తిలో ప్రమాణస్వీకారం



చీమకుర్తి : రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి నూతన అధ్యక్షుడిగా యువ పారిశ్రామికవేత్త శిద్దా సురేష్ నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. పట్టణంలోని ఎంఎన్‌ఆర్ ఆపార్టుమెంటు ఆవరణలో నూతన కార్యవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేయనుంది. ముఖ్యఅతిథులుగా రోటర్లీక్లబ్ ఆసిస్టెంట్ గవర్నర్ చెరుకూరి రఘుకిరణ్ పాల్గొననున్నారు.

నేడు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అద్దంకి రూరల్: నవచేతన సేవా సమితి 1987-88 టెన్త్ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం అద్దంకిలో 1000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆలూరి వెంకట్రావు నేతి మిఠాయి దుకాణం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే రవికుమార్
- మన ప్రకాశం పుస్తకావిష్కరణ
- ఘనంగా జయంతి వేడుకలు

అద్దంకి: ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా అద్దంకి బంగ్లారోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి ఎమ్మెల్యే రవికుమార్ బుధవారం రాత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గీతామందిరంలో జరిగిన కార్యక్రమంలో మన ప్రకాశం రెండవ ముద్రణ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తెలుగు ప్రజల అభ్యున్నతి ఆకాంక్షించిన మహోన్నత వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం కలగడం తన అదృష్టమన్నారు. ప్రకాశంపంతులు బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు, కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, కుందుర్తి అనంత రామకృష్ణ, వీరవల్లి రుద్రయ్య, దివాకర్ దత్తు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామకృష్ణ, చిట్టాబత్తిన ఫణీంద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశంపంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బలరాం, చైర్‌పర్సన్ దయామణి తదితరులు



మన ప్రకాశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్, ప్రకాశం మిత్ర మండలి సభ్యులు

ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో..

ప్రకాశం పంతులు జీవితాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బంగ్లా రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి ఆయనపూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం వద్ద ఎమ్మెల్సీ బలరామకృష్ణమూర్తి, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ పరిమి దయామణి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు, నాగినేని రామకృష్ణ, ప్రకాశం మిత్ర మండలి సభ్యులు కుందుర్తి అనంత రామకృష్ణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, సందిరెడ్డి శ్రీనివాసరావు, వీరవల్లి రుద్రయ్య, టంగుటూరి ప్రకాశం, పరిమి ఏబు, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా రామాంజనేయులు, మన్నం త్రిమూర్తులు, జ్యోతయ్య, బాషా, బోడ్డపాటి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు ఎంఆర్‌సీ భవనంలో ఎంఈవో కోటేశ్వరరావు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనను విజయవంతం చేయాలి

అద్దంకి: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెల 28న విజయవాడ వస్తారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎన్.రమేష్‌నాయుడు కోరారు. బుధవారం అద్దంకిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గోవింద్, జిల్లా నాయకులు కాకర్ల ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, విష్ణు, శిరీష, సుజాత, తమ్మన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుట్టావారిపాలెంలో విజిలెన్స్ దాడులు

సంతమాగులూరు: పుట్టావారిపాలెం వద్ద బుధవారం విజిలెన్స్ అధికారులు అధికలోడుతో వెళుతున్న వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలపై రూ.2.15లక్షలు అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ సీఐ అజయ్‌కుమార్,నాయక్ తెలిపారు.

విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలి

బల్లికురవ: సీజనల్ వ్యాధులు తలెత్తకుండా విద్యార్థులనుక కాచి చల్లార్చిన మంచినీటిని అందించాలని తహసీల్దార్ సుధాకర్ ఆదేశించారు. బుధవారం బల్లికురవ కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రక్షిత పథకం ద్వారా వస్తున్న తాగునీరు కలుషితంగా ఉందని, వాటిని కాచి చల్లార్చి అందించాలని ఆయన చెప్పారు. పాఠశాలలో ఉన్న తాగునీటి సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. మెను ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్ఐ కోదండరామ్ పాల్గొన్నారు.

26 నుంచి గాలికుంటు నివారణకు టీకాలు

అద్దంకి రూరల్: గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు టీకాలు వేయటం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం అద్దంకి పట్టణంలోని పశువైద్యశాలలో గోపాలమిత్ర, పశుమిత్రలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో పశువులకు గాలికుంటు సోకే ప్రమాదముండటంతో గ్రామాల్లో పర్యటించి టీకాలు వేయాలని సూచించారు. ఈ టీకాలను 3 నెలలలోపు లేగ దూడలకు, 10 నెలల చూలు పశువులకు వేయకూడదని ఆయన వారికి చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరిని చంద్రన్న బీమాలో చేర్పించాలి

అద్దంకిరూరల్: గ్రామాల్లో అర్హత కల్గిన ప్రతి ఒక్కరిని చంద్రన్న బీమా పథకంలో చేర్పించాలని ఏపీఎం వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం అద్దంకి వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంమాట్లాడుతూ గడపగడపకు తిరిగి చంద్రన్న బీమాలో పేర్లు నమోదు చేయాలని గ్రామ సంఘాల వీవోలేకు సూచించారు. ఇప్పటి వరకు సభ్యులుగా చేరి సహజ మరణం పొందినట్లయితే వారికి రూ.30వేలు మాత్రమే చెల్లించేవారని, ప్రస్తుతం ఈ బీమా మొత్తాన్ని ప్రభుత్వం రూ.2లక్షల వరకు అందజేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద రుణాలు విడుదలయ్యాయని, గ్రామాల్లో అవసరమైన వారిని గుర్తించి వారికి రుణాలు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ బి.వెంకట్రావు, హార్టికల్చర్ ఏపీఎంఆషాలత, సీసీలు బి.రమేష్‌బాబు, విజయరాణి పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక అభినందనీయం

బల్లికురవ: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థి నవోదయకు ఎంపిక కావడం అభినందనీయమని ఎంఈవో బి.వీరరాఘవులు అన్నారు. బుధవారం కొత్తపాలెం పాఠశాలలో 5వ తరగతి చదివిన ధూళిపాళ్ల లక్ష్మీదేవి నవోదయకు సీటు సాధించింది. ఈ సందర్భంగా ఎంఈవో ఆమెను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు ధూళిపాళ్ల శేషగిరి, రాణి, ఎస్‌ఎంసీ కమిటీ ఛైర్మన్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

పీడీకి పలువురి పరామర్శ

బల్లికురవ: జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ములుగోటి శ్రీనివాసరావు తండ్రి హనుమంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో హనుమంతరావు దశదిన కర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, అద్దంకి నియోజకవర్గ టీడీపీ నేత కరణం వెంకటేష్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, రవీంద్ర, మురళీ, పెంచల కిశోర్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సమితి ఛైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు, డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పీడీ శ్రీనివాసరావును పరామర్శించారు.

ఉపాధ్యాయుడికి గ్రామస్థుల సన్మానం

సంతమాగులూరు: కొప్పరం పంచాయతీ నెహ్రూనగర్ కాలనీలోని పాఠశాలల గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న భీమవరపు రామకృష్ణారావును గ్రామస్థులు, తోటి ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. గ్రామస్థులు బంగారపు ఉంగరం బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ముస్తఫా, పుల్లారావు, శేషగిరి పాల్గొన్నారు.

తెగుళ్లను తట్టుకునే వంగడాలు ఎంచుకోండి : ఏవో

మేదరమెట్ల: రైతులు మినుము పంటలో కొల్లాకు తెగులు తట్టుకొనే పాలీష్ రకం టిబిజి 104 రకాన్ని విత్తుకోవాలని ఏవో ప్రసాదరావు తెలిపారు. బుధవారం మేదరమెట్లలో ఆయన వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేఖరులతో మాట్లాడారు. మినుము పంట వేసే రైతులకు ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, లేదా రెండు టన్నుల కోళ్ల ఎరువు దుక్కిలో వేసుకోవాలన్నారు. కూరగాయాల పంటలు వేసుకునే రైతులు సెప్టెంబర్ మొదటి వారంలోగా వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు శ్రీలేఖ, నవ్యశ్రీ, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో సీసీరోడ్డు నిర్మాణం : ఎమ్మెల్యే

అద్దంకి: అద్దంకి పట్టణంలోని మెయిన్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడం జరుగుతుందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. మెయిన్ రోడ్డులో సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని బుధవారం రాత్రి పరిశీలించారు. ఆ క్రమణలు తొలగించిన తరువత రెండు వైపులా సీసీరోడ్డు విస్తరించాల్సిన అవసరం ఉన్నందున తక్షణమే నివేదిక తయారు చేసి మున్సిపల్ శాఖా మంత్రి దృష్టికి తీసుకుపోవాలని కమిషనర్ నారాయణరావుకు సూచించారు. రెండు వైపులా సీసీరోడ్డు విస్తరించకుండా సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనం ఉండదని ఎమ్మెల్యే రవికుమార్ అభిప్రాయపడ్డారు. సైడ్ డ్రైన్‌ల నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికంగా సిమెంట్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసిన తరువాత సెంటర్ లైటింగ్ తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావొచ్చు : ఎంపీడీవో

మేదరమెట్ల: కార్పొరేషన్ రుణాల కోసం 2015-16, 2016-17, 2017-18 సంవత్సరంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ, ఎస్టీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను బ్యాంక్ అధికారులతో కలిసి నిర్వహించారు. 2017-18గాను మండలంలో ఎస్సీ రుణాల కోసం 938, ఎస్టీ 118, కాపు రుణాల కోసం 213, బీసీ రుణాల కోసం 570, శాలివాహన కార్పొరేషన్‌కు 26, మైనార్టీలకు 41 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. గురువారం బీసీలు, కాపులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

పంగులూరు: పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మైనార్టీ, ఎస్టీ రుణ లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 94 మంది హాజరయ్యారు.

అద్దంకి: అద్దంకి పట్టణంలోని ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ పరిమి దయామణి, కమిషనర్ నారాయణరావు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు. ఎస్టీ కార్పొరేషన్‌కు సంబంధించి 24 యూనిట్లు ఉండగా 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. 39 మంది హాజరయ్యారు. ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 11 యూనిట్లు ఉండగా 97 మంది దఖాస్తు చేసుకొని 59 మంది హాజరయ్యారు. క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 3 యూనిట్లు ఉండగా ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకొని హాజరయ్యారు.

అద్దంకి రూరల్: అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీపీ అరుణ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హేమాద్రినాయుడు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి మండలానికి 88 యూనిట్లు ఉండగా 884 మంది దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. అయితే ఇంటర్వ్యూలకు 381 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారన్నారు. ఆయా గ్రామాల సర్వీస్ బ్యాంకుల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వల్లెపు ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు ఇస్తర్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్ - జయ జానికీ నాయక
శ్రీరామ - ఆనందో బ్రహ్మ
వీఎన్ఎస్- నేనేరాజు-నేనేమంత్రి
మినీవిఎన్ఎస్ - లై

మేదరమెట్ల

నారాయణ చిత్రాలయ - జయ జానికీ నాయక

బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు 29కి వాయిదా

వేటపాలెం: వేటపాలెం మండల పరిషత్ కార్యాలయంలో 2017--18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్, వడ్డెర సొసైటీ, మెదర సొసైటీ, కల్లుగీత కార్మికుల సొసైటీల రుణాల మంజూరుకు గురువారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు ఈనెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో కె.నేతాజీ బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న కాపీ, ఒరిజనల్ సర్టిఫికెట్స్ కుల, ఆదాయ, ఆధార్, రేషన్, విద్యార్హత, పథకం అనుభవం, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఘనంగా ప్రకాశంపంతులు జయంతి




చీరాల ఎంపీడీవో కార్యాలయంలో, ఆదినారాయణపురం పాఠశాలలో ప్రకాశంపంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



వేటపాలెంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ తిరుమలాదేవి

చీరాలరూరల్ : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చీరాల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.కోటేశ్వరరావు ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డి.వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, మండల కో ఆప్షన్‌సభ్యుడు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. ఆదినారాయణపురం హైస్కూల్‌లో హెచ్‌ఎం భవనం బద్రిరెడ్డి అధ్యక్షతన టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు టి.ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. టంగుటూరి ప్రకాశంపంతులు జయంతిని చీరాల వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రమణమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకయ్య, అధ్యాపకులు నారపరెడ్డి, జాన్‌రాజ్, దాత్రికుమారి పాల్గొన్నారు.

చీరాలఅర్బన్ : వైసీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యడం బాలాజీ చీరాలలోని ప్రకాశంపంతులు విగ్రహానికి బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు సేవలను ఆయన కొనియాడారు. ఆయా జయంతి వేడుకల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ కొరబండ సురేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వారణాసి మల్లిఖార్జునరావు, వివేకానందసేవాసమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య, కోండ్రు బాబ్జీ, అన్నంరాజు సుబ్బారావు, దార్ల శాస్త్రి, కాంగ్రెస్ నాయకులు గుంటి ఆదినారాయణ, స్వచ్ఛంద సంస్థల, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేటపాలెం: వేటపాలెం మండలంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపీపీ బండ్ల తిరుమలాదేవి, ఎంపీడీవో నేతాజీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో ప్రకాశంపంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ర్యాతమ్మ, ఈవోఆర్‌డీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. బీబీహెచ్ కళాశాలల్లో జరిగిన ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో కరస్పాండెంట్ బండ్ల శరత్‌బాబు, ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం, ఏసుదాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

చీరాలఅర్బన్ : ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా ప్రతినిధి శ్రీనివాసరెడ్డిపై కర్నూలు జిల్లాలో జరిగిన దాడికి నిరసనగా ఈ నెల 24వ తేదీన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రైవేటు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీహెచ్.వెంకటేశ్వర్లు(ఎం.వీ), శ్రీరామమూర్తిలు వెల్లడించారు. బుధవారం చీరాలలోని పాపరాజతోట ఎస్‌జె రంగనాయకులు బాపనమ్మ కళ్యాణమండపంలో ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. అసోసియేషన్ ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, సత్యబాబు, శివప్రసాద్, రామకృష్ణ, సాగర్, దుర్గాప్రసాద్, ఫణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు అవగాహన

చీరాలరూరల్ : కౌలు రైతులు తాము కౌలుకు తీసుకున్న భూములకు సంబంధించి ఆధారాలు చూపి గుర్తింపు పొంది ప్రభుత్వ రాయితీలను పొందాలని ఏవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోందిలో భాగంగా వేరుశనగ పంటలను ఆయన సందర్శించారు. కౌలురైతులు గుర్తింపుకార్డులు పొందాలన్నారు. ఎంపీఈవోలు ప్రస్నకుమారి, సాంబశివరావు, ధీరజ్ పాల్గొన్నారు.

'విద్యా' విద్యార్థుల ప్రతిభ

చీరాలరూరల్ : ఏఎన్‌యూ దూర విద్యా నిర్వహించిన పీజీ పరీక్షా ఫలితాలలో చీరాల ఎన్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచినట్లు ఆ కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నారిపెళ్ల ప్రకాశరావు తెలిపారు. కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎంఏ ఇంగ్లీష్ మొదటిసంవత్సరంలో పి.లక్ష్మీకాంతం 74.8శాతం, ద్వితీయసంవత్సరంలో ఎ.అనూషారత్నం 73.4శాతం, ఎం.ఏ తెలుగు మొదటి సంవత్సరంలో పి.సీతాలక్ష్మి 84.2, ద్వితీయసంవత్సరంలో ఎన్.లక్ష్మీతిరుపతమ్మ 81.4శాతం మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కె.రమేష్‌బాబు, కోర్స్ ఇన్‌చార్జి డి.బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

వేటపాలెం: సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం లాభదాయకంగా ఉంటుందని ఏవో పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం అక్కాయిపాలెం వడ్డెసంఘంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ వరి సాగుకు ముందు రైతులు విత్తనశుద్ధి చేయాలన్నారు. దీనివల్ల వరిలో వచ్చే అగ్గితెగులు నివారించుకోవచ్చని ఆయన చెప్పారు. ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.శ్రీనివాసరావు, ఎం.గోపీకృష్ణ, కుసుమకుమారి, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

చీరాలటౌన్ : వినాయకచవితి సందర్భంగా జరిగే నిమజ్జనాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రేమ్‌కాజల్ హెచ్చరించారు. చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఆమె వినాయక పందిర్ల కమిటీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విగ్రహానికి పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వర్షాకాలం అయినందున విగ్రహాల వద్ద విద్యుత్ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రాత్రిపూట పందిర్ల వద్ద కమిటీసభ్యులలో ఒకరు కాపలా తప్పనిసరని చెప్పారు. నిమజ్జనాలకు సూచించిన రూట్లలోనే తీసుకెళ్లాలన్నారు. పందిర్ల వద్ద అసభ్య నృత్యాలకు అనుమతి లేదని, మద్యం తాగి అల్లరికి పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వన్‌టౌన్ ఎ స్‌ఐ విజయ్‌కుమార్, టూటౌన్ ఎస్‌ఐలు వెంకటకృష్ణయ్య, పున్నారావు, రూరల్ ఎస్‌ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

కంప్యూటర్ అసెంబ్లింగ్‌పై శిక్షణ

చీరాలరూరల్: కంప్యూటర్ అసెంబ్లింగ్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థినులు హార్డ్‌వేర్ రంగంలో స్వయం ఉపాధి పొందవచ్చని ప్రిన్సిపాల్ సీహెచ్.రమణమ్మ పేర్కొన్నారు. చీరాల వైఏ ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాలలో బుధవారం బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థినులకు కంప్యూటర్ అసెంబ్లింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో ఫస్ట్‌సోర్స్ సొల్యూషన్స్ సంస్థ సీనియర్ అడ్మినిస్ట్రేటర్ సత్యనారాయణ, కంప్యూటర్ విభాగాధిపతి శైలజారాణి, అధ్యాపకులు ప్రహర్షిత, బాలత్రిపురసుందరి, దీప్తి మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో సమయపాలన పాటించని సిబ్బంది

చీరాలఅర్బన్ : చీరాల ఏరియా వైద్యశాలలో వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఉదయం సమయానికి వైద్యశాల సూపరింటెండెంట్, దంత వైద్యులు, కంటి వైద్యులు, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. కీలకంగా ప్రతి ఒక్కరూ వాడే నొప్పుల మాత్రలైన డైక్లోఫినాక్ సరఫరా లేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. డైక్లోఫినాక్ బదులుగా పారాసెటిమాల్ ఇచ్చి పంపటం విశేషం. అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ అందించటంలో సంబంధిత సిబ్బంది వైద్యులు చెప్పాల్సిందేనంటూ తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వైద్య వసతులు ఉన్నా వైద్యులు ఎక్కువ సమయం కేటాయించలేక పోవడం, వైద్యుల కొరత వల్ల ఉన్న వారికి పనిభారం పెరగటంతో వైద్యసేవలు సంపూర్ణంగా అందటం లేదన్న విమర్శలు ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చీరాలరూరల్ : చీరాల మండలంలో మైనార్టీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం చీరాలలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్‌కు 118 మంది దరఖాస్తు 23మంది ఇంటర్యూలకు హాజరయ్యారు. ఎస్టీ కార్పొరేషన్‌కు 72 మంది దరఖాస్తు చేసుకోగా 33మంది హాజరయ్యారన్నారు. గురువారం కాపు, బీసీ అభ్యర్థులకు ఇంటర్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వేటపాలెం: వేటపాలెం మండల పరిషత్ సమావేశం హాల్లో ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల తిరుమలాదేవి, ఎంపీడీవో కె.నేతాజీ, వేటపాలెం, దేశాయిపేట సర్పంచ్‌లు కర్పూరపు రమాదేవి, లేళ్ల శ్రీధర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పురపాలకసంఘ కార్యాలయాన్ని సందర్శించిన అమెరికన్ ప్రొఫెసర్లు



వివరాలు తెలుసుకుంటున్న ప్రొఫెసర్లు

చీరాలఅర్బన్ : రాష్ట్రంలోని పురపాలక సంఘ కార్యాలయాల్లో అమలు జరుగుతున్న ఈ-గవర్నెన్స్ విధానం, పురసేవా యాప్‌ల ఖ్యాతి అమెరికా దేశస్తులను సైతం అబ్బురపరిచింది. దీనికి తార్కాణమే బుధవారం అమెరికాలోని ఎంఐటీ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్లు చింతన్, నిఖితలు చీరాల పురపాలక సంఘ కార్యాలయ సందర్శన. మున్సిపల్ పరిధిలో అధికారుల కోసం తిరగాల్సిన అవసరం లేకుండా ఈ-గవర్నెన్స్ విధానంలోను, పురసేవయాప్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించే విధానం, వారికి పౌరసేవలు అందించటం తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు అమెరికాలోని ఎంఐటీ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్లు వచ్చారు. ఆయా అంశాలను మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు వారికి వివరించటంతో ఆయా వివరాలను వారు ఎంతో ఆసక్తిగా నమోదు చేసుకున్నారు. పురసేవ యాప్ ద్వారా తాను మున్సిపల్ సేవలను ఎలా పొందగలుతున్నానో ఆర్.వి.రమణ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లో వివరించిన తీరు వారిని ముగ్ధుల్ని చేసింది. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఎస్.గణపతి, అధికారులు మాల్యాద్రి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

చీరాలరూరల్ : చీరాల వీఆర్‌ఎస్ అండ్‌వైఆర్‌ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్‌చదువుతున్న 70మంది విద్యార్థులకు బుధవారం సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగడ వేణుగోపాల్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజించాలి

చీరాలరూరల్ : మట్టి వినాయకుని ప్రత్యేకతను తెలిపేవిధంగా చీరాల నోబుల్‌స్కూల్ ప్రాంగణంలో బుధవారం ముందస్తుగా గణనాథుడి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టితో, కూరగాయలతో వినాయక ప్రతిమలు చేశారు. వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.అశోక్‌బాబు పాల్గొన్నారు. పద్మశ్రీ ఘంటశాల చైతన్యవేదిక, నవ్యాంధ్ర చైతన్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం విఠల్‌నగర్‌లో మట్టివినాయకుల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టివినాయకుడిని పూజించాలన్నారు. సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర నాయకుడు రామకోటయ్య, కోట వెంకటేశ్వరరెడ్డి, కోట ఝాన్సీరాణి, గాదె హరిహరరావు, అక్కల వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం శ్రీ రాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అద్దె బస్సుల డ్రైవర్లను చులకనగా చూస్తే సహించం'

చీరాలఅర్బన్: అద్దె బస్సుల డ్రైవర్లను వేధిస్తూ వారిని చులకనగా చూస్తే సహించే ప్రసక్తే లేదని, అకారణంగా వేధింపులకు గురిచేస్తే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎన్.బాబూరావు హెచ్చరించారు. సీఐటీయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్‌ల మద్దతుతో హైర్ బస్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని, తొలగించిన డ్రైవర్‌ను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.బాబూరావు, ఏవీ.రమణ, ఎంఎస్.రావు, సజ్జన్‌రావు, రమేష్, నాగిరెడ్డి, ఖాశిం, వెంకటేష్ పాల్గొన్నారు.

చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	జయ జానకి నాయకా
సంగం	లై
సాయిప్యాలెస్	ఆనందో బ్రహ్మ
శాంతి	నేనే రాజు-నేనే మంత్రి

చంద్రన్న బీమా నగదు అందజేత

కురిచేడు : మండలంలోని గంగదొనకొండ గ్రామానికి చెందిన నరాల ఏడుకొండలు కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ మంగళవారం ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో మృతి చెందాడు. ఇతను చంద్రన్న బీమాలో సభ్యుడుగా ఉండటంతో భార్య తిరుపతమ్మకు బుధవారం వెలుగు సిబ్బంది మట్టి ఖర్చుల కోసం రూ. 5 వేలు అందజేశారు. మిగిలిన రూ. 25 వేలు త్వరలో బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని వారు తెలిపారు.

దశల వారీగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం

• శిద్దా సుధీర్‌బాబు

దొనకొండ : మండలంలోని అన్ని గ్రామాల్లో దశల వారీగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు నేతృత్వంలో చర్యలు చేపడుతున్నట్లు యువ పారిశ్రామికవేత్త, మంత్రి శిద్దా తనయుడు సుధీర్‌బాబు తెలిపారు. స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత దొనకొండకు చేరిన సుధీర్‌బాబును ఎంపీపీ నాగులపాటి గాలెమ్మ, శివకోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్ దుగ్గెంపూడి చెంచయ్య పూలమాలలతో స్వాగతం పలికారు. దొనకొండ వీవీపురంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాల గురించి మాజీ సర్పంచ్ మండ్లా అంతోనిపీటర్, ఒబ్బాపురంలో మినరల్ వాటర్‌ప్లాంట్, తాగునీటి నిమిత్తం ట్యాంకర్ల అనంతవరం, పెద్దన్నపాలెం గ్రామాల్లో రేషన్‌షాపుల ఏర్పాటు, పలు గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణాల కోసం నాయకులు సుధీర్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చర్యలు చేపడామన్నారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.బాలయేసు కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మగ్బూల్ అహమ్మద్, కొమ్మతోటి సుబ్బారావు, పత్తి వెంకటేశ్వర్లు, పురుషోత్తం సత్యానందం, షేక్ తోహీద్, నిమ్మకాయల సుబ్బారెడ్డి, పి.అనంతరాములు, ఎంపీ సురేష్ బాబు, బి.ఏడుకొండలు, యగ్నోని యల్లారెడ్డి, వడ్లమూడి చెన్నయ్య, కామేపల్లి చెంచయ్య, బొందల రాజు పాల్గొన్నారు.



సుధీర్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ తదితరులు

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం

దర్శి : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. మండలంలోని మోటుపల్లి, తిమ్మాయపాలెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్థికంగా రాష్ట్రం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సీఎం చంద్రబాబు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూసల సంజీవయ్య, వైస్‌ఎంపీపీ మారం శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమావతి, టీడీపీ నాయకులు పి. రమణారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలను నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు : పంటల వివరాలను చేయించుకోవాలని ఏవో జెడ్. శ్రీధర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఈదర, భీమవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వివరాలను నమోదు చేసుకుంటే వరదలు వచ్చినప్పుడు నష్టం వాటిల్లితే పరిహారం అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణకు చర్యలు గురించి వివరించారు. ప్రభుత్వం సబ్సిడీపై ఆయిల్ ఇంజన్లు, అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కిషోర్, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సేవే లక్ష్యం

దొనకొండ : రైతు సేవే ధ్యేయంగా రెవెన్యూ శాఖ ముందుకు వెళుతుందని తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ పట్టాదారు పాసుపుస్తకాల మంజూరుకు దరఖాస్తులు, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలు, భూముల ఆన్‌లైన్ సమస్యలపై రైతులతో చర్చించి తక్షణమే పరిష్కరించారు. రైతులు వివిధ అవసరాల నిమిత్తం వ్యవప్రయాసాలకు గురై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వీఆర్వోలు ప్రతిరోజు గ్రామాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, సర్వేయర్ సీహెచ్ వెంకటరావు, వీఆర్వో వై.గురువారావు పాల్గొన్నారు.

ఎర్రతెగుళ్లు నుంచి పత్తి పంటను కాపాడుకోవాలి

దొనకొండ : పత్తి పంటలో మెగ్నీషియం లోపం కారణంగా ఎర్రతెగుళ్లు వ్యాపిస్తుందని, నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో ఎశ్మైల జారాణి తెలిపారు. మండలంలోని పెద్దన్నపాలెం, చిన్నగుడిపాడు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తిపంటలో ఎర్రతెగుళ్ల, ఏండాకు తెగుళ్ల నివారణకు 1 శాతం మెగ్నీషియం సల్ఫేట్‌తో పాటు 2 శాతం యూరియా లేదా 1శాతం డై అమ్మోనియం పాస్ఫేట్ కలిపి 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు శివసుధాకర్, హైమవతి, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ముండ్లమూరు : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎంపీపీ మండలపు వెంకట్రావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 208 దరఖాస్తులు రాగా 50 మందిని ఎంపిక చేసినట్లు ఎంపీడీవో ఎం.వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బి.చూడామణి, వైస్ ఎంపీపీ షేక్ మదార్‌వలి, ఉల్లగల్లు, ముండ్లమూరు, దర్శి బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్స్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముండ్లమూరు మండలంలో భారీ వర్షం

ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం గంటసేపు భారీవర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని వీధులు పొరాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమై సాయంత్రానికి భారీ వర్షం పడింది. మారెళ్ళ, జమ్మలమడక, నూజిళ్ళపల్లి, సుంకరవారిపాలెం, తూర్పు కంభంపాడు భారీ వర్షం కురవగా, ముండ్లమూరు, వేంపాడు, శింగనపాలెంలో మోస్తరు వర్షం పడింది. ఈ వర్షానికి నూజిళ్ళపల్లి, సుంకరవారిపాలెంలో చెరువులకు భారీగా నీరు చేరింది.

బ్యాంకు ఖాతా నుంచి అక్రమంగా
నగదు ఉపసంహరణ

కురిచేడు : ఆన్‌లైన్ మోసానికి మరొక బ్యాంకు ఖాతాదారుడు బలయ్యాడు. ఎవరు ఫోన్ చేసి అడిగినా బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నెంబర్లు చెప్పవద్దని బ్యాంకు అధికారులు, ప్రభుత్వం ఎన్నిసార్లు మొత్తుకున్నా కొంతమంది అమాయకులు అపరిచితులకు చిక్కి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

రాజస్థాన్‌కు చెందిన సోనూ గోండూ అనే వ్యక్తి కురిచేడులో పానీ పూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం అతనికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాము సిండికేట్ బ్యాంకు అధికారులమని తన ఏటీఎం కార్డు పిన్, కార్డు వెనుక నెంబర్లు చెబితే కార్డును అప్‌డేట్ చేస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన సోనూ వారు అడిగిన వివరాలన్నీ చెప్పేశాడు. ఇంకేముంది తెల్లవారేసరికి అతని ఖాతాన ఖాళీ చేశారు. మొదట అతని ఖాతా నుంచి రూ. 3 వేలు విలువ చేసే వస్తువులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. తరువాత రూ. 10 వేలు రెండు సార్లు, మరొకసారి రూ. రు.2 వేలు లెక్కన వస్తువులను కొన్నారు. ఈ మెసేజ్‌లు సోనూ సెల్‌కు వస్తున్నా అతను పట్టించుకోలేదు. రాత్రి 12 గంటల తరువాత మరొక సారి రూ. 2 వేలకు కొనుగోళ్లు చేశారు. ఇక అతని ఖాతాలో రూ. 934 మాత్రమే ఉన్నాయి. తెల్లవారేక సెల్‌ఫోన్ మేజ్‌లు చూసుకుని బాధితుడు గొల్లుమన్నాడు. తన ఖాతా నుంచి డబ్బులు మాయమయ్యాయని తెలుసుకుని అయోమయానికి గురయ్యాడు. బ్యాంకుకు వెళ్లి జరిగిన విషయం తెలియజేశారు. వారు పరిశీలిస్తామని చెప్పారు. ఇకనైనా ఎవరూ బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్ చేసినా నమ్మవద్దని బ్యాంకు అధికారులు తెలియజేస్తున్నారు. ఇటువంటి మోసాలు అనేకం జరుగుతున్నాయని ఖాతాదారులు ఏటీఎం వివరాలు ఎవరికీ చెప్పవద్దని హితవు పలుకుతున్నారు.

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

కురిచేడు : కాపు, బీసీ కార్పొరేషన్ రుణాలకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని కురిచేడు మేజర్ పంచాయతీ ఈవో లంకా జానకి రామయ్య తెలిపారు.

ఇంటర్వ్యూలకు 61 మంది హాజరు

కార్పొరేషన్ రుణాలకు బుధవారం చేపట్టిన ఇంటర్వ్యూల కు 61 మంది హాజరయినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. స్థాని క మండల పరిషత్ సమావేశ మందిరంలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, ఎస్టీల రుణాలకు ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. ఎస్టీలు 37 మంది దరఖాస్తు చేసుకోగా 19 మంది, ముస్లింలు 47 మందికి 37 మంది, క్రిస్టియన్ ఆరుగురు దరఖాస్తు చేసుకోగా ఐదుగురు హాజరైనట్లు వివరించారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

కురిచేడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఉచిత బస్‌పాస్‌లను బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. వీటికి అయ్యే ఖర్చును సయ్యద్ మహ్మద్ జానీ భరించినట్లు ప్రధానోపాధ్యాయిని తెలిపారు. మొత్తం 50 బస్‌పాస్‌లకు రూ. 2,500 అతను సమకూర్చారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహ్మద్ జానీకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పొదిలి ఆర్టీసీ కండక్టర్లు షేక్ రఫీ, పీఎం రాయుడు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కంది పైరులో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి

దర్శి : ఇటీవల కురిసిన వర్షాలకు కంది పైరులో కలుపు అధికమైందని, నివారణ చర్యలు చేపట్టాలని ఏవో బి.సంగమేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని వెంకటచలంపల్లి, తానంచింతల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కందిపైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిలో పెరిగిన కలుపును నివారించకపోతే తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. ఆయకట్టు భూముల్లో సూక్ష్మపోషకాలను పెంపొందించేందుకు ప్రభుత్వం నూరుశాతం సబ్సిడీపై జింకు, జిప్సం, బోరాన్ అందిస్తుందని చెప్పారు. కౌలు రైతులు సాగు కార్డులు తీసుకొని సబ్సిడీ పథకాలను పొందవచ్చని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలను పాటిస్తే అధునాతన సాంకేతిక పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.వెంకట్రావు, ఎంపీఈవోలు బాషా, రవితేజ, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ముండ్లమూరు : మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద ఎస్సై బాలరంగయ్య బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న 16 వాహనాలకు సంబంధించి వాహనదారులకు రూ.1900 అపరాధ రుసుం విధించినట్లు ఎస్సై బాలరంగయ్య తెలిపారు.

ఇంటర్వ్యూ

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



ఎ.రాజేందర్, ఎంపీడీవో, దొనకొండ

ప్రశ్న: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో చర్చించి దోమల నివారణ, వీధుల్లో చెత్తాచెదారం తొలగింపు, మురుగు కాలువల్లో బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించేలా ఆదేశాలు జారీ చేశాం.

ప్ర: మంచినీటి సమస్యను ఎలా తీరుస్తున్నారు?

జ: నీటి ఇబ్బంది ఉన్న అన్ని గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం.

ప్ర: కార్పొరేషన్ రుణాలు మంజూరు చేశారా?

జ: అన్ని బ్యాంకుల అధికారులతో చర్చిస్తూ దశలవారీగా లబ్ధిదారులకు రుణాల మంజూరుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది దరఖాస్తులు చేసుకున్న వారికి ప్రస్తుతం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం.

ప్ర: మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయా?

జ: లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు జరుపుకునేలా చర్యలు చేపడుతూ సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నాం. మండలంలో మూడు పంచాయతీల్లో నూరుశాతం నిర్మాణాలు పూర్తిచేశాం. **- దొనకొండ**

సర్వేయర్ హద్దులు చూపాలి

కురిచేడు : మండల సర్వేయర్ తమ పొలానికి హద్దులు చూపకుండా పలుమార్లు తిప్పుకుంటున్నాడని పడమర వీరాయపాలెనికి చెందిన జల్లి వెంకటేశ్వర్లు ఆరోపిస్తున్నాడు. వారికి గ్రామంలో 599 సర్వే నంబరులో 101 ఎకరాలుండగా 5 మందికి 2.50 ఎకరాల చొప్పున 1990లో పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి భూమి హద్దులు చూపమని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ మధ్య కాలంలో కురిచేడు తహసీల్దార్ కార్యాలయ సర్వేయర్ భూమిని కొలతలు వేశారు. సబ్‌డివిజన్ చేసి ప్లాన్ ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా తిప్పుతున్నారని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే తమ పొలాలకు సంబంధించి హద్దులు చూపి సబ్‌డివిజన్ రికార్డు తయారు చేసి ఇవ్వాలని ఆయన కోరుతున్నారు.

సినిమాలు

దర్శి

వెంకటేశ్వర	: ఫిదా
శ్రీనివాస	: లై
శివశంకర్	: జయ జానికి నాయక
భాస్కర్	: నేనే రాజు నేనే మంత్రి

ధైర్యశాలి.. ఆంధ్రకేసరి

- ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

తాళ్లూరు : ధైర్యశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు పేద కుటుంబంలో జన్మించి, ఉన్నత చదువులు చదివి గొప్ప రాజకీయ వేత్తగా ఎదిగారని కొనియాడారు. ఎంపీపీ జి.మోషే మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో ముందుండి, బ్రిటీష్‌వారికి ఎదురొడ్డి నిలిచిన ప్రకాశం పంతులును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్పంచ్ ఐ.పెద్దరెడ్డి మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కష్ట, నష్టాలను ఎదుర్కొని, నిస్వార్థంగా ప్రజాసేవ చేసిన ప్రకాశం పంతులు మన జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సానికొమ్ము సత్యం, ఏపీవో సీహెచ్ సుధాకర్‌రావు, మండల కో ఆప్షన్‌సభ్యుడు కాలేషావలి, గ్రామకార్యదర్శులు షేక్‌నూరుల్లా, నూరుల్లా, మురళీకృష్ణ, సురేష్, శ్రీనివాసరావు, పిట్టుశ్రీను తదితరులు ఉన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాల వేస్తున్న జడ్పీటీసీ మారం, ఎంపీపీ మోషే



చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

కురిచేడు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి ఉత్సవం బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఆయన చిత్రపటానికి ఎంఈవో వస్రాం నాయక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రకాశం పంతులు జీవిత విశేషాల గురించి పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొనకొండ : మండలంలో ఆంధ్రకేసరి, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అనుమల్ల రాజేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి, నివాళులు అర్పించారు. ప్రకాశం పంతులు దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాల గురించి ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగులపాటి గాలెమ్మ, శివకోటేశ్వరరావు, ఉపాధి ఏపీవో దేవయ్య, ఈసీ కిశోర్‌బాబు, మండల పరిషత్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఈవీ రంగయ్య నేతృత్వంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు, వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు టంగుటూరి ప్రకాశం దేశం కోసం చేసిన సేవలను వేదికపై ప్రసంగించారు. ఉపాధ్యాయిని రత్నకుమారి చక్కటి గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎంఈవో వస్రాం నాయక్

దర్శి : పట్టణంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక నార్త్ పాఠశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి వయోజన విద్య నియోజకవర్గ సూపర్‌వైజర్ వై.చౌడిరెడ్డి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబును బంగాళాఖాతంలో కలిపేస్తాం



సభలో మాట్లాడుతున్న మధుసూదన్ యాదవ్

కనిగిరి : రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతూ, అనుచరులకు కాంట్రాక్టుల పేరుతో ప్రజాధనాన్ని కట్టబెట్టి అవినీతి పాలన చేస్తున్న సీఎం చంద్రబాబును బంగాళాఖాతంలో కలిపేస్తామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. కనిగిరి నియోజకవర్గంలో రూ. 1200 కోట్లు అభివృద్ధి చేశానని చెప్పుకునే ఎమ్మెల్యే కదిరి బాబూరావు కమీషన్ల పాలనకు చరమగీతం పాడుతామని ఆయన అన్నారు. బుధవారం పట్టణంలో నవరత్నాల సభ అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీపల్లి మండలంలో డయాలసిస్ రోగులను పరామర్శించేందుకు జగన్ రావడంతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగి కనిగిరిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు.కార్యక్రమంలో ఐటిసీ శ్రీను, ఓమెగా రామిరెడ్డి, బోర్రారెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, తమ్మినేని సుజాత, పాతకొట్టు రమణారెడ్డి, శ్రీహరిరెడ్డి, సుబ్బారెడ్డి, పిల్లి లక్ష్మినారాయణరెడ్డి, సానికొమ్ము రంగనాయకులురెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, నాగయ్యాయాదవ్, ఖాదర్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకానికి నాంది : నవరత్నాల హామీలు నెరవేర్చి నవశకానికి నాంది పలుకుతామని మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌ఆండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో శ్రీ ప్రగతి కన్వెన్షన్ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన నవరత్నాల సభలో ఆయన మాట్లాడారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే నీరుగార్చారని విమర్శించారు.

ప్రాధాన్యత క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

ముండ్లమూరు : కనిగిరి సబ్‌డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలోనే రైతులకు ట్రాన్స్‌ఫార్మాలు మంజూరు చేస్తామని డివిజన్ ట్రాన్స్‌కో డీఈ సీహెచ్ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన ముండ్లమూరు సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్ బకాయిల జాబితాను పరిశీలించారు. మండలంలో వ్యవసాయ, గృహ వినియోగదారుల, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 1. 50 కోట్ల మేర బకాయిలు ఉన్నాయన్నారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, వసూలు చేయాలన్నారు. మండలంలో 210 ట్రాన్స్‌ఫార్మార్లకు రై తులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 50 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ అందజేశామని, ప్రస్తుతం 75 యూనిట్లకు పెంచినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ అశోక్‌కుమార్, సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

మక్కెనవారిపాలెం (ముండ్లమూరు) : మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన 50 మంది పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ ఆధ్వర్యంలో రూ.2,76,775లను బోనస్‌ను డెయిరీ వినుకొండ ఏరియా మేనేజర్ యోగేశ్వరరావు బుధవారం పంపిణీ చేశారు. బోనస్ పంపిణీ చేయడం ద్వారా డెయిరీ మరింత అభివృద్ధి చెందుతుందని యోగేశ్వరరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ గ్రామ ప్రెసిడెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

తాళ్లూరు : ఎస్టీ, ముస్లిం మైనార్టీ రుణాల ఎంపికకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 96 మంది మైనార్టీ రుణాలకు ధరఖాస్తు చేసుకోగా 15 మంది హాజరయ్యారు. 10 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. 54 మంది ఎస్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా 13 మంది మాత్రమే హాజరయ్యరు. వీరిలో 9 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి హరిప్రసాద్, ఎంపీడీవో ఎస్.సత్యం, బ్యాంక్ మేనేజర్లు తాళూరు సాల్మన్‌రాజు, పివిరమణ, రుణాల కమిటీ సభ్యుడు శాగంకొండారెడ్డి, షేక్ పెదకాలేషా, మెలికాఅంజమ్మ, పాల్గొన్నారు.

కాగా, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో సానికొమ్ము సత్యం తెలిపారు.

ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతి

వెలిగండ్ల : ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి భారీగా చోటు చేసుకున్నట్లు బుధవారం వెలిగండ్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధిహామీ ప్రజావేదికలో వెల్లడైంది. ప్రజావేదిక సమావేశానికి ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీడీ భవానీ అధ్యక్షత వహించారు. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 2016-17 సంవత్సరాలకు సంబంధించి 1894 పనులకు రూ. 4.77 కోట్లు వ్యయం చేశారు. కూలీలకు రూ 2.89 కోట్లు, మెటీరియల్ కాంపోండ్ కింద రూ 1.88 కోట్లు వెచ్చించారు. పీఆర్ విభాగంలో 15 పనులకు రూ. 67.14 లక్షలు వ్యయం చేశారు. మండలంలో మొత్తం పనులకు రూ. 36.33 లక్షల మేర అవినీతి జరిగినట్లు వెల్లడైంది.

హనుమంతునిపాడులో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలి

కనిగిరి టౌన్ : హనుమంతునిపాడు మండల కేంద్రంలో పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ నాయకుడు షేక్ గులాం హుస్సేన్ డిమాండ్ చేశారు. స్థానిక దర్శి చెంచయ్య భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులతో ఏ అవసరం వచ్చినా హనుమంతునిపాడు నుంచి 15 కి.మీ. దూరంలో ఉన్న కనిగిరికి రావల్సివస్తుందని. దీని వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రజల ఇక్కట్లను గుర్తించి కనిగిరి నుంచి హనుమంతునిపాడుకు పోలీసుస్టేషన్ మార్చాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పకొట్టాలి

కనిగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పకొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జీవి కొండారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం సీపీఎం శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమైందన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

పీసీపల్లి : ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైకు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని జంగాలపల్లి సమీపంలో బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు అయ్యవారిపల్లికి చెందిన ఆదిరెడ్డి పీసీపల్లి పాలకేంద్రంలో పాలు క్యాన్‌లు దించి తిరిగి అయ్యవారిపల్లికి వెళ్తున్నాడు. చెరుకొమ్ముపాలెంకు చెందిన తిరుపతిరెడ్డి తన ద్విచక్ర వాహనంపై నేరేడుపల్లి నుంచి మురుగమ్మి వెళ్తున్నాడు. జంగాలపల్లి సమీపంలోకి వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న ఇద్దరి వాహనాలు ఢీకొనడంతో తిరుపతిరెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స కోసం కందుకూరులోని వైద్యశాలకు తరలించినట్లు తెలిసింది.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పీసీపల్లి : వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఎంపీడీవో డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఐఓబీ, సిండికేట్, ఇండియన్ బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలను నిర్వహించారు. బీసీ రుణాలకు 433 మంది దరఖాస్తు చేసుకోగా 289 మంది హాజరయ్యారు. కాపు రుణాలకు 26 మందికి 15 మంది, మైనార్టీ రుణాలకు 24కు 18 మంది, ఎస్టీ రుణాలకు 26కు ఐదుగురు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

28, 29న ఇంటర్వ్యూలు

వెలిగండ్ల : కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు ఈ నెల 28, 29 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 28న కాపు, బీసీ, మైనార్టీ, ఎస్టీలకు, 29న ఎస్సీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

కనిగిరి : కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ లు ఈ నెల 28న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతాయని ఎంపీడీవో పి.కోదండరామయ్య తెలిపారు.

పుస్తకాల పంపిణీ

పీసీపల్లి : పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ సుబ్బారావు సొంత నిధులతో బుధవారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సజ్జెక్టులతో పాటు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేమితో విద్యార్థులు విద్యకు దూరం కాకుడదనే ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక

పీసీపల్లి : ఉప్పుగుండూరులో ఈ నెల 26, 27 జరిగే రాష్ట్రస్థాయి టెన్నిస్, వాలీబాల్ పోటీలకు మండలంలోని పెద ఇర్లపాడుకు చెందిన 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు

కె.శిరిషా, మానస, లక్ష్మిసుజని, సుధారాణి, జోష్ణ, దివ్య, త్రివేణి, సుకన్య,మాధవి, లీలావతిలను హెచ్ఎం అనురాధ, పీడీ మురళి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు. పోటీలకు వెళ్లేందుకు ఖర్చుల కోసం లక్ష్మక్కపల్లికి చెందిన బద్దెల రత్నారెడ్డి రూ. 3 వేలు అందజేశారు.

పంటల వివరాలను నమోదుచేయించాలి

వెలిగండ్ల : పంటల వివరాలను ఈ - క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ఏవో షేక్ జైనులాబ్దిన్ సూచించారు. మండలంలోని గన్నవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. సూక్ష్మపోషకాలను ప్రభుత్వం నూరుశాతం సబ్సిడీపై ఇస్తుందని చెప్పారు.

పామూరు : పంటల వివరాలను ఈ - క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ఎంపీఈవో సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని రేణిమడుగు, అక్కంపేట గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

బడు ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ముండ్లమూరు : బడు ఈడు పిల్లలందరినీ ఈ నెల ఆఖరులోపు పాఠశాల్లో చేర్పించాలని సర్వశిక్ష అభియాన్ ఎంఎవో సామ్యేల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక విద్యావనరులో కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 1170 మంది బడి బయట పిల్లలను గుర్తించినట్టు చెప్పారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల్లో చేర్పించి అంకితభావంతో, గుణాత్మకమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంఎవో సాగర్, ఎంఈవో ఇండ్లా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ చంద్రమూర్తి, ఉమాదేవి, వెంకటేశ్వరు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయండి

వలేటివారిపాలెం: సిపిఎస్ రద్దుపై సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో జరుగు మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలని వలేటివారిపాలెం మండల బిటిఏ శాఖ ఉపాధ్యాయులకు ఒక ప్రకటనలో తెలియజేశారు. వలేటివారిపాలెం డిఆర్‌సి వద్ద జరిగిన సిపిఎస్ రద్దు పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సహాయకార్యదర్శి మెండా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పెన్షన్ పొందడం ప్రాథమిక హక్కు అని అన్నారు. ప్రతి ఉద్యోగి పోరాడి పెన్షన్ సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కొండలరావు, నాయకులు మోహన్‌రావు, ఆదినారాయణ, మాలకొండయ్య, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా రవికుమార్

లింగసముద్రం: లింగసముద్రం మండల వ్యవసాయాధికారి పూర్తి అదనపు బాధ్యతలతో బి.రవికుమార్ నియమితులయ్యారు. గుడ్లూరు మండల వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న రవికుమార్‌ను లింగసముద్రం మండల వ్యవసాయాధికారిగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి రెండు రోజులలో ఆయన విధుల్లో చేరనున్నారు.

206 యూనిట్లు మంజూరు

వలేటివారిపాలెం: 2017-18 ఆర్థిక సంవత్సరానికి వలేటివారిపాలెం మండలానికి ఎస్సీ,ఎస్టీ, బీసి కార్పోరేషన్‌ల నుండి 206 యూనిట్లు మంజూరైనట్లు ఎంపిడిఓ విజయ్‌శేఖర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారందరికి ఈ నెల 28న మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నట్లు తెలిపారు.

ఏరియా వైద్యశాలలో పండ్లు పంపిణీ

కందుకూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఏరియా వైద్యశాలలో బ్రాహ్మణ ఆర్యవైశ్య సేవా సమితి, ఆంధ్రకేసరి సేవాసమితిల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.

ఊరూర పశుగ్రాస క్షేత్రాలు

వలేటివారిపాలెం: ఊరూర పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పోకూరు పశువైద్యాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలోని శింగమనేనిపల్లి, నందలపూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ విస్తరణా ధికారి హర్షవర్ధన్, ఆత్మ ఏపిఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిఆర్‌ఆర్‌లో ఫ్రెషర్స్‌డే

కందుకూరు : స్థానిక టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించి తొలి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు స్వాగతం పలికారు.

26న విజిలెన్స్ సమావేశం

కందుకూరు : కందుకూరు డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఈనెల 26న సాయంత్రం 3 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరుగుతుందని సహాయ సాంఘిక సంక్షేమాధికారి కాకి కృపారావు బుధవారం తెలిపారు.

● సినిమాలు

కందుకూరు

రాజ్	- ఫిదా
యువరాజ్	- వైశాఖం
ప్రశాంతి	- ఆనందోబ్రహ్మ
కోటేశ్వర	- నేనే రాజు నేనే మంత్రి
రాఘవ స్క్రీన్-1	- జయ జానకి నాయక
రాఘవ స్క్రీన్-2	- లై

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

● **ఎమ్మెల్యే రామారావు**



తిమ్మారెడ్డిపాలెంలో అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే రామారావు

లింగసముద్రం: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు చెప్పారు. మండలంలోని తిమ్మా రెడ్డిపాలెం, యర్రా రెడ్డిపాలెం గ్రామ పంచాయతీలలో బుధవారం ప్రజా సమస్యలు పరిష్కారాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాలలో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అధికారులు వేగవంతంగా కృషి చేయాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడే పంటసంజీవని కుంటలు తవ్వించాలని ఎన్‌ఆర్‌ఈజిఎస్, ఉద్యానవన శాఖలకు ఆదేశించారు. యర్రారెడ్డిపాలెం గ్రామపంచాయతీలో ఉట్లవారిపాలెం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పోతుల శింగరపాలెంలోని ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ పక్కాగృహ నిర్మాణాలకు శంఖుస్థాపన చేశారు. లింగస ముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మండల ప్రత్యేకాధికారి కెవిఎస్ రమేష్, రాళ్ళపాడు డిఈ ।ధర్, ఎన్‌ఆర్‌ఈజిఎస్ ఏపిడి మస్తాన్‌రావు, మండల టిడిపి అధ్యక్షులు సిహెచ్ వీరబాబు, టిడిపి మాజీ అధ్యక్షులు చింతాసదానందం, ఎంపిపి కల్పన, జడ్పీటీసి ప్రభావతి, తదిత రులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవ వాల్‌పోస్టర్ల విడుదల

కందుకూరు : ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధితో పర్యాటక అభివృద్ధి ముడిపడి ఉందని, పర్యాటక రంగ అభివృద్ధితోనే ఏపి సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే పోతుల రామారావు పేర్కొన్నారు. సెప్టెంబరు 17న వరల్డ్ టూరిజం డేను పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ, ఏపి టూరిజం అథారిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకంపై అవగాహన కోసం వివిధ పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కందుకూరు డివిజన్ స్థాయిలో ఈ నెలాఖరు నుండి స్థానిక గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలలో క్విజ్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ, పేపర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం కళాశాలలో గోడపత్రికలను ఆవిష్కరించారు. కరస్పాండెంట్ సిహెచ్ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ప్రిన్సిపాల్స్ నవులూరి సుధీర్, అబ్బూరి వెంకటేశ్వర్లు, గీతా శ్రీనివాస్, ఆర్‌వి, ఎవిరావు, కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికలలో విజయం వైసీపీదే - ఎంపీ మేకపాటి



మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి

కందుకూరు : వచ్చే ఎన్నికలలో విజయం వైసిపిని వరిస్తుందని, జగన్ ముఖ్యమంత్రి కావటం ఖాయమని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహనరెడ్డి పేర్కొన్నారు. విలువలకు, నైతికతకు తిలోదకాలిచ్చి అవకాశవాద, స్వార్థ రాజకీయాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మరోదఫా భరించేందుకు ఈ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని ఆయన పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికలలో వైసిపికి విజయావకాశాలు ఉన్నాయని, కొద్ది మెజారిటీతో టిడిపి గెలిచినా అక్కడి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు పతనం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. నవరత్నాల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజ్ థియేటర్ వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వైసిపి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తూమాటి మాధవరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సమావేశంలో ఆపార్టీ నాయకులు రామాల శింగారెడ్డి, కొల్లూరి కొండయ్య, కె.వెంకటరామిరెడ్డి, షేక్ రఫి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

లింగసముద్రం: సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఏపి సిపిఎస్ఇఏ వారి ఆధ్వర్యంలో విజయవాడలో సెప్టెంబర్ 1న జరిగే మిలియన్ మార్చ్‌కు మండలంలోని అన్ని శాఖల సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యా యులు తరలి రావాలని లింగసముద్రం కేఆర్‌జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సూర్య ప్రకాశరావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం హైస్కూల్ ఆవరణలో ఏపిసిపిఎస్ఇఏ జిల్లా కౌన్సిలర్ డి.మధు ఆధ్వర్యంలో మిలినియన్ మార్చ్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు సిహెచ్ శ్రీధర్ బాబు, ఎస్‌కె బాబు, వెంకయ్య, రమణయ్య, కోటయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులలో నీటి సరఫరాకు చర్యలు

లింగసముద్రం: రాళ్ళపాడు -రోళ్ళపాడు రక్షిత మంచినీటి పథకం నుంచి రెండు రోజులలో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని కందుకూరు ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ కె వేణుగోపాల్‌రావు బుధవారం చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన రాళ్ళపాడు ప్రాజెక్టును మన్నేరులోని రాళ్ళపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈ రవిచంద్రకుమార్ కూడా ఉన్నారు.

బలహీనతలు వదులుకుంటేనే ఆదర్శనాయకత్వం

కందుకూరు : వ్యక్తిగత స్వార్థం, బలహీనతలను వదులుకుంటేనే ఆదర్శ నాయకునిగా ఎదగగలుగుతారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి , మూడు జిల్లాల నాయకత్వ శిక్షణ శిబిరం డైరెక్టర్ దాసరి రాజామాష్టర్ పేర్కొన్నారు. ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ నాయకత్వ శిక్షణ శిబిరం 113వ బ్యాచ్ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

కందుకూరు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోవూరు రోడ్డులోని ప్రకాశంపంతులు కాంశ్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమీషనర్ సిహెచ్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకాశం పంతులు జయంతి ఎమ్మెల్యే పోతుల రామారావు పాల్గొని నివాళులర్పించారు.

లింగసముద్రం: మండలంలోని పెదపవని భలేరావు జడ్పీ హైస్కూల్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు దాసరి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

కందుకూరు : ఎస్‌సి ఎస్‌టి, బిసి, మైనారిటీ, కాపు కార్పోరేషన్‌ల ద్వారా యాక్షన్ ప్లాన్ రుణాల మంజూరుకి లబ్దిదారుల ఎంపికకై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపిడిఓ జి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. బుధవారం ఎస్‌టి, మైనారిటీ కార్పోరేషన్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరయ్యారు. గురువారం బీసీ కార్పోరేషన్, కాపు కార్పోరేషన్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారులు హాజరుకావాలని కోరారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, కాపు కార్పోరేషన్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఉన్న అభ్యర్థులకు ఈనెల 24, 28తేదిలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కమీషనర్ సిహెచ్ శ్రీనివాసన్ పేర్కొన్నారు.

చుండి మోడల్‌స్కూల్‌తనిఖీ

వలేటివారిపాలెం: మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో రాష్ట్ర ఏఎండి వెంకయ్య బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను, రికార్డులను పరిశీలించారు. ప్రాజెక్టు వర్కు సొంతంగా తయారు చేయాలన్నారు. ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంఈఓ కాంతారావు, ప్రిన్సిపాల్ ఉషశ్రీ తదితరులున్నారు.

చంద్రన్న బీమా ఆర్థిక సహాయం అందజేత

కందుకూరు: పట్టణానికి చెందిన పర్రె ఆదిలక్ష్మి లివర్ వ్యాధితో బాధపడుతూ మంగళవారం ఒంగోలులోని వైద్యశాలలో మృతి చెందగా బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు చంద్రన్న బీమా పథకం కింద తక్షణ ఆర్థిక సహాయంగా 5వేల రూపాయలను అందజేశారు. బీమా మిత్ర టి. సునీత, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు బి. బాలకోటమ్మలు ఈ మొత్తాన్ని ఆమె నామినీ అయిన వెంకటేశ్వర్లుకి అందజేశారని ఇన్‌ఛార్జ్ కమీషనర్ సిహెచ్ శ్రీనివాసన్ తెలిపారు.

రోడ్ల వెంట పిచ్చిమొక్కల తొలగింపు

కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు 1వ వార్డులో బుధవారం ప్రారంభించారు. 1వ వార్డులో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లు, ఇతర పిచ్చిమొక్కలను మున్సిపాలిటీ జేసీబీతో తొలగించినట్లు ఇన్‌ఛార్జ్ కమీషనర్ శ్రీనివాసన్ తెలిపారు.

గ్రామాలలో ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమం

కందుకూరు: పంచాయతీల్లో ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమం నిర్వహించేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ జి.హనుమంతరావు ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి కార్యదర్శులకు, ఈవోఆర్డీలకు పలు సూచనలిచ్చారు.

27న ఏపీటీఎఫ్ సమావేశం

కందుకూరు : ఎపిటిఎఫ్ కందుకూరు మండల శాఖ సర్వసభ్య సమావేశం ఈనెల 27న మండల శాఖ అధ్యక్షుడు వి. రవి అధ్యక్షతన జరుగుతుందని ప్రధాన కార్యదర్శి ఎస్‌డి మునీర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంఆర్ టీకాతో బహుళ ప్రయోజనం

గుడ్లూరు: ఎంఆర్ టీకా వినియోగం వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఫ్యామిలీ ప్లానింగ్ నోడల్ అధికారి డాక్టర్ వసంతకుమారి తెలిపారు. మండలంలోని తెట్టు ఉపవైద్య కేంద్రాన్ని, గుడ్లూరులోని వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఏడి శనివారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేడు కొండపిలో విద్యుత్‌కు అంతరాయం

కొండపి: గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలో బీసీకాలనీ, దాసరెడ్డిపాలెం, ముక్కోటిపాలెంలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. కొండపిలో ఆర్అండ్‌బీ రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా రోడ్డు మార్జిన్‌లలోని విద్యుత్ స్తంభాలను మారుస్తున్నందున విద్యుత్ సరఫరా నిలివేస్తామని వివరించారు. గడచిన రెండు రోజులుగా కూడా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

23 మంది ఇంటర్వ్యూకు హాజరు

కొండపి: స్వయం ఉపాధి రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, మైనార్టీల దరఖాస్తుదారులు 23 మంది బుధవారం ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఎంపీడీవో ఎ. ప్రభాకరరావు తెలిపారు. ఇంటర్వ్యూ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాస్కరరెడ్డి, స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, కె. ఉప్పలపాడు (యూబీఐ), కొండపి (ఎస్‌బీఐ) బ్యాంకు అధికారులు పాల్గొన్నారన్నారు. గురువారంనాడు బీసీ, కాపు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన వివరించారు. దరఖాస్తుదారులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

కంది పంట పరిశీలన

ఇలవర (కొండపి): మండలంలోని ఇలవర, కొండపిలలో బుధవారంనాడు వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న కంది పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రాము రైతులతో మాట్లాడుతూ కంది పెరిగే దశలో ఉన్నందున ఆకుచుట్టు పురుగు సోకే అవకాశం ఉందని, నివారణకు మోనోక్రోటోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ 20 ఎం.ఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం తమ శాఖద్వారా రైతులకు డీజిల్ ఇంజన్లు, విత్తన ఎద గొర్రు సబ్సిడీపై అందజేస్తున్నామని, కావాల్సిన రైతులు తమను సంప్రదించాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో ఏఈవో టి. వెంకటేశ్వర్లు, ఎంపీఈవో ఎస్‌కె. నాగూర్ మీరావలి రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల అందజేత

పొన్నలూరు: పాఠశాలలకు గ్యాస్ సిలిండర్ అందజేత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపీపీ మండవ వీరకుమారి చేతుల మీదుగా బుధవారం నాడు గ్యాస్ సిలిండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండడానికి ఇబ్బంది పడకుండా ఉండడానికి ప్రభుత్వం పాఠశాలకు గ్యాస్ సిలిండర్లు మంజూరు చేసిందన్నారు. మండలంలోని 40 ప్రాథమిక పాఠశాలలకు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలకు, 6 జడ్పీ ఉన్నత పాఠశాలలకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇకపై గ్యాస్ పొయ్యిలపైనే మధ్యాహ్న భోజనాన్ని వండి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకాశం జీవితం యువతకు ఆదర్శం

టంగుటూరు: స్వాతంత్ర్య సమరయోధుడు ప్రకాశం పంతులు జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, సర్పంచ్ బెల్లం జయంతబాబు అన్నారు. ప్రకాశం జయంతి సందర్భంగా పంచాయితీ కార్యాలయ ఆవరణలోని ప్రకాశం విగ్రహానికి వీరంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం బ్రిటీష్ దొరల నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాడని, తాను న్యాయవాదిగా ఉంటూ ఆర్థికంగా బలపడుతున్నా దేశం కోసం తన సంపాదనను, వృత్తిని వదలి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నాడని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పోలీస్ ముష్కరులు ఆందోళనకారులపై తుపాకీ గురిపెట్టగానే ముందు తనను కాల్చమంటూ గుండె



ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎదురొడ్డిన ధైర్యశాలి అన్నారు. ప్రకాశం మన జిల్లా వారు కావడం గర్వకారణం అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఆంధ్రరాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, నిస్వార్థ ప్రజానాయకుడని, ప్రజా క్షేమమే తన జీవితాశయంగా భావించే వారన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోనూ ప్రకాశం జయంతి జరిపారు. ఆయన చిత్రపటానికి ఎంపీపీ, ఎంపీడీవో హనుమంతురావు పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు.

సింగరాయకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత సింగరాయకొండ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల నందు ఈ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంఈవో మాట్లాడుతూ తెలుగువారి ధీరత్వానికి ప్రతీక ఆంధ్రకేసరి టంగుటూరి అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై భగీరథరావు, ఉపాధ్యాయ సిబ్బంది సుధాకర్, హిమబిందు, మాధవీలత, ప్రభాకర్ పాల్గొన్నారు.



సింగరాయకొండలో ప్రకాశంకు నివాళి

పొన్నలూరు : టంగుటూరి ప్రకాశంపంతులు రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ మండవ వీరకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు దేశ ప్రజల కోసం తాను సంపాదించిన సొమ్మునంతా ఖర్చు చేశారన్నారు. నేటి యువతరం టంగుటూరు ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశసేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటనారాయణరెడ్డి, ఉన్నం శ్రీనివాసులు, తిరుపాలు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచనలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



పొన్నలూరులో టంగుటూరికి నివాళి

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే స్వామి
- మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

సింగరాయకొండ రూరల్: పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో 23 బహుళజాతి కంపెనీలతో మెగా జాబ్ మేళా బుధవారం నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు డోలాశ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చిందని పిఎన్‌సిపి విద్యా సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

బాబు వస్తే జాబు వస్తుంది అని చెప్పడానికి ఈ మెగా జాబ్ మేళా చక్కని ఉదాహరణ అని, ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే డా.డోలాశ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో 23 బహుళజాతి కంపెనీలతో మెగా జాబ్ మేళా బుధవారం నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న పీఎన్‌సీపీ విద్యా సంస్థలు ఆదర్శంగా నిలు



జాబ్‌మేళానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే స్వామి

స్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయని అన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని యువకులు నమ్మవద్దన్నారు. ఈ మేళాలో 964 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు హాజరు కాగా వారిలో 300ల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎంపికైన వారిని ఆయన అభినందించారు. అంతకుముందు టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తుచేశారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ గీతారాణి, చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కొనసాగిస్తామన్నారు. నిరుద్యోగులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 18004252422కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఎస్పీ శంకర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ ఈడీ సిరాజుల్లా, ఎంపీడీవో ఎస్‌కె జమీవుల్లా, డిప్యూటీ తహసీల్దార్ పుల్లారావు, ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజర్ మీరావలి, సోమరాజుపల్లి సర్పంచ్ పొనుగోటి చెంచమ్మ, ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య, జడ్పీటీసీ పొనుగోటి ఎస్తేరమ్మ, మాజీ సర్పంచ్ సందానిబాషా, సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు, కూనపరెడ్డి సుబ్బారావు, శీలం సుబ్రమణ్యం, పొనుగోటి కొండయ్య, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పొన్నలూరు: ముండ్లమూరివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కందుకూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 10వేల రూపాయల విలువ కలిగిన నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కందుకూరు జడ్పీటీసీ, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం బాగుపడాలంటే విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. రోటరీక్లబ్ ట్రెజరర్ చక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీక్లబ్ సహకారంతో స్కూలుకు డిజిటల్ క్లాసులను, బెంచీలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సెక్రెటరీ తానికొండ సురేష్, ప్రధానోపాధ్యాయులు బి మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న రోటరీ సభ్యులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

జరుగుమల్లి: రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలని వ్యవసాయాధికారి తిరుమల జ్యోతి తెలిపారు. ఎడ్లూరుపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కంది, జొన్న పంట సాగులో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సుధాకర్ ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.



కోటయ్య మృతికి నివాళి

కోటయ్య మృతికి విశ్రాంతి ఉద్యోగుల నివాళి

టంగుటూరు: టంగుటూరుకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు టంగుటూరి కోటయ్య (79) మంగళవారం మృతి చెందారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం కోటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోటయ్య 1963లో ఉపాధ్యాయుడిగా తన సేవలను ప్రారంభించి నిబద్ధతతో పని చేశారని, 1996లో విరమణ పొందారని వారు గుర్తుచేశారు. ఇక్కడ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏర్పాటులో ఆయన కీలకంగా వ్యవహరించి, ఈ సంఘానికి తొలి అధ్యక్షుడిగాత సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పీవీ శేషయ్య, తలారి యేసురత్నం, మిరియాల బాలకోటయ్య, ఎస్కె మౌలాలిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ

టంగుటూరు: గడచిన ఏడాది కాలంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై బుధవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా జరిగింది. ఉపాధి హామీ పథకం ద్వారా గత ఏడాది జూన్, 1 నుంచి ఈఏడాది మే 31 వరకు జరిగిన పనులపై ఈనెల 13నుండి మండలంలోని అన్ని గ్రామాల్లో 9వ విడత సామాజిక తనిఖీ జరిగింది. ఈఏడాది కాలంలో రూ6.81 కోట్ల విలువైన పనులు జరిగాయి. వీటిలో వేతనాలుగా రూ5.24 కోట్లు చెల్లించగా రూ1.57 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్‌గా చెల్లించారు. జరిగిన పనులపై క్షేత్రస్థాయి పరిశీలనకు సామాజిక తనిఖీ చేపట్టారు. సామాజిక తనిఖీ బృందాలు అన్ని పంచాయతీల్లో తాము గుర్తించిన అంశాలపై ఆయా గ్రామాల్లో గ్రామసభలూ ముగించారు. గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీపై బుధ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీఏ ఫైనాన్స్ మేనేజర్ వెంట్రామిరెడ్డి సారథ్యంలో జరిగిన ఈప్రజావేదికలో ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, ఎంపీడీవో సీహెచ్.హనుమంతరావు, ఏపీడీ బసవసుబ్బారావు, హెచ్‌ఆర్ మేనేజర్ గ్రీవెన్స్ సతీష్,ఎస్ఆర్‌పీ కనకారావు, జన్మభూమి కమిటీ సభ్యుడు బెజవాడ



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్

వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సామాజిక తనిఖీ బృందం గ్రామాలవారీగా తమ నివేదికలను ప్రజావేదిక ముందు సమర్పించింది. అత్యధిక గ్రామాల్లో జరిగిన పనుల కొలతల్లో వ్యత్యాసాలు కనిపించాయి. డీఆర్‌డీఏ అధికారులు వీటిన అంతగా పరిగణలోకి తీసుకో లేదు. పనులు జరిగి ఏడాది కాలం ముగియడంతో కొలతల్లో 5శాతం వ్యత్యాసాలు ఉడడం సహజం అన్నట్లు అధికారులు వ్యవహరించారు. కొన్ని గ్రామాల్లో కూలీలు చేసినట్లు చూపిన కుంటలు ఆతర్వాత ప్రొక్లేనర్‌తో చుట్టూ చదును చేసి నీరు చెట్టులో జరిగినట్లు చూపుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది అనుమానం వ్యక్తం చేసింది. జరిగిన పని తాలూకా కుంటలు లేదా చెరువులు తర్వాత నీరు చెట్టులో పెట్టి ప్రొక్లేనర్లతో కదిలించడం వలన ఇప్పుడు కొలతలు తీసుకోవడం వీలు పడలేదని వారు తెలిపారు. మూడు విడతల ఫొటోలు ఇవ్వలేదని, పని బోర్డులు పెట్టలేదని సామాజిక తనిఖీ సభ్యులు చెప్పారు. కొన్ని పనుల రిజిస్టర్లు లేవన్నారు.

ప్రజలు లేని ప్రజావేదిక

ప్రజా వేదికకు ఉపాధి కూలీలు లేదా ఇతర ప్రజలు ఎవ్వరూ హాజరు కాలేదు. దీంతో ఇది ప్రజలు లేని ప్రజావేదికగా సాగింది. ఉపాధి కూలీలు రాకపోవడానికి కారణాలు తెలిలియలేదు. గతంలో ముగిసిన 8విడతల సామాజిక తనిఖీ ప్రజావేదికకు అధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యే వారు. ప్రజాప్రతినిధులు కూడా వచ్చే వారు. ఈసారి వీరంతా రాకపోవడంతో ప్రజావేదిక వెలవెలబోయింది. సమస్యలు ఏమీ లేనందున కూలీలు ఎవ్వరూ ప్రజావేదికకు రాలేదని ఉపాధి హామీ సిబ్బంది చెప్పుకుంటున్నారు. కూలీలను, ప్రజలను ఈవేదికకు రాబట్టడంలో సిబ్బంది విఫలం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు దూరం

ప్రజావేదికకు ప్రజాప్రతినిధులంతా దూరంగా ఉన్నారు. పెద్దగా వీరు హాజరు కాలేదు. కొద్దిమంది ప్రజాప్రతినిధులు కొద్ది సేపు కనిపించినా వారు ప్రేక్షకులుగానే ఉన్నారు. మినహా ప్రజావేదికలో పాలుపంచు కోలేదు. ఒక్క వాసేపల్లిపాడు సర్పంచ్ రవిబాబు ఆ పంచాయతీ రిపోర్టు చదివాక వచ్చి హడావుడి చేశారు. తనకు చెప్పకుండా తమ సామాజిక తనిఖీ చేశారని, తనకు తనిఖీ వివరాలన్నీ చెప్పాలని పట్టుబట్టాడు. అయితే జరిగిన పనుల తాలూకా తనిఖీలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

జయంత్‌బాబు పాలన ఆదర్శం



జయంత్‌బాబు దంపతులను సత్కరిస్తున్న వెంకటస్వామి

టంగుటూరు: పంచాయతీలో ఆదర్శ పాలన అందిస్తూ, ప్రజలకు ఎనలేని సేవలందిస్తున్న సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు అభినందనీయుడని శాతవాహనా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు రావూరి వెంకటస్వామి కొనియాడారు. స్వాతంత్రదినోత్సవ సందర్భంగా జయంత్‌బాబు ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన సందర్భంగా బుధవారం శాతవాహన విద్యాసంస్థ తరుపున బుధవారం రాత్రి సర్పంచ్ బెల్లం దంపతులను ఘనంగా సన్మానించారు. సన్మాన సభలో వెంకటస్వామి మాట్లాడుతూ ఇక నుంచి టంగుటూరు పంచాయతీకి భవిష్యత్‌లో జయంత్ బాబు పాలన ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వ్యాపారవేత్తగా ఉంటూనే తాను స్వీకరించిన బాధ్యతను ఆయన సమర్ధవంతంగా నిర్వర్తిస్తు న్నారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు ఉత్తమ సేవలందించగలగడం గ్రామ ప్రజల అదృ ష్టం అన్నారు. ఇటీవల సర్పంచ్ కుటుంబం ఊరచెరువుపై నిర్మిం చిన వాకింగ్‌ట్రాక్ ఒక చారిత్రాత్మకమైనదిగా నిలచిపోతుందని, ఇది వారి కుటుంబం ప్రజ ల కోసం చేసిన సామాజిక సేవా కార్యక్రమం అన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పాలన సమిష్టి కృషి ఫలితమేనన్నారు.అందరి సహకారంతోనే తాను ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నానన్నాడు. కార్యక్రమంలో ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్,ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు బెజవాడ వెంటేశ్వర్లు, కామని విజయకుమార్ పా ల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చుకోండి : ఎమ్మెల్యే స్వామి

టంగుటూరు: ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా ప్రభుత్వ చేయూతనందుకొని పేదలంతా తమ సొంతింటి కల నేరవేర్చుకోవాలని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కోరారు.

2018-019 సంవత్సరానికి ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా మంజూరైన 386 పక్కా గృహాల లబ్దిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. పేదవాడి సొంత ఇంటికల నెరవేర్చేందుకు నిధులు పెంచి గృహాలు కేటాయిస్తుందన్నారు. పక్కా గృహాలు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవాలని, ముందు మంజూరైన వారు నిర్మించుకుంటే వెనుక వారికి మరికొన్ని ఇళ్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. గృహ లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. పసుకుదురు లాంటి మారుమూల ప్రాంతాలకు ఇళ్ల మంజూరీలో అధిక ప్రాధాన్యత ఇచ్చామని, పల్లెలన్నీ పక్కా గృహాలతో కళకళలాడాలన్నది ఆశయమన్నారు. ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ మాట్లాడు తూ పేదలంతా ఎన్టీఆర్ గృహ పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. పసుకుదురులో గుడిసెవాసులు గృహాలు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శర్మ, ఏఈ కోటిరెడ్డి, సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, ఎంపీటీసీలు భారతి, శ్రీదేవి, చిన్నమ్మాయి. హరిబాబు, అనంతలక్ష్మి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, కామని విజయకుమార్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ గృహాల ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే స్వామి, సర్పంచ్, ఎంపీపీ

టంగుటూరికి నివాళి

నందనవనం (జరుగుమల్లి): నందనవనం మోడల్ స్కూల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు ప్రకాశం పంతులు 145వ జయంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు ఎన్.చెంచురామయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం ధైర్య సాహసాలను, సేవా నిరతిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాదేశం, నా ప్రజలు అనే భావనతో విద్యార్థులు ఆదర్శంగా జీవించాలని ఆయన కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు ఏఎం ఇందిర మాలతి, బెజవాడ శ్రీనివాస్, ఎం.సురేష్‌బాబు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చాకెట్లు పంచారు.

దశాబ్దాలుగా పూరిగుడిసెల్లోనే నివాసం

వలేటివారిపాలెం: కాకర్లపాలెం, ఉప్పలపాడు, కూనిపాలెం, కళ్ళవళ్ళ తదితర గ్రామాలలో యానాదులు దశాబ్దాలుగా పూరిగుడిసెలలోనే నివసిస్తున్నారు. వారికి నివేశస్థలాలు లేక ఊరిచివరన రైతులు పొలాల్లో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. యానాదులకు నివేశస్థలాలు పక్కా గృహాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. యానాదుల కాలనీలలో ఎలాంటి మౌలిక వసతులు లేవు. ఇళ్ళ స్థలాల కోసం అనేకసార్లు నాయకులు, అధికారులకు వినతులు సమర్పించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. నివేశస్థలాల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం చూపుతున్నారు. పక్కాగృహాలు లేక ఊరిబయట పూరిగుడిసెలలో విషపురుగులు మధ్య జీవిస్తున్నామని యానాదులు విలపిస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మాత్రం మారడం లేదని అంటున్నారు. కాలనీలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు నివేశస్థలాలు పక్కాగృహాలు, విద్యుత్ రోడ్లు తదితర మౌలిక వసతులు లేవని యానాదులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నివేశ స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

జీఎస్‌టీని ఉపసంహరించుకోవాలి

పామూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పట్టణ వీడియో ఆండ్ ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చెన్నకేశవరావు, ఆవులూరి వెంకట నారాయణ డిమాండ్ చేశారు. జీఎస్‌టీకి నిరసగా పట్టణంలోని ఫోటో స్టూడియోలను బుధవారం మూసివేసి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక అనిల్ గార్డెన్ పంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.చెన్నకేశవరావు, ఉపాధ్యక్షుడిగా పి.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట నారాయణ, సహాయ కార్యదర్శిగా షేక్ రహంతుల్లా, కోశాధికారిగా కె.నరసింహులు, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బి.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి వేడుకలు

కనిగిరి : మండలం, పట్టణంలో ఆంధ్రకేసరి, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎస్‌కేఆర్ మానసిక దివ్యాంగులు, బదిరుల పాఠశాలల్లో వేడుకలను కారు స్టాండ్ యాజమాన్యం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు దేశాభక్తిని, దేశానికి చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో కారు స్టాండ్ యాజమాన్యం యర్రంశెట్టి శ్రీను, పి.శ్రీనివాసరావు, జి.అంజిరెడ్డి,షేక్ మొహిద్దిన్,ఎల్. మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసరావు, వెంకటాద్రి,కోటా శ్రీనివాసులు, పాఠశాల ఇన్‌చార్జి గోవింద రెడ్డిలు పాల్గొన్నారు.

పామూరు : మండలంలోని కందురోల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రకాశం పంతులు జన్మదిన వేడుకలను ఘనంగా ని ర్వహించారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకం కావాలని హెచ్‌ఎం మన్నే హరినాథ్‌రెడ్డి పేర్కొ న్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ మితికెల నారాయణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వెలిగండ్ల : జయంతి వేడుకలను స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురవయ్య, శ్రీను, సురేష్‌బాబు, చెంచయ్య, కృష్ణారెడ్డి, మాధవరావు, ఆదినారాయణ, సంపత్, రజిని, గౌసున్ని, హసిని, పద్మజ, వరలక్ష్మి, బాలచెన్నమ్మ పాల్గొన్నారు.

పీసీపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంఆర్సీలో ఎంఈవో నరసింహారావు, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో హెచ్‌ఎంలు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కనిగిరి టౌన్ : ముప్పళ్ళపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.విజయలక్ష్మి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఉపాధ్యాయులు లక్ష్మినరసమ్మ, రాజశేఖర్, హిమబిందు, ధనలక్ష్మి, రామ్మోహన్ పాల్గొన్నారు.

సమావేశాలకు పూర్తి సమాచారంతో హాజరుకావాలి

● **అధికారులకు ఏఎంసీ చైర్మన్ దారపనేని సూచన**

పామూరు : మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఏపీవో ఎస్.మాచర్ల మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలతోపాటు ఆదనంగా మరో 50 వేల పని దినాలు కూలీలకు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉపాధి పథకం కింద మండలంలో కేవలం 32 మరుగుదొడ్లు మాత్రమే పెండింగులో ఉన్నాయని త్వరలో బిలులు అందజేస్తామన్నారు. ప్రస్తుతం ఉపాధి నిధులతో సీసీరోడ్లు, మామిడి, నిమ్మతోటల పెంపకం, పాఠశాలలో ఆట స్థలాలు, శ్మశనాలు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించగా రైతులకు ఉపయోగపడే సప్లై చానల్స్‌లో పూడిక తీత పనులు చేపట్టాలని ఏఎంసీ సూచించారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి ఎన్టీఆర్ గృహాలు చేయాల్సి ఉందని, 6200 మందికి సొంత గృహాలు లేనివారిగా పల్స్‌సర్వేలో గుర్తించడం జరిగిందన్నారు. గృహాలు మంజూరైన వారందరూ త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ బి. రామనాథం కోరారు.

మండలంలో ప్రస్తుతం తాగునీటి ఎద్దడి లేదని ఎక్కడైనా అవసరం ఉన్న చోట ట్యాంకర్లద్వారా నీటి సరఫరా చేయిస్తామని ఆర్‌డబ్ల్యూస్ ఏఈ మోహన్‌రావు తెలిపారు. ప్రపంచ బ్యాంకు నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకులు చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నామని, మరుగుదొడ్డి రహిత గ్రామాలుగా మండలాన్ని తీర్చిదిద్దాలని అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన సభ్యుల దృష్టికి తీసుకురాగా ఇంతవరకు నిర్మించుకున్న మరుగుదొడ్లకు బిల్లులు చెల్లింపులు జరగలేదని, ఎన్నిమార్లు సభ దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకునేనాథుడే లేడని ఎంపీటీసీ సభ్యురాళ్లు గంగసాని లక్ష్మి, గుంటుపల్లి సుబ్బలక్ష్మమ్మలు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. తాను మండలానికి కొత్తగా వచ్చానని, ఆర్‌డబ్ల్యూస్ అధికారి తెలుపగా సమావేశాలకు వచ్చేటప్పుడు అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తిసమాచారంతో రావాలని ఏఎంసీ దారపనేని సూచించారు. ఊరురా చంద్రన్న పశుగ్రాస క్షేత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి అమూల్య తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధులతో మండలంలో 12 సీసీరోడ్లు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో ఇరువైపులా ఒకేసారి సీసీరోడ్ల పనులు ప్రారంభించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఆప్రోచ్‌రోడ్డు వెయ్యకపోవటం వల్ల పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌ఆండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌పై దారపనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కోఅప్షన్ షేక్ ఖాజారహంతుల్లా, ఎంపీడీవో నాగభూషణరావు, పాల్గొన్నారు. సమావేశానికి ముందుగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి జయంతి సందర్భంగా సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించి, నివాళులు అర్పించారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ దారపనేని

పీసీపల్లి మండలాన్ని వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలో చేర్చాలి

కనిగిరి : జిల్లాలో కరువు కాటకాలకు నిలయమైన పీసీపల్లి మండలాన్ని వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలో చేర్చాలని రైతు సేవా సంఘ నాయకుడు వీరపనేని చెన్నయ్య బుధవారం చౌదరి ఒక ప్రకటనలో కోరారు. వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలో 29 మండలాలు ఉండగా పీసీపల్లి మండల ఆయకట్టు లే దన్నారు. మండలంలో కరువుతో పంటల సాగులేక రైతాంగం అప్పులపాలవుతున్నారన్నారు. పశుగ్రాసం కొరతతో పాడిపరిశ్రమ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లలో నీరు అడుగంటి నీటికి సమస్య తీవ్రంగా ఉందన్నారు.

బోరు బావుల పూడ్చివేత

పామూరు : నీరు పడలేదని వదిలేస్తున్న పలుబోరుబావులను కలెక్టర్ ఆదేశాల మేరకు గుర్తించి పూడ్చివేస్తున్నట్లు తహసీల్దార్ వై.మేర్సికుమారి తెలిపారు. పట్టణంలో పలుచోట్ల నిరుపయోగంగా ఉన్న బోరుబావులను వీఆర్వోలు ఆడప హరి, పరుసు రమేష్‌లు గుర్తించి పూడ్పించారు.

కంటి ఆపరేషన్లకు 390 మంది ఎంపిక

కనిగిరి : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కంటి శస్త్రచికిత్సల కోసం బుధవారం పెదకాకాని శంకర నేత్రాలయకు కంటి ఆపరేషన్లకు 390 మంది బుధవారం తరలివెళ్లారు. ఈనెల 6న డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసఫ్ స్కూల్‌లో మెగా నేత్రవైద్యశిబిరం జరుగగా కంటి ఆపరేషన్లకు 390 మందిని ఎంపిక చేశారు. వీరు ఐదు విడతలగా శస్త్ర చికిత్సలకు గుంటూరు జిల్లా పెద కాకాని శంకర నేత్రాలయకు వెళ్తున్నారు. ఈ ఆపరేషన్లు చేయించుకున్నవారు తిరిగి 25న కనిగిరికి చేరుకుంటారని ఉగ్ర కార్యాలయ ప్రతినిధి తెలిపారు. కార్యక్రమంలో ఉగ్రసేన నాయకులు యేల్చూరి మల్లికార్జున, శంకర్‌బాబు, సుధీర్, మనోజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల చట్టబద్ధతపై ఐఎంఏ వ్యతిరేకత బాధాకరం

కనిగిరి : ఆర్‌ఎంపీ, పీఎంపీలకు సీఎం చంద్రబాబు చట్టబద్ధత కల్పించగా ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వ్యతిరేకించి గ్రామీణ వైద్యులను కమీషన్ తీసుకునే దళారులుగా చిత్రీకరించడం బాధాకరమని కనిగిరి నియోజకవర్గ గ్రామీణుల వైద్యుల సంక్షేమ సంఘ సభ్యులు ఖండించారు. సంఘ ప్రతినిధులు బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలను గెటుగెదర్ అని తమ పీఆర్‌వోలచేత ప్రోగ్రాంలు పెట్టించి, ప్రలోభపెట్టిన వారు క్వాలిఫైడ్ డాక్టర్లనే విషయం మరిచిపోవద్దని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యసేవలకు 24 గంటలు అందుబాటులో ఉండి స్వల్ప చార్జీలు తీసుకుంటూ పేద ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. పరిధి దాటి తాము వైద్యం చేయడం లేదని, ఐఎంఏ ప్రకటన సరికాదన్నారు. సమావేశంలో షేక్ బాషా, సూరె రాజు, షేక్ నాయబ్‌రసూల్, కోమటిగుంట్ల చెన్నయ్య, పచ్చవ చంద్రశేఖర్, అన్నవరపు వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, రామకృష్ణ, చెంచులు, రామయోగయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

సీఎస్‌పురం (పామూరు) : మండలంలోని కోవిలంపాడు మండల ప్రాథమిక పాఠశాలకు చందలూరి పెద అల్లూరయ్య, నారాయణమ్మ దంపతులు బీరువాను సర్పంచ్ బీబీ దౌలత్ చేతుల మీదుగా బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు. దాతలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు సమకూర్చుకోవాలని టీడీపీ నాయకుడు దౌలత్ కోరారు.

జూదరుల అరెస్ట్

కనిగిరి టౌన్ : పట్టణంలోని పాతూరులో పేకాట ఆడుతున్న ఆరుగురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రూ. 3680 స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఉప్పు శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

30న ఫిషర్‌మెన్ సొసైటీ సమావేశం

పామూరు : ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యుల సర్వసభ్య సమావేశం మండలంలోని నుచ్చుపొద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 30న జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు కౌలూరి ఖాజారహంతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఒంగోలు మత్స్యశాఖ ఏడీ శేఖర్ బాబు, కనిగిరి ఏఎఫ్ఐ పొట్టయ్య పాల్గొంటున్నారని, కావున సొసైటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు అక్షర కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకలు

పామూరు : పట్టణంలోని స్థానిక అక్షర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కదిరి బాబూరంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే వేడుకలకు ముఖ్యఅతిథులుగా సర్పంచ్ డీవి మనోహర్, సీఐ ఎం.రాజేష్‌కుమార్, ఎస్సై ఉసా సాంబశివయ్య హాజరవుతారని చెప్పారు.

పోస్టల్ ఉద్యోగుల సమ్మె

కనిగిరి : పోస్టల్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారానికి చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం కనిగిరి ప్రధాన పోస్టల్ కార్యాలయం వద్ద సిబ్బంది ధర్నా నిర్వహించారు. జీడీఎస్ కమిటీ నివేదికలోని సానుకూల అంశాలను వెంటనే అమలు చేయాలని, జీడీఎస్‌లకు సివిల్ సర్వేంట్ హోదా కల్పించాలని, అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, కొత్తపథకాలు, కంప్యూటీకరణ పేరుతో ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులను ఆపాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని, ప్రయివేటీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దుచేయాలని, హాస్టల్ పెన్షనర్లకు సీజీఎస్‌హెచ్ వర్తింపచేయాలని, తపాలా శాఖలో ఆపరేటివ్ ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌బీఈ నాయకులు జి.వెంకటేశ్వర్లు,ఎస్. కృష్ణారావు, డీవి రమణమూర్తి, ఎస్. యానాది, కె.కొండయ్య, ఎల్.జానకిరామయ్య, ఎం.పోతులూరయ్య, డి.మాలకొండరాయుడు, ఎస్.మాలకొండయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

సినిమాలు •

కనిగిరి

శ్రీనివాస - జయ జానకి నాయక

ప్రజాసంఘాల సమావేశం

ఇంకొల్లు : యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ప్రజాసంఘాల సమావేశం జరిగింది. ఈ సదర్భంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వలేటి కృష్ణయ్య, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పెంట్యాల హనుమంతరావు, రైతుసంఘం నాయకులు కందిమళ్ళ కోటేశ్వరరావు, మాదాల అంజయ్య, యూటీఎఫ్ నాయకులు జి.ప్రభాకర్, శ్రీనివాసరావు, ప్రసాదు, బాబు, హరిబాబు పాల్గొన్నారు.

ద్రోణాదులలో శ్మశాన అభివృద్ధికి చర్యలు

ఎన్నారై వితరణతో వసతులు

మార్టూరు: అతను సాధారణ మధ్య తరగతి రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. కష్టపడి చదువుకుని అమెరికాలో మంచి ఉద్యోగం సాధించాడు. కొంతకాలం క్రితం తండ్రి చనిపోగా మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళితే అక్కడ కనీస వసతులు లేక ఎంతో ఇబ్బందికి గుర య్యారు. ఎంతోకాలం నుంచి ఇలా జరుగుతోంది. దీంతో సుమారు రూ.5 లక్షలకు పైగా వ్యయంతో శ్మశానంలో వసతులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయన అందరి అభినందనలు అందుకుంటున్నారు. ఆయనే ద్రోణాదులకు చెందిన నాగయోగిన రమేష్‌బాబు. ఉద్యోగ రిత్యా సాఫ్‌వేర్‌గా అమెరికాలో స్థిరపడ్డ ఆయన కుటుంబానికి గ్రామంలో 2 ఎకరాల పొలం ఉంది. తండ్రి పిచ్చియ్య చనిపోయినప్పుడు హిందు శ్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించడానికి ఎంతో ఇబ్బందులు పడ్డాడు. శ్మశాన వాటికలో లోతైన గుంటలు, చిల్లచెట్లతో వర్షం కురిస్తే తల దాచుకోవడానికి చిన్న రేకుల షెడ్ కూడా లేదు. ఈ నేపథ్యంలో శ్మశానం చుట్టూ ముప్పావు భాగం ప్రహరీ గోడ, మెయిన్ గేట్‌ను సొంత నిధులతో నిర్మించాడు. అంతేగాక శ్మశానం ఉన్న స్థలంలో మట్టి తోలించి మెరకగా ఏర్పాటు చేశాడు. కర్మకాండలు చేసుకోవడానికి రెండు గదులు శ్లాబుతో నిర్మింపజేయటమే కాక కైలాస నాథుడు విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.. ఇంకా మరిన్ని వసతులు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాడు.



శ్మశాన వాటిక ముఖద్వారం

నైపుణ్యంతో ఉన్నత ఉద్యోగావకాశాలు

ఇంకొల్లు : యువత నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందవచ్చని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ సీనియర్ అధ్యాపకులు ఎం.జితేంద్ర పేర్కొన్నారు. బుధవారం డీసీ ఆర్ఎం విద్యాసంస్థల్లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని డీసీ ఆర్ఎం విద్యాసంస్థల డైరెక్టర్ సీ.హెచ్.శ్రీధర్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్స్ డెవలెప్‌మెంట్ అధ్యాపకులు చింతల రవికిరణ్, అధ్యాపకులు అంజిరెడ్డి, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు-నాగరాజుపల్లి రోడ్డు పనులు ప్రారంభమయ్యేనా?



మార్టూరు-నాగరాజుపల్లి రోడ్డు దుస్థితి

- నిధులు మంజూరైనా నిర్మాణంలో జాప్యం
- ప్రతిపాదనలతో సరి

మార్టూరు: మార్టూరు-నాగరాజుపల్లి పల్లి ఆర్ అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం డబుల్ రోడ్డుగా విస్తరణ కోసం నాబార్డు నిధులు రూ.3.5 కోట్లు మంజూరు అయ్యాయి. హైవే లో నాగరాజుపల్లి సెంటర్ నుంచి నాగరాజు పల్లి గ్రామం మీదుగా 6.5 కి.మీ వరకు డబుల్ రోడ్డుగా మార్చాలని నిధులు మంజూరు అయ్యాయి. అంటే ఏడు మీటర్లు వెడల్పు వరకు తారురోడ్డుగా విస్తరిస్తారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా 1.5 మీటర్లు ఉండే విధంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేస్తారు. అందుకు సంబంధించి టెండర ప్రక్రియ ముగిసినప్పుడు ఒక వ్యక్తి కోర్టుకు వెళ్ళడంతో పనులు ఆగిపోయాయి. కానీ, ఆ తర్వాత కోర్టు సమస్య పరిష్కారం కావడంతో నాగరాజుపల్లి సెంటర్ నుంచి 600 మీటర్లు వరకు సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్స్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో మరలా అధికారులు కొత్తగా ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

ప్రస్తుతం ఉన్న సమస్య

మార్టూరు-నాగరాజుపల్లి రోడ్డు విస్తరణ దృష్ట్యా పాత తారురోడ్డును అక్కడక్కడ పగులగొట్టారు. చాలా చోట్ల రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. ముందు ఏదైనా వాహనం వెళితే వెనుక వాహనాలకు దుమ్ము ధూళి భరించాల్సిందే. రాత్రి పూట ప్రయాణం మరింత నరకంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఈ గ్రామానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వచ్చిన ప్రతి సారి రోడ్డు పనులు త్వరితంగా పూర్తి చేయాలని విన్నవించుకున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవకాశం ఉంటే మలుపులు సరిచేస్తా

బాబ్జి, ఆర్అండ్‌బీ జేఈ

ఈ విషయమై ఆర్ అండ్ బీ జేఈ బాబ్జిని వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి కొత్తగా పంపించిన ప్రతిపాదనలు రాగానే రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రోడ్డు మలుపుల వద్ద ప్రభుత్వ స్థలం ఉంటే రోడ్డు స్ట్రయిట్‌గా వేస్తాం.

టంగుటూరి ప్రకాశం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

పర్చూరు: ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధి చెందు శ్రీనివాసరావు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఆర్ఆర్ ఇంగ్లీష మీడియం పాఠశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, మహారెడ్డి అనసూయ పాల్గొన్నారు.



పర్చూరు ఎంఆర్ఆర్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఇంకొల్లు మండలంలో...

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం ఇంకొల్లులో ఘనంగా నిర్వహించారు. నాగులచెరువు కట్టపై ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాసవీక్లబ్ వ్యవస్థాపకుడు కొత్త మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఇంకొల్లులోని ప్రాథమిక పాఠశాల బాలబాలికలకు పాస్టర్ వడ్లూరి ఇస్రాయిల్ రాత ప్యాడ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఎ.మోహన్‌కృష్ణ, వాసవీక్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు, ఎంఆర్ఆర్ ప్రకాశం పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా చైతన్య యాత్ర

పర్చూరు(దేవరపల్లి): కౌలురైతు సంఘం, కేవీపీఎస్, సీఐటీయు, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను దేవరపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి కందిమళ్ళ రామకోటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా తవ్విన కుంటలను చెరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పెంట్యాల హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎస్.అనిల్, వి.బాలకోటయ్య, కట్టెంపూడి ప్రభుదాసు, రోశయ్య, చిన్న, మత్తె డేవిడ్, బేతా ఉదయభాస్కర్, గోపు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక మట్టి విగ్రహాల పంపిణీ

పర్చూరు: పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా వినాయక చవితి పండుగ సందర్భంగా భవనం అంజిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా చీరాల డీఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్ హాజరు అవుతారన్నారు. పర్చూరు ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు వారి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ

పర్చూరు: మండలంలోని చెరుకూరు గ్రామంలో బుధవారం నలుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున చంద్రన్న బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు దాసరి ఉషారాణి, టీడీపీ నాయకులు పాలేరు కోటేశ్వరరావు, మద్దిబోయిన నాగేశ్వరరావు, రాంబాబు, మాబులా, షఫీ, బీమామిత్ర కత్తి ఆషా పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ సంఘ కార్యవర్గం

పర్చూరు: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల సంఘ నూతన కమిటీ నియామకం బుధవారం స్థానిక ప్రగతి పాఠశాలలో జరిగింది. అధ్యక్షుడిగా బిరుదు నాగేశ్వరావు, కార్యదర్శిగా చందు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా తేళ్ళ వెంకట రాము, కోశాధికారిగా నాదెండ్ల లక్ష్మయ్యచౌదరి, కార్యవర్గ సభ్యులుగా వై.విజయభాస్కర్‌రెడ్డి, పి.డానియేల్, పి.ఫణిరాజ్, ఎం.యోహోషువా, కె.రమేష్‌బాబు, ఎర్రాకుల కాలేషాలను ఎంపిక చేసినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

యద్దనపూడి : గన్నవరంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఎస్సీ కాలనీలో రూ.65 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మండల టీడీపీ అధ్యక్షుడు రంగయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లపనేని వీరమ్మ, ఎంపీపీ దేవమ్మ, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై ఎన్ఎల్ఆర్-145 వరి విత్తనాలు

చినగంజాం : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎల్ఆర్ 145 వరి విత్తనాలు, 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి ఎన్.మేరమ్మ తెలిపారు.

లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

చినగంజాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఆయా బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

చినగంజాం : మధ్యాహ్నభోజనం కోసం 37 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, కడవకుదురు గ్రామసర్పంచ్ కత్తి లాజరు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, హెచ్ఎంర కె.భాస్కర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బాలబాలికలకు అన్నదానం

మార్టూరు: తహసీల్దార్ మధుసూదనరావు తన రెండేళ్ళ కుమార్తె హవిష జన్మదినం సందర్భంగా బుధవారం శారదా విద్యానికేతన్‌లో బాల బాలికలకు అన్నదానం చేశారు. వారితో రెండు గంటలు కుమార్తెతో కలిసి సంతోషంగా గడిపారు.

రోడ్లు, చెక్‌డ్యామ్‌ల పరిశీలన

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం, ఇసుకదర్శి, నాగరాజుపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన గ్రావెల్ రోడ్లను, చెక్‌డ్యామ్‌లను, కల్వర్టులను బుధవారం జిల్లాకు చెందిన క్వాలిటీ కంట్రోల్ అధికారి డీఈ జి.రవి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయన వెంట మండల ఇంజనీర్ ఎన్.రవికుమార్ ఉన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
మంచిమనిషి, నిత్యకృషీవలుడు,
మృధుస్వభావి, మాకు అత్యంత ఆప్తులు
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
నేడు రోటరిక్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులుగా
ప్రమాణ స్వీకారం చేయుచున్న
శుభతరుణంలో వారికి ఇవే మా
హృదయ పూర్వక శుభాకాంక్షలు...
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
అధ్యక్షులు, రోటరి క్లబ్ ఆఫ్ చీమకుర్తి
వాసవి గ్రానైట్స్
లగడపాటి శ్రీనివాసరావు
శ్రీ రాఘవేంద్ర గ్రానైట్స్
బూదవాడ
బి.శింగరకొండ
తులశమ్మ గ్రానైట్స్
బూదవాడ


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
కల్మషంలేని వ్యక్తిత్వం, చిరునవ్వుతో
పలుకరించే నైజం, దానశీలి,
మాకు మార్గదర్శకులు, యువ పారిశ్రామికవేత్త
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
నేడు రోటరిక్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులుగా
ప్రమాణ స్వీకారం చేయుచున్న
శుభతరుణంలో వారికి ఇవే మా
హృదయ పూర్వక శుభాకాంక్షలు...
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
అధ్యక్షులు, రోటరి క్లబ్ ఆఫ్ చీమకుర్తి
వాసవి గ్రానైట్స్
బి. అనిల్
సంతనూతలపాడు
ఎ. అమరనాథ్
బసవన్నపాలెం
మద్దిపాడు మండలం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
సేవాతత్పరులు, నిరాడంబరులు,
స్నేహశీలి, మంచిమనిషి
మాకు అత్యంత ఆప్తులు
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
నేడు రోటరిక్లబ్ ఆఫ్ చీమకుర్తి
అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం
చేయుచున్న శుభతరుణంలో వారికి
ఇవే మా హృదయ పూర్వక
శుభాకాంక్షలు...
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
అధ్యక్షులు, రోటరి క్లబ్ ఆఫ్ చీమకుర్తి
వాసవి గ్రానైట్స్
పి. ఉదయభాస్కర్
P.S. Rao గ్రూప్స్
బూదవాడ (కారంచేడు)
జి. మనోజ్
శ్రీ అయ్యప్ప ఇండేన్ గ్యాస్
సంతనూతలపాడు


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
సౌమ్యుడు, సహృదయశీలి, మృధు స్వభావి,
నిగర్వి, మాకు అత్యంత ఆప్తులు,
యువ పారిశ్రామికవేత్త
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
నేడు రోటరిక్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులుగా
ప్రమాణ స్వీకారం చేయుచున్న శుభతరుణంలో
వారికి ఇవే మా హృదయ పూర్వక
శుభాకాంక్షలు...
శ్రీ శిద్దా వెంకట సురేష్‌బాబు గారు
అధ్యక్షులు, రోటరి క్లబ్ ఆఫ్ చీమకుర్తి
వాసవి గ్రానైట్స్
నూకల సురేంద్రకుమార్
శ్రీ సత్యసాయి ఎక్స్‌పోర్ట్స్
చీమకుర్తి
గొల్లపూడి కోటేశ్వరరావు
2వ వార్డు కౌన్సిలర్, చీమకుర్తి
జి.కె. ఎక్స్‌పోర్ట్స్

ఆంధ్రజ్యోతి
ఒంగోలు
ప్రకాశం ● గురువారం 24 ఆగస్టు 2017

నేడు నగరంలో బీఎస్ఎన్ఎల్ రోడ్డుషో

ఒంగోలు వ్యవసాయం : బీఎస్ఎన్ఎల్ ఒంగోలు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఈ నెల 24వ తేదీ రోడ్డు షో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టెలికం జనరల్ మేనేజర్ బి.చంద్రసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు షోలో 3జీ సిమ్ ఉచితంగా ఇస్తామని, నెలకు రూ.49లకే ల్యాండ్‌లైన్ ఏర్పాటు చేస్తామని, రూ.249లకే నెలకు అన్‌లిమిటెడ్ ఇంటర్‌నెట్ సౌకర్యం, రాత్రి సమయంలో ఉచిత కాల్స్ ఇస్తున్నామని వివరించారు.

ఘనంగా ప్రకాశం జయంతి వేడుకలు


ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు


సీవీఎన్ రీడింగ్ రూంలో...

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీలు, పలు పాఠశాలల్లో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైసీపీ కార్యాలయంలో..

వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో నగర కమిటీ అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు, గంగాడ సుజాత, పల్లాల అనురాధ, బి. అరుణ, ఓబుల్‌రెడ్డి, కఠారి శంకర్, తోటపల్లి సోమశేఖర్, వల్లెపు మురళీ, రాయని వెంకట్రావు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో ...

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లాయర్‌పేటలోని ప్రకాశం విగ్రహానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. కార్యక్రమంలో విన్నకోట సురేష్, బి. ఆంజనేయులు, ఎన్. సుబ్బారావు, నాగేంద్రయాదవ్, ఎం. సుబ్బారావు, బి. బ్రహ్మయ్య, పవన్‌రాజు, భరత్ వినోద్, ఉంగరాల హనుమంతరావు పాల్గొన్నారు. మరో వైపు బీజేపీ నగర కమిటీ అధ్యక్షుడు మల్లిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోలి నాగేశ్వరరావు, ధనిశెట్టి రాము, కుంచాల సుబ్బారావు, రామదండు, కె. ఆంజనేయులు, టి. రాము పాల్గొన్నారు.

ఓపీఎస్‌లో..

మంగమూరు రోడ్డులోని ఒంగోలు పబ్లిక్ స్కూలులో జరిగిన వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ ఆఫ్ ప్రోగ్రామ్స్ పి. కదిరేశన్, ప్రిన్సిపాల్ పి. జమిమా, ఎం. శ్రీనివాసరావు, జి. కవితాలత, సింహాద్రి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సీవీయన్‌లో త్వరలో ఆంధ్రకేసరి విగ్రహం

ఒంగోలు కల్చరల్ : నగరంలోని సి.వి.యన్.రీడింగు రూము, క్లబ్‌లో త్వరలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. టంగుటూరి జయంతి సందర్భంగా క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఈదుపల్లి గురునాధరావు, సభ్యులు మొగిలిపువ్వు సత్యనారాయణ, గొర్రెపాటి సురేష్, డి.యం.క్రిష్టాఫర్, రావి వెంకటసుబ్బారావు, కె. నాగేశ్వరరావు, మిరియం రాంబాబు, బుర్రా రామారావు పాల్గొన్నారు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

రోటరీక్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో లాయరుపేటలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొర్రెపాటి రాజేంద్రరావు, యం.మాధవరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రామారావు, కొండయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో..

ఒంగోలు వ్యవసాయం : స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డీఈ డి.స్వామి, ఎన్‌టీపీపీ బి.సత్య నారాయణ, ఏఈ పుల్లయ్య, పీవో సుబ్రమణేశ్వరావు పాల్గొన్నారు.

శ్రీసూర్య విద్యానికేతన్‌లో...

ఒంగోలు విద్య : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నగరంలోని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అన్నవరప్పాడులోని శ్రీసూర్య విద్యానికేతన్‌లో నిర్వహించిన వేడుకలలో పాఠశాల కరస్పాండెంట్ రామాల వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ ఐరంగనాయకమ్మ, అకడమిక్ డైరెక్టర్ బి.ఎస్ఆర్‌శాస్త్రి పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో...

స్థానిక కోర్టు సెంటర్‌లో రవీంద్రభారతి హైస్కూలులో నిర్వహించిన టంగుటూరి జయంతి వేడుకల్లో స్వాతంత్ర పోరాటం సైమన్‌కమిషన్‌కు ఎదురొడ్డి ప్రకాశం పంతులు పోరాడిన సందర్భాలను ప్రదర్శించి విద్యార్థుల్లో దేశభక్తిని ప్రేరేపించారు. ఈకార్యక్రమంలో ఎంపి రెడ్డి, కరస్పాండెంట్ టి.రవిరాజ్, ప్రిన్సిపాల్ లక్ష్మీమరాజ్‌లు జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన టి. రాజ్ అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

ఒంగోలు క్రైం : జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పీసీసీ కార్యదర్శి గాదె లక్ష్మారెడ్డి, యాదాల రాజశేఖర్, నాయకులు పాశం వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు రామస్వామి, ఎస్.కె. రసూల్, పైడి యుగంధర్, పాలడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తలాక్ రద్దు పట్ల హర్షం

ఒంగోలు కలెక్టరేట్ : త్రిబుల్ తలాక్ చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును హర్షిస్తూ ఆంధ్ర ప్రదేశ్ మహిళా భ్యుద సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సమితి కార్యాలయం వద్ద ముస్లిం మహిళలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. సమితి అధ్యక్షురాలు టి. అరుణ, మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, షేక్ షంషదీబేగం, ప్యారీబేగం, సల్మాన్ బేగం, బీరం అరుణ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు కలెక్టరేట్ : జపాన్ షిటోరి యో కరాటే స్కూలు ఆఫ్ ఏపీ ఆధ్వర్యం లో రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే చాంపియన్-2017 పోటీల్లో ఆఫెక్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జూనియర్స్ కటాస్‌లో ఆయేషా సానియా, షాజిలా, సల్మా, సీనియర్స్ కటాస్ విభాగంలో తమీమ్, కార్తీక్, కరీ మ్‌లు కాంస్య పతకాలు సాధించారు. పత కాలు సాధించిన విద్యార్థులను స్కూలు డైరెక్టర్ మండాది శ్రీనివాస్ రెడ్డి, ప్రధానో పాధ్యాయుడు కె.శివకోటిరెడ్డి, కరాటే మాస్టర్ డి.ఎస్. కుమార్‌లు అభినందించారు.

ప్రైవేటు పాఠశాలల బంద్‌కు అప్సా మద్దతు లేదు

ఒంగోలు కార్పొరేషన్ : ప్రైవేటు పాఠ శాలల బంద్‌కు ఏపీ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (అప్సా) పాల్గొనడం లేదని అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి హరి బాబు వెల్లడించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో విద్యార్థిని మృతిపై విచారణ జరిపి, అందు కు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎన్. నాగభూషణం, కార్యదర్శి కె. ప్రభాకర్‌రావు, నాయకులు పి. సురేష్, సాయి శివరావు, ఎన్. రాజారావు, కరిముల్లా పాల్గొన్నారు.

సినిమా గైడ్

థియేటర్	సినిమా
సత్యం	ఫిదా
రత్నమహల్	ఆనందోబ్రహ్మ
గోపి	జయజానకి నాయక
సాయిసరోజ్	లై
తులసీరాం	జయ జానకి నాయక
జయరాం	నిన్నుకోరి

గోరంట్ల సినిమాస్ స్క్రీన్స్‌లలో----
నక్షత్రం, గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యానికి చట్టబద్ధత కల్పించటంపై హర్షం

ఒంగోలు నగరం : రాష్ట్ర ప్రభుత్వం పీఎంపీ, ఆర్ఎంపీల వైద్యానికి చట్టబద్ధత కల్పిస్తూ జీవో నంబర్ 465ను విడుదల చేయటంపై జిల్లా పబ్లిక్ మెడికల్ ప్రాక్టిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ తాము ఎంతో కాలంగా చేస్తున్న వృత్తికి నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా గుర్తింపు వచ్చిందన్నారు. శిక్షణ కాలంలో వైద్యకళాశాలల్లో, 104 వాహనాల్లో పనిచేయాల్సి రావటంతో ఇంకా అనుభవం పెరిగి మరింతగా మెరుగైన వైద్య సేవలను అందించగలుగుతామని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటరావు, సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

తోపుడు బండి ఇచ్చి ఆదుకోండి..

- కలెక్టర్‌ను వేడుకున్న వృద్ధురాలు

- సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్ : కుమారుడికి గుండె జబ్బు.. కుటుంబ పోషణ కష్టంగా మారింది.. వృద్ధాప్యం వేధిస్తోంది.. ఉండేందుకు ఇల్లూ లేదు.. కుమారుడిని పోషించుకునేందుకు కనీసం తోపుడు బండి ఇస్తే కూరగాయాలు విక్రయించుకొని కుమారుడిని కాపాడుకుంటానని వృద్ధురాలు కన్నీరు పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గోపాలనగరానికి చెందిన భయమ్మ అనే వృద్ధురాలు బుధవారం జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్‌ను కలిసి తమ దీనస్థితిని వివరించారు. స్పందించిన భయమ్మ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

39 మంది ఆర్ఐలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు కలెక్టరేట్ : రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం రాత్రి జరిగింది. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో డాక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. 39 మంది జూనియర్ అసిస్టెంట్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ)లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వీరికి జిల్లాలోని ఖాళీ పోస్టుల్లో నియమించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు సమాచారం.

న్యాయవాద చట్టసవరణ బిల్లు విరమించుకోవాలి

ఒంగోలులీగల్ : న్యాయవాద వృత్తిని, స్వతంత్రతను దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న న్యాయవాద చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అఖిలభారత న్యాయవాదుల సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు యడవల్లి రమేష్, జిల్లా అధ్యక్షుడు కె. శంకర్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకోర్టు ఎదురుగా బుధవారం అఖిలభారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాస్తారోకో నిర్వహించారు. ఐలు కోశాధికారి రహీమ్‌బేగ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన చిన్న చెరువుకు విముక్తి కల్పించాలి

ఒంగోలు రూరల్ : కొప్పోలు గ్రామ పరిధిలోని చిన్నచెరువు ఆక్రమణ చెరకు విముక్తి కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సర్వే నెంబరు 555లో చిన్నచెరువు ఉందని, ఇందులో వీఆర్వో షేక్‌జాన్‌బాషా ఆక్రమించి ఇల్లు నిర్మించడంతో పాటు చెరువు స్థలం చదును చేసి ఒక ఎకరం భూమి ఆక్రమించాడని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెరువును కాపాడాలని కోరుతున్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

ఒంగోలురూరల్ : ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డిప్యూటీ విద్యాశాఖాధికారి ఎ.దయానందం చెప్పారు. మండలంలోని కరవది జడ్పీ హైస్కూలును బుధవారం డిప్యూటీ విద్యాశాఖాధికారి ఎ.దయానందం పరిశీలించారు. నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల గతంలో 10వ తరగతిలో మంచి ఫలితాలు వచ్చాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని బోధించటం చేయాలని చెప్పారు. హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం పాఠశాల భోజనగదిని పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుని వసుధరాణిని అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


పతకాలతో విజేతలు, కోచ్

ఒంగోలు కార్పొరేషన్ : కేరళ రాష్ట్రంలో జరిగిన సీనియర్ జాతీయ, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఒంగోలు క్రీడాకారులు ప్రతిభ చాటారు. స్థానిక ఎంసీఏ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జాతీయ రెఫరీ, కోచ్ భక్తధృవుడు మాట్లాడారు. శర్మాకళాశాల సమీపంలోని భారతీయ వ్యాయామ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పలు పతకాలు సాధించారన్నారు.

తాగునీటి సమస్యపై టీడీపీ నగర కమిటీ దృష్టి సారించాలి

ఒంగోలు కార్పొరేషన్ : నగరంలో నెలకొన్న తాగునీటి సమస్యపై టీడీపీ నగర కమిటీ దృష్టి సారించాలని నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు చెప్పారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కమిటీ అత్యవసర సమావేశంలో నగర సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం వేసవి చెరువుల్లో నీరు లేని కారణంగా తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందన్నారు. ఆయా డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు నీటి సమస్య ఎదుర్కొవడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యను కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి దాయినేని ధర్మ, కార్యదర్శి షేక్ సైదా, నాయకులు నండూరి చంద్ర పాల్గొన్నారు.